


సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:168 | Vol-01 ::: Issue-168
హైదరాబాద్ 19 జనవరి 2026, సోమవారం | Hyderabad 19 January 2026, Monday
పేజీలు: 8, వెల: రూ. 5/- | Pages: 8, Rs. 5/-






## మమ్మల్ని టచ్ చేయొద్దు

- మంత్రులపై వార్తలు రాసే ముందు తన వివరణ తీసుకోవాలన్న సీఎం
- తన క్యారెక్టర్ అంత వీక్ కాదన్న డిప్యూటీ సీఎం
- మీడియా అధినేతల కొట్లాటలో శాండ్ విచ్ అవుతున్న తెలంగాణ మంత్రులు
- మీకూ మీకూ ఏదైనా ఉంటే తలుపులు మూసుకుని తేల్చుకోండి: సీఎం
- కోమటిరెడ్డిని కావాలనే టార్గెట్ చేశారా?
- నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల విషయంలో తప్పుడు కథనాలు: డిప్యూటీ సీఎం భట్టి
- వ్యవస్థీకృత నేరగాళ్ల నుంచి తెలంగాణ వనరులను కాపాడతాం: భట్టి

ఖమ్మం (ఏడీఎన్ఎన్) :

సింగరేణి బొగ్గు గనుల టెండర్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయంటూ వస్తున్న కథనాలపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిప్పులు చెరిగారు.సింగరేణి కోల్ మైనింగ్ టెండర్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు జరగలేదని, అణాపైసా అవినీతికి కూడా ఆస్కారం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణిలో కుంభకోణం జరిగిందంటూ కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న కథనాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఖమ్మం జిల్లా ఏదులాపురంలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ, పారదర్శకతపై కీలక వ్యాఖ్యలు చేశారు. టెండర్ల ప్రక్రియలో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా ఉందని,

...::: తరువాయి 2వ పేజీలో..



## మమత 'మహా జంగిల్ రాజ్'లో... చొరబాటుదారులు

### దేశ భద్రత కంటే ఓట్లు ముఖ్యమా?: ప్రధాని

### బార్డర్ లో ఫెన్సింగ్ ను అడ్డుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం

కోల్‌కతా (ఏడీఎన్ఎన్) :

గత 15 ఏళ్లుగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బెంగాల్‌ను 'మహా జంగిల్ రాజ్'గా మార్చారని, దీనికి ఈ ఏడాది జరిగే ఎన్నికలే ముగింపు కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. హుగ్లీ జిల్లాలోని సింగూర్‌లో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ ఆయన, మమతా బెనర్జీపై నిప్పులు చెరిగారు. రాజకీయ ప్రయోజనాల కోసం దేశ భద్రతను మమతా ప్రభుత్వం పణంగా పెడుతోందని ప్రధాని ఆరోపించారు. "టీఎంసీ ప్రభుత్వం చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంది. వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ రక్షణగా నిలుస్తోంది. దేశ సరిహద్దుల్లో ఫెన్సింగ్ వేయడానికి కేంద్రం ఎన్నిసార్లు భూమి కోరినా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోంది," అని మోదీ మండిపడ్డారు.

...::: తరువాయి 2వ పేజీలో..




## బెయిల్ 'శిక్ష'గా మారితే న్యాయం చచ్చిపోతుంది

జైపూర్ (ఏడీఎన్ఎన్) :

ఢిల్లీ అల్లర్ల కేసులో అరెస్టయి ఐదేళ్లుగా జైలులోనే ఉన్న జెఎన్‌యూ మాజీ విద్యార్థి నేత ఉమర్ ఖాలిద్ వ్యవహారంపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జైపూర్ సాహిత్య ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ, ఏ నిందితుడికైనా బెయిల్ ఇవ్వడం అనేది ప్రాథమిక నియమం కావాలని, దానిని నిరాకరించడం మినహాయింపు మాత్రమేనని స్పష్టం చేశారు. నిందితుడు నేరాన్ని పునరావృతం చేసే అవకాశం ఉన్నా, దేశం విడిచి పారిపోయే ప్రమాదం ఉన్నా, లేదా సాక్ష్యాలను తారుమారు చేస్తారన్న బలమైన ఆధారాలు ఉన్నా కూడా, ఈ మూడు ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే బెయిల్ నిరాకరించాలని ఆయన తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

...::: తరువాయి 2వ పేజీలో..



## ఆఫ్రికాలో వరద విలయం 100 మంది మృతి

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఆఫ్రికా దక్షిణ ప్రాంతాన్ని కుండపోత వర్షాలు వణికిస్తున్నాయి. మొజాంబిక్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా దేశాల్లో ప్రకృతి ప్రకోపం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ వరద విపత్తుల్లో ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి . లక్షలాది మంది తమ నివాసాలు కోల్పోయి నిరాశ్రయులుగా మారారు. రానున్న రోజుల్లో కూడా భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రజల్లో ఆందోళనలు మరింత పెరిగింది. మొజాంబిక్‌లో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో దాదాపు రెండు లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలాది ఇళ్లు పూర్తిగా నీటమునిగాయి. పంట పొలాలు కొట్టుకుపోవడంతో ఆహార కొరత భయం వెంటాడుతోంది.

...::: తరువాయి 2వ పేజీలో..

## ఇరాన్ లో ఆందోళన పర్వం 5,000 మందికి పైగా బలి..!

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు ఉగ్రరూపం దాల్చడంతో ఇప్పటివరకూ 5,000 మందికి పైగా మృతి చెందినట్లు ఇరాన్ ప్రభుత్వ ఉన్నతాధికారి అధికారికంగా వెల్లడించారు. మృతులు సాధారణ పౌరులు కాదని, ఆయుధాలతో విధ్వంసానికి పాల్పడిన అల్లరిమూకలు, ఉగ్రవాదులేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.



...::: తరువాయి 2వ పేజీలో..



## టిష్యూ పేపర్‌పై 'బాంబు' మెసేజ్..

### ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ !

లక్నో (ఏడీఎన్ఎన్) :

ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా వెళ్తున్న ఇండిగో విమానంలో (6E 6650) ఆదివారం ఉదయం పెను కలకలం రేగింది. విమానం గాల్లో ఉండగా బాంబు బెదిరింపు రావడంతో పైలట్లు అత్యవసరంగా లక్నో విమానాశ్రయంలో ల్యాండింగ్ చేశారు. విమానంలోని టాయిలెట్‌లో ఒక టిష్యూ పేపర్‌పై "విమానంలో బాంబు ఉంది" అని రాసి ఉండటాన్ని సిబ్బంది గమనించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మొత్తం 238 మంది ప్రయాణికులు , సిబ్బంది ఉన్న ఈ విమానాన్ని లక్నోకు మళ్లించి, ఉదయం 9:17 గంటలకు సురక్షితంగా దించారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. విమానాన్ని ప్రత్యేకమైన ఐసోలేషన్ బేకి తరలించి బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో అణువణువూ తనిఖీ చేశారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందికి దించి, వారి లగేజీని కూడా క్షుణ్ణంగా పరీక్షించారు. ఎంతో టెన్షన్ మధ్య జరిగిన ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని ఏసీపీ రజనీష్ వర్మ ధృవీకరించారు. విమానంలో 222 మంది పెద్దలు, 8 మంది చిన్నారులు , సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం. ఎవరో ఆకతాయి టిష్యూ పేపర్ ద్వారా ఈ బాంబు బెదిరింపు నాటకానికి తెరలేపి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. భద్రతా పరమైన ప్రోటోకాల్స్ అన్నీ పూర్తయిన తర్వాతే విమానాన్ని తిరిగి పంపనున్నట్లు అధికారులు తెలిపారు. విమానంలో ఉన్న ప్రయాణికులకు లక్నో విమానాశ్రయంలో అల్పాహారం, వసతి కల్పించినట్లు ఇండిగో సంస్థ ప్రకటించింది. టిష్యూ పేపర్‌పై ఆ మెసేజ్ రాసింది ఎవరు అనే కోణంలో భద్రతా ఏజెన్సీలు లోతుగా దర్యాప్తు చేస్తున్నాయి.



## ఎన్టీఆర్‌కు నివాళి

అమరావతి (ఏడీఎన్ఎన్) :

దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగువారిని 'మదరాసీ' అని అవహేళన చేస్తున్న కాలంలో, తెలుగుజాతికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. బీసీలకు రిజర్వేషన్లు, మహిళలకు ఆస్తిలో సమాన వాటా వంటి సామాజిక సంస్కరణలు ఆయన వల్లే సాధ్యమయ్యాయని, అదే స్ఫూర్తితో ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమ బాటలో పయనిస్తోందని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో భూములు, ఇసుక, మద్యం దోపిడీయే 'క్రెడిట్' అని చంద్రబాబు ధ్వజమెత్తారు. "ముఖ్యమంత్రి ఎక్కడుంటే అక్కడే రాజధాని అనడం జగన్ మోహన్ రెడ్డి అవివేకానికి నిదర్శనం. ఆయన బెంగళూరులోనో, ఇడుపులపాయలోనో ఉంటే అది రాజధాని అయిపోతుందా?," అని ఎద్దేవా చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో..



## సొంతగడ్డపై సిరీస్ కోల్పోయిన టీమిండియా

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

హోల్కర్ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత మూడో వన్డేలో భారత్‌కు నిరాశే ఎదురైంది. సిరీస్ విజేతను నిర్ణయించే ఈ కీలక పోరులో న్యూజిలాండ్ 41 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌ను కివీస్ 2-1తో సొంతం చేసుకుంది. భారత గడ్డపై న్యూజిలాండ్ ఒక వన్డే సిరీస్‌ను గెలవడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. కివీస్ బ్యాటర్లలో డారిల్ మిచెల్ (137) అద్భుత సెంచరీతో జట్టుకు వెన్నుముకగా నిలవగా, గ్లెన్ ఫిలిప్స్ (106) మెరుపు శతకంతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరి ధాటికి భారత బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది. 338 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (11) త్వరగానే వెనుదిరిగాడు. తర్వాత గిల్ (23), శ్రేయస్ అయ్యర్ (3), కె.ఎల్ రాహుల్ (1) వరుసగా పెవిలియన్ చేరడంతో టీమిండియా పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో విరాట్ కోహ్లి (124) తన క్లాస్ ఇన్నింగ్స్ తో వీరోచిత పోరాటం చేశాడు. 108 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో కోహ్లి అదరగొట్టినా, అవతలి వైపు నుంచి సరైన సహకారం అందలేదు. మధ్యలో నితీశ్ కుమార్ రెడ్డి (53) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, చివర్లో హర్షిత్ రాణా (52) మెరుపు ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు ఆశలు కల్పించారు. అయితే కీలక సమయంలో నితీశ్, హర్షిత్ వెనువెంటనే ఔట్ కావడం, ఆ తర్వాత కోహ్లి వికెట్ పడటంతో భారత పరాజయం ఖాయమైంది. భారత్ 46 ఓవర్లలో 296 పరుగులకు ఆలౌటైంది. కివీస్ బౌలర్లలో ఫౌల్క్స్, క్లార్క్ తలా మూడు వికెట్లతో భారత్ నడ్డి విరిచారు.



## ఒకసారి టచ్ చేసి చూడు... మేమేంటో చూపిస్తాం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

బీఆర్ఎస్ పార్టీ జోలికి వస్తే ఊరుకునేది లేదని, దమ్ముంటే ఒకసారి టచ్ చేసి చూడు, మేమేంటో చూపిస్తామని, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హెచ్చరిక జారీ చేశారు. ఖమ్మం సభలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆయన సోషల్ మీడియా వేదిక గా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా మాట్లాడటం మానేసి, ప్రతిపక్షాలపై అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హరీశ్ రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజకీయ జన్మనిచ్చిన పార్టీలను, వెన్నుపోటు పొడవటం అలవాటేనని, ఆయన డీఎన్ఏలోనే ద్రోహం ఉందని హరీశ్ రావు ధ్వజమెత్తారు.

...::: తరువాయి 2వ పేజీలో..

## ముఖ్యమంత్రి ముఠా నాయకుడిలా మారారు



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

బీఆర్ఎస్ దిమ్మెలను కూల్చివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి శాంతిభద్రతలను కాపాడాల్సింది పోయి, హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి అసలు ముఖ్యమంత్రిలా కాకుండా ఒక ముఠా నాయకుడిలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి అసాంఘిక చర్యలను ప్రోత్సహిస్తున్న సీఎం తీరుపై రాష్ట్ర డీజీపీ తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాప్ కావడంతో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేకనే సీఎంకు మతిభ్రమించిందని,

...::: తరువాయి 2వ పేజీలో..



## మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టాలి

ఖమ్మం (ఏడీఎన్ఎన్) :

బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ నాయకుడు కేసీఆర్‌ను వంద మీటర్ల గొయ్యి తీసి పాతిపెట్టాలని, ఊళ్లల్లో ఆ పార్టీ దిమ్మెలు కూల్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సభలో మాట్లాడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. అలా చేసినప్పుడే, నందమూరి తారక రామారావుకు, వైఎస్ రాజశేఖర్ రెడ్డికి నిజమైన నివాళులర్పించినవారమవుతామని కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అంతకు ముందు ఆయన, మున్నేరు లింక్ కెనాల్, జేఎన్టీయూ, నర్సింగ్ కళాశాలలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలని, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో బొందపెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

...::: తరువాయి 2వ పేజీలో..



## కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా..

### మహీపాల్ రెడ్డి 'కారె'క్కుతారా?

పటాన్‌చెరు (ఏడీఎన్ఎన్) :

పటాన్‌చెరు రాజకీయాల్లో ఒక్కసారిగా పెను సంచలనం చోటుచేసుకుంది. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే మహీపాల్ రెడ్డి తాను కాంగ్రెస్‌లో చేరి పెద్ద తప్పు చేశానని వ్యాఖ్యానించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పటాన్‌చెరులో తన ముఖ్య అనుచరులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం...

...::: తరువాయి 2వ పేజీలో..



## అనవసరంగా కెలికా... సారీ !

ముంబై (ఏడీఎన్ఎన్) :

భారతీయ సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. బాలీవుడ్‌లో మతపరమైన వివక్ష ఉందంటూ ఆయన చేసినట్లుగా ప్రచారం జరిగిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తడంతో, రెహమాన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆదివారం ఒక వీడియోను పోస్ట్ చేస్తూ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. "భారతదేశం నా ఇల్లు, నా ప్రేరణ, నా గురువు కూడా. ఎవరి మనోభావాలనూ గాయపరచాలన్న ఉద్దేశం నాకు ఎప్పుడూ లేదు," అని రెహమాన్ సంజాయిషీ ఇచ్చారు.

...::: తరువాయి 2వ పేజీలో..



## పసిడికి పోటీగా వెండి

ముంబై (ఏడీఎన్ఎన్) :

నిన్నమొన్నటి వరకు బంగారం ధర చూసి బెంబేలెత్తిన సామాన్యుడికి ఇప్పుడు వెండి కూడా 'చుక్కలు' చూపిస్తోంది. పసిడికి తోడబుట్టిన దానిలా కాకుండా, ఇప్పుడు దానికే పోటీ ఇస్తూ వెండి ధరలు అప్రతిహతంగా దూసుకుపోతున్నాయి. ఒక్క జనవరి నెలలోనే 22 శాతం పెరిగిందంటే, ఇది లోహం కాదు.. ఆకాశంలో ఎగురుతున్న రాకెట్ అని ఇన్వెస్టర్లు పండగ చేసుకుంటున్నారు. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి కేవలం ఒక 'జంప్' దూరంలో ఉంది. గత ఏడాది ఏప్రిల్‌లో రూ. 95 వేల దగ్గర ఉన్నప్పుడు "కొందాంలే" అని వాయిదా వేసిన వాళ్ల పరిస్థితి ఇప్పుడు "అయ్యో పాపం" అన్నట్లు తయారైంది. ఎందుకంటే అప్పటి నుంచి ఈ తెల్లని లోహం ఏకంగా 200 శాతం లాభాలను పంచిపెట్టింది. షేర్ మార్కెట్‌లో ఏవో కొన్ని కంపెనీలు ఇచ్చే 'మల్టీబ్యాగర్' రాబడులను, ఇప్పుడు వెండి ఏకంగా గల్లీల్లోనే చూపిస్తోంది. అసలు 2025 మొదట్లో దీనిపై ఎవరూ ఆశలు పెట్టుకోలేదు, కానీ అంచనాలన్నీ తలకిందులు చేస్తూ రూ. 2.50 లక్షల మార్కును అలవోకగా దాటేసింది. ఇంకొక 4 శాతం పెరిగితే చాలు, మూడు లక్షల మార్కుతో 'ట్రిపుల్ సెంచరీ' కొట్టేయనుంది.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
19.01.2026
www.manasarkar.com

## మమత 'మహా జంగిల్ రాజ్'లో... చొరబాటుదారులు

**మొదటిపేజీ తరువాయి....**
బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం రాగానే అక్రమ వలసదారులను రాష్ట్రం నుంచి తరిమికొడతామని ఆయన హామీ ఇచ్చారు. బెంగాల్‌లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని ప్రధాని విమర్శించారు. కేంద్రం అందిస్తున్న ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్ వంటి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజలకు అందకుండా మమతా బెనర్జీ అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. "బీహార్‌లో జంగిల్ రాజ్‌కు ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో, బెంగాల్ ప్రజలు కూడా అదే మార్గంలో ఉన్నారు. ఇక్కడ సిండికేట్ ట్యాక్స్, మాఫియా రాజ్యానికి కాలం చెల్లింది," అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. సందేశ్‌ఖాలీ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ.. మహిళలపై వేధింపులకు పాల్పడే వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆరోపించారు. కేవలం 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం ద్వారానే మహిళలకు, చిన్నారులకు పూర్తిస్థాయి భద్రత మరియు న్యాయం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా సింగూర్‌లో రూ. 830 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం జరుపుకుంటున్న తరుణంలో.. బెంగాల్ అభివృద్ధికి అదే స్ఫూర్తితో పనిచేద్దామని పిలుపునిచ్చారు.

## ఆఫ్రికాలో వరద విలయం 100 మంది మృతి

**మొదటిపేజీ తరువాయి....**
తాగునీటి వనరులు కలుషితమవడంతో కలరా, డయేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదముందని ఆరోగ్య శాఖలు అప్రమత్తం చేస్తున్నాయి. అత్యవసర సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి ఆహారం, తాగునీరు, ఔషధాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. మరోవైపు, జింబాబ్వేలో ఈ వరదలు 70 మంది ప్రాణాలను బలిగొన్నాయి. వరద ఉధృతికి వెయ్యికి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సహాయక బృందాలు చేరలేని ప్రాంతాల్లో ప్రజలు ఆహారం, నీరు లేక నానా అవస్థలు పడుతున్నారు. వరద నీటిలో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. క్రుగర్ నేషనల్ పార్క్‌లో చిక్కుకున్న సుమారు 600 మంది పర్యాటకులు, సిబ్బందిని హెలికాప్టర్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదల కారణంగా విద్యుత్ సరఫరా, రవాణా వ్యవస్థలు పూర్తిగా అస్తవ్యస్తమయ్యాయి. అమెరికా వాతావరణ హెచ్చరికల సంస్థ ప్రకారం, లా నినా ప్రభావమే ఈ అసాధారణ వర్షాలకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రభావం ఇంకా కొనసాగవచ్చని హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సహా పలు అంతర్జాతీయ సంస్థలు సహాయానికి ముందుకొచ్చాయి. దక్షిణ ఆఫ్రికా దేశాలు ఎదుర్కొంటున్న ఈ మహా సంక్షోభంలో ప్రాణ రక్షణే అత్యవసర కర్తవ్యంగా మారింది.

## కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా..

**మొదటిపేజీ తరువాయి....**
అప్పటి పరిస్థితుల దృష్ట్యా తప్పటడుగు వేసి కాంగ్రెస్ పార్టీలో చేరానని, కానీ ఆ నిర్ణయం వల్ల తన నియోజకవర్గానికి గానీ, ఇక్కడి ప్రజలకు గానీ, వ్యక్తిగతంగా తనకు గానీ కనీసం వెంట్రుక మందం కూడా లాభం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరించిన బీఆర్ఎస్ పార్టీపై ఆయన మమకారాన్ని చాటుకున్నారు.త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా మహీపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల్లో ఉన్న 104 మంది కౌన్సిలర్లను గెలిపించేందుకు విభాగాల వారీగా కష్టపడి పనిచేయాలని అనుచరులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశం అత్యంత గోప్యంగా జరిగింది. మీడియా ప్రతినిధులను లోపలికి అనుమతించకుండా, కేవలం అత్యంత సన్నిహితులు, అనుచరులతోనే ఎమ్మెల్యే సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే అసంతృప్తిగా ఉన్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఆయన చేసిన ఈ తాజా వ్యాఖ్యలు ఆయన త్వరలోనే అధికారికంగా 'కారెక్కబోతున్నారనే' ప్రచారానికి బలం చేకూరుస్తున్నాయి.

## కొనసాగుతున్న ఎదురు కాల్పులు..

**ఆరుగురు మావోయిస్టులు మృతి**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు అధికారికంగా ప్రకటించారు. నేషనల్ పార్క్ అడవుల్లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జి సున్నం చంద్రయ్య అలియాస్ పాపారావు, నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా ఉన్నారన్న నిఘా సమాచారం నేపథ్యంలో బలగాలు విస్తృత ఆపరేషన్ చేపట్టాయి. కాగా, శనివారం జరిగిన ఎదురుకాల్పుల్లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు. ఒక మహిళా మావోయిస్టు సహా నలుగురి మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అదే ప్రాంతంలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో మరో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47, .303 రైఫిల్, ఇన్సాస్ రైఫిల్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అడవుల్లో గాలింపు కొనసాగుతోంది.

## తల్లిదండ్రుల ఇంటి వద్ద కొత్త పెళ్లి కూతురు మృతదేహం

నూతన వధువు అనుమానాస్పదంగా మరణించింది. ఆమె మృతదేహాన్ని పోలీస్ అధికారి వాహనంలో తరలించారు. ఆమె తల్లిదండ్రుల ఇంటిబయట వదిలేశారు. వరకట్న వేధింపుల కారణంగా అత్తింటివారు తన కుమార్తెను హత్య చేసినట్లు ఆమె తండ్రి ఫిర్యాదు చేశాడు. బీహార్‌లోని సరన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పేడియా బజార్ ప్రాంతానికి చెందిన జయ ప్రకాష్ మహతో కుమార్తె సరితకు తొమ్మిది నెలల కిందట వైశాలి జిల్లాలోని కర్తహాన్ బుజుర్గ్ గ్రామానికి చెందిన సత్యేంద్ర కుమార్‌తో వివాహం జరిగింది. కాగా, జనవరి 16న తెల్లవారుజామున 12.30 గంటల సమయంలో జయ ప్రకాష్ ఇంటి ముందు నల్లటి స్కార్పియో వాహనం ఆగింది. అందులో ఉన్న వ్యక్తులు సరిత మృతదేహాన్ని ఆ ఇంటి బయట వదిలేసి వెళ్లిపోయారు. ఉదయం ఇంటి బయట ఉన్న కుమార్తె మృతదేహాన్ని చూసి ఆమె కుటుంబం షాక్ అయ్యింది. అదనపు కట్నం డిమాండ్ చేస్తున్న అత్తింటి కుటుంబం తన కుమార్తెను హత్య చేసి తమ ఇంటి బయట వదిలేశారని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరోవైపు పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. సరిత మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం తరలించారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. సరిత మృతదేహాన్ని తరలించిన స్కార్పియో వాహనం ముజఫర్‌పూర్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సంతోష్ రజక్ పేరుతో రిజిస్టర్ అయినట్లు గుర్తించారు. దీంతో సరిత మరణంతో పాటు ఆ వాహనానికి సంబంధించిన పోలీస్ అధికారి ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## పశ్చిమ బెంగాల్ లో ఆ పార్టీకే పగ్గాలు?




**కోల్‌కతా (ఏడీఎన్ఎన్) :**
త్వరలో పశ్చిమ బెంగాల్ లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఏ పార్టీ అధికారం చేపట్టనుంది అనే అంశంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల అంచనాలు, ఒపీనియన్ పోల్స్ వెలువడటం ప్రారంభమయ్యాయి. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రం అస్సాం ఈ ఏడాది ఎన్నికల బరిలో నిలవనున్నాయి. అస్సాంలో ఇప్పటికే బీజేపీ అధికారంలో ఉండగా, పుదుచ్చేరిలో ఆల్ ఇండియా ఎన్.రంగస్వామి కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీయేతర పార్టీలే అధికారంలో ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా కమలదళం వ్యూహాలను పదును పెడుతోంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడుపైనే బీజేపీ దృష్టి మొత్తం కేంద్రీకృతమైంది. తాజాగా జన్‌మత్ పోల్స్ సంస్థ పశ్చిమ బెంగాల్‌పై తన అంచనాలను ప్రకటించింది. రాష్ట్రాన్ని ఉత్తర, దక్షిణ బెంగాల్‌గా విభజించి, రీజియన్ వారీగా పార్టీలకు వచ్చే సీట్లు, ఓటింగ్ శాతాలను వెల్లడించింది.జన్‌మత్ అంచనాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లో మరోసారి తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి రానుంది. అది కూడా భారీ మెజారిటీతోనేనని పోల్స్ చెబుతున్నాయి. ముఖ్యమంత్రి మమత బెనర్జీ వరుసగా నాలుగోసారి అధికార పీఠాన్ని అధిరోహించే అవకాశాలు మెండుగా ఉన్నట్లు వెల్లడించింది. 294 స్థానాలున్న అసెంబ్లీలో టీఎంసీ 150 నుంచి 180 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేసింది. బీజేపీ 80 నుంచి 110 స్థానాల్లోనే పరిమితమవుతుందని, ప్రతిపక్ష స్థానంలోనే కొనసాగడం ఖాయమని జన్‌మత్ ఒపీనియన్ పోల్స్ స్పష్టం చేశాయి. వామపక్షాలు, కాంగ్రెస్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ కలిసి 15 నుంచి 25 సీట్లకే పరిమితం అవుతాయని పేర్కొన్నాయి. మొత్తం మీద బెంగాల్‌లో మమత హవానే కొనసాగుతుందని ఈ సర్వే తేల్చిచెప్పింది.ఈ ఏడాది మొత్తం నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో మూడు రాష్ట్రాలు దక్షిణాదికి చెందినవే కావడం విశేషం. ఒక్క అస్సాం మినహా మిగిలిన అన్ని చోట్ల నాన్-బీజేపీ పార్టీలు అధికారంలో ఉండటంతో, ఈ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మరోవైపు అధికార పార్టీలూ అధికారాన్ని నిలబెట్టుకునేందుకు హోరాహోరీ ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నాయి.




## మమ్మల్ని టచ్ చేయొద్దు

**మొదటిపేజీ తరువాయి....**
కేవలం అనుభవం ఉన్న సంస్థలకే పనులు కేటాయిస్తున్నామని సీఎం తెలిపారు. తమ కేబినెట్ మంత్రులపై, ముఖ్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై వస్తున్న కథనాలపై ఆయన ఘాటుగా స్పందించారు. మీడియా సంస్థల మధ్య ఉండే అంతర్గత విభేదాల్లోకి మంత్రులను లాగకండని, మీకు గొడవలుంటే తలుపులు మూసుకొని కొట్టుకోండని, కానీ ఆ నెపం మంత్రులపై వేయవద్దని సీఎం ఘాటుగా హెచ్చరించారు. మంత్రులపై వార్తలు రాసే ముందు కుటుంబ పెద్దగా తన వివరణ తీసుకోవాలని, మంత్రుల ప్రతిష్ట దెబ్బతింటే అది వ్యక్తిగతంగా సీఎం గౌరవానికి భంగం కలిగినట్లేనని హెచ్చరించారు. తప్పుడు వార్తల ద్వారా మారీచుడు, శుక్రాచార్యుడు వంటి శక్తులు బలపడేలా చేయవద్దని మీడియాకు ముఖ్యమంత్రి హితవు పలికారు. సింగరేణి టెండర్ల ఆరోపణలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా మండిపడ్డారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితం ఒక తెరిచిన పుస్తకమని, తన క్యారెక్టర్ అంత వీక్ కాదని స్పష్టం చేశారు. ఆస్తులు సంపాదించుకోవడానికి, వ్యాపార సామ్రాజ్యాలు కట్టడానికి రాజకీయాల్లోకి రాలేదని, తెలంగాణ వనరులను కాపాడటమే తన లక్ష్యమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, పారదర్శకతపై ఎవరికీ అనుమానం ఉండకూడదనే ఉద్దేశంతో 'నైనీ' బొగ్గు గని టెండర్లను తక్షణమే రద్దు చేసి, తిరిగి ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. టెండర్ నిబంధనలను బోర్డు నిర్ణయిస్తుందని, ఇందులో వ్యక్తిగత ప్రయోజనాలకు తావులేదని భట్టి వివరించారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై ఉన్న కోపంతోనే కొందరు తనపై బురదజల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాబినెట్ మొత్తం సమన్వయంతో పని చేస్తోందని, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇరాన్ లో ఆందోళన పర్వం 5,000 మందికి పైగా బలి..!

**మొదటిపేజీ తరువాయి....**
శాంతియుత నిరసనల ముసుగులో విధ్వంసకారులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిని అణచివేసే క్రమంలోనే భారీ ప్రాణనష్టం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు మానవ హక్కుల సంఘాలు మాత్రం మృతుల సంఖ్యపై మిశ్రమస్పందన విన్పిస్తోంది. నిరసనల్లో ఎక్కువ మంది సాధారణ ప్రజలేనని, భద్రతా బలగాల దమనకాండ వల్లే భారీ ప్రాణ నష్టం జరిగిందని మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇరాన్ అంతర్గత వ్యవహారాల శాఖకు చెందిన సీనియర్ అధికారి మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్నవి సాధారణ నిరసనలు కాదని, విదేశీ శక్తుల ప్రేరణతో సాగుతున్న కుట్రలని ఆరోపించారు. ఆయుధాలతో రోడ్లపైకి వచ్చిన అల్లరిమూకలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడమే కాకుండా భద్రతా బలగాలపై కాల్పులకు దిగుతున్నాయని తెలిపారు. దేశ సమగ్రతను దెబ్బతీసే ఈ 'హైబ్రిడ్ వార్'ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ఈ హింసాత్మక ఘటనల్లో పలువురు పోలీసులు, అమాయక పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారని ఆయన వెల్లడించారు. ఇరాన్‌లో స్వేచ్ఛ, హక్కులు, ఆర్థిక సమస్యలపై ప్రజల ఆగ్రహం కొంతకాలంగా ఉప్పొంగుతోంది. ధరల పెరుగుదల, రాజకీయ అణచివేతకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ నిరసనలు క్రమంగా హింసాత్మకంగా మారాయి. టెహ్రాన్‌తో పాటు పలు ప్రధాన నగరాల్లో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినా.. ప్రజలు వెనక్కి తగ్గకుండా రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటం పరిస్థితి తీవ్రతను చాటుతోంది.



## ప్రాంతీయ పార్టీలను మింగేయడమే బీజేపీ వ్యూహం

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**
భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న రాజకీయ ఎత్తుగడలపై సీనియర్ లాయర్, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రాంతీయ పార్టీలను వాడుకుని వదిలేయడం, వాటిని నామరూపాలు లేకుండా చేయడం బిజెపికి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి సాధించిన విజయాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బిజెపికి ఎక్కడైతే మెజార్టీ ఉండదో, అక్కడ ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుంటుందని, అధికారం చేజిక్కించుకున్నాక ఆ పార్టీలను పక్కనపెట్టేస్తుందని సిబల్ విమర్శించారు. "బిహార్‌లో ఈ వ్యూహం ఇప్పటికే సక్సెస్ అయింది. ఇప్పుడు మహారాష్ట్రలోనూ అదే అమలు చేస్తున్నారు. ప్రాంతీయ శక్తులను బలహీనపరచడమే వారి అసలు లక్ష్యం," అని ఆయన మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో నేరుగా తలపడుతున్న బిజెపి, దక్షిణాదిలో మాత్రం పప్పులు ఉడకక అడ్డదారులు తొక్కుతోందని సిబల్ ఎద్దేవా చేశారు. "తమిళనాడులో పాగా వేయడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవడంతో ఇప్పుడు అక్కడ 'దేవాలయాల రాజకీయాలకు' తెరలేపారు. కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో కూడా ఆ పార్టీకి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది," అని పేర్కొన్నారు. "బిజెపితో రాజీపడటం వల్ల అజిత్ పవార్‌కు ప్రస్తుతానికి డిప్యూటీ సీఎం పదవి దక్కొచ్చు. కానీ, బిజెపితో జట్టు కట్టిన ప్రాంతీయ నాయకులకు భవిష్యత్తు ఉండదు. రాజకీయంగా ఆయన కెరీర్ ముగిసిపోయినట్లే," అని హెచ్చరించారు. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన 29 మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో బిజెపి అద్భుత విజయం సాధించింది. మొత్తం 2,869 స్థానాలకు గాను 1,425 సీట్లు గెలుచుకుని అతి పెద్ద పార్టీగా అవతరించింది. ముఖ్యంగా ముంబై లో 89 స్థానాలను కైవసం చేసుకుని ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్ కోటలను బద్దలు కొట్టింది. ఈ ఫలితాల నేపథ్యంలోనే కపిల్ సిబల్ బిజెపి విస్తరణా కాంక్షపై విమర్శలు గుప్పించారు.



## ఏడు రూపాయల కేసు తేలడానికి 50 ఏళ్లు

**ముంబై (ఏడీఎన్ఎన్) :**
ముంబైలో 50 ఏళ్ల క్రితం నాటి ఒక ఆసక్తికరమైన చోరీ కేసు ఎట్టకేలకు ముగింపు దశకు చేరుకుంది.1977లో జరిగిన ఈ దొంగతనం కేసుకు సంబంధించి దక్షిణ ముంబైలోని మజగావ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తాజాగా తుది నిర్ణయం తీసుకుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ కేసులో చోరీకి గురైన మొత్తం కేవలం రూ. 7.65 (ఏడు రూపాయల అరవై ఐదు పైసలు) మాత్రమే.అప్పట్లో ఈ స్వల్ప మొత్తం కోసం నమోదైన కేసు, నిందితులు మరియు ఫిర్యాదుదారుడి ఆచూకీ దొరక్కపోవడంతో దశాబ్దాల పాటు కోర్టు రికార్డుల్లోనే ఉండిపోయింది. 1977లో జరిగిన ఈ చోరీకి సంబంధించి ఇద్దరు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు అనేకమార్లు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దశాబ్దాలు గడుస్తున్నా అటు నిందితులు, ఇటు ఫిర్యాదు చేసిన వ్యక్తి ఆచూకీ లభించలేదు. పెండింగ్‌లో ఉన్న పాత కేసులను పరిష్కరించే క్రమంలో భాగంగా మేజిస్ట్రేట్ ఆర్తి కులకర్ణి ఈ కేసును విచారణకు స్వీకరించారు. అర శతాబ్దం గడిచినా ఎవరి సమాచారం లేకపోవడంతో, ఇకపై ఈ కేసును కొనసాగించడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని న్యాయస్థానం భావించింది. ఈ నేపథ్యంలో, ఆచూకీ లేని ఆ ఇద్దరు నిందితులను కేసు నుంచి విడుదల చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా, చోరీకి గురైన రూ. 7.65 మొత్తాన్ని ఫిర్యాదుదారుడికి తిరిగి ఇవ్వాలని, ఒకవేళ ఆయన దొరకని పక్షంలో ఆ నగదును ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని ఆదేశించింది. ఇన్నేళ్ల తర్వాత ఒక చిన్నపాటి కేసుకు ముగింపు పలకడం ద్వారా న్యాయ వ్యవస్థపై ఉన్న భారాన్ని కొంతవరకు తగ్గించినట్లయిందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## 'భార్యాభర్తల సమ్మతిపై గుజరాత్ హైకోర్టు తీర్పు



వివాహ బంధంలో శారీరక సంబంధం సహజమే అయినప్పటికీ, దానికి పరస్పర అంగీకారం, గౌరవం అత్యంత కీలకమని గుజరాత్ హైకోర్టు స్పష్టం చేసింది. భార్య సమ్మతి లేకుండా భర్త బలవంతంగా లైంగిక సంబంధానికి ప్రయత్నించడం, అసహజ లైంగిక చర్యలకు ఒత్తిడి చేయడం మానసిక, భావోద్వేగ గాయాలకు దారితీస్తుందని వ్యాఖ్యానించింది. అహ్మదాబాద్‌కు చెందిన ఒక వివాహిత ఫిర్యాదుతో నమోదైన కేసులో భర్తకు ముందస్తు బెయిల్‌ను తిరస్కరిస్తూ న్యాయస్థానం సంచలన వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ డి.ఎ. జోషి విచారించిన ఈ కేసులో, "నాగరిక సమాజంలో వ్యక్తి తన బాధ భరించలేని స్థాయికి చేరుకున్నప్పుడే బయటికి వచ్చి ఫిర్యాదు చేస్తారు. వివాహ జీవితంలోనూ ప్రతి వ్యక్తికి శారీరక స్వేచ్ఛ, గౌరవం హక్కుగా ఉంటాయి" అని కోర్టు పేర్కొంది. అహ్మదాబాద్‌కు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ రీమా (పేరు మార్చాము ) 2022లో హరియాణా గుర్గావ్‌కు చెందిన వ్యాపారవేత్త రాకేష్ (పేరు మార్చారు)ను వివాహం చేసుకున్నారు. రెండు సంవత్సరాలకే తన భర్త శారీరకంగా, మానసికంగా హింసించాడని, అసహజ లైంగిక చర్యలకు బలవంతపెట్టాడని ఆమె ఆరోపించారు. 2025 అక్టోబర్ 14న అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో భర్త రూ.15 లక్షలు, 10 కిలోల వెండి కట్నంగా డిమాండ్ చేశాడని, మద్యం మత్తులో దాడులు చేశాడని, నిరాకరిస్తే సిగరెట్లతో కాల్చేవాడని ఆమె పేర్కొన్నారు. మాల్‌కు వెళ్లినా, కాఫీ షాప్‌లో ఉన్నా అనుమానంతో వేధించేవాడని, లైవ్ లొకేషన్ పంపాలని బలవంతం చేసేవాడని తెలిపారు. మామ కూడా లైంగికంగా వేధించాడని రీమా ఆరోపించారు. భర్త రాకేష్ ముందస్తు బెయిల్ కోసం సెషన్స్ కోర్టును ఆశ్రయించగా తిరస్కరణకు గురయ్యాడు. తర్వాత హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఆరోపణలను ఖండిస్తూ, వివాహ ఖర్చులన్నీ తానే భరించానని, వెకేషన్లకు తీసుకెళ్లానని పేర్కొన్నాడు. కట్నం అడిగే ప్రసక్తే లేదని అతని న్యాయవాది వాదించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలను కూడా ప్రస్తావించారు. అయితే భార్య తరపు న్యాయవాది, భర్త గత వివాహంలోనూ ఇలాగే హింసకు పాల్పడ్డాడని, ఇదే తీరు రెండో భార్యపైనా కొనసాగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రెండు వైపులా వాదనలు విన్న కోర్టు, ముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది. "వివాహంలో లైంగిక సంబంధం సహజమే కానీ, అది పరస్పర అంగీకారంతోనే జరగాలి. అంగీకారం లేకుండా జరిగే అసహజ శారీరక సంబంధాలు తీవ్రమైన మానసిక, భావోద్వేగ సమస్యలకు దారితీస్తాయి" అని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు వైవాహిక హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీయనున్నాయి.

## బెయిల్ 'శిక్ష'గా మారితే న్యాయం చచ్చిపోతుంది

**మొదటిపేజీ తరువాయి....**
విచారణ పూర్తి కాకుండానే నిందితులను ఏళ్ల తరబడి జైల్లో ఉంచడంపై జస్టిస్ చంద్రచూడ్ ఆందోళన వ్యక్తం చేశారు. "బెయిల్‌ను ఒక శిక్షగా మార్చడం వల్ల న్యాయ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం మరియు స్వేచ్ఛ పట్ల ఉన్న గౌరవం రెండూ దెబ్బతింటాయి" అని ఆయన హెచ్చరించారు. నిందితులకు ఉండే 'త్వరిత విచారణ' హక్కును కోర్టులు తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బెయిల్ దుర్వినియోగం కాకుండా ఉండటానికి అవసరమైతే కఠినమైన షరతులు విధించవచ్చు కానీ, కేవలం జైల్లో ఉంచడమే పరిష్కారం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తులు నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రజల ఒత్తిళ్లకు లేదా సామాజిక అంశాలకు ప్రభావితం కాకూడదని, కేవలం తమ ముందున్న ఆధారాల ప్రాతిపదికన మాత్రమే వ్యవహరించాలని ఆయన సూచించారు. ఉమర్ ఖాలిద్ 2020 నుంచి ఉపా చట్టం కింద జైల్లో ఉన్నప్పటికీ, చంద్రచూడ్ హయాంలో ఆయన బెయిల్ పిటిషన్ విచారణకు రాకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈ ఉదంతం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైన తరుణంలో, మాజీ సీజేఐ చేసిన ఈ వ్యాఖ్యలు న్యాయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## ఎన్టీఆర్‌కు నివాళి

**మొదటిపేజీ తరువాయి....**
అమరావతి మనందరి రాజధాని అని, దీనిని అడ్డుకోవాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. రాష్ట్రంలో రౌడీయిజానికి చోటు లేదని, ఇక్కడ ఉన్నది ఎన్డీఏ ప్రభుత్వం, సీబీఎన్ అని గుర్తుంచుకోవాలని రౌడీ మూకలకు వార్నింగ్ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 'సూపర్ సిక్స్' పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 700 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని, ఉగాది పర్వదినం సందర్భంగా మరో 5 లక్షల మందికి గృహప్రవేశాలు చేయిస్తామని ప్రకటన చేశారు. శాంతిభద్రతలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యమని, దేశంలోకి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే రావడం మన పాలనపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టాలి

**మొదటిపేజీ తరువాయి....**
సంక్షేమ పథకాల అమలులో దివంగత ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డిల స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రేవంత్ రెడ్డి చెప్పారు . పేదల ఆకలి తీర్చిన ఎన్టీఆర్, ఉచిత విద్యుత్ అందించిన వైఎస్సార్‌ల అడుగుజాడల్లోనే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేస్తామని, భద్రాచలం రామాలయాన్ని అయోధ్య తరహాలో అభివృద్ధి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకత్వంపై సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ ఎర్రవెల్లి ఫాంహౌస్ కేంద్రంగా కుట్రలు చేస్తున్నారని, ఆయన భూ బకాసురులకు, కబ్జాదారులకు గురువులా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా విష ప్రచారం చేస్తున్న మారీచులకు, శుక్రాచార్యులకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రాబోయే పదేళ్ల కాలం కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు.నర్సింగ్ విద్యార్థినులతో సీఎం రేవంత్ ముచ్చటించారు . వైద్య వృత్తిలో దైవత్వం ఉంటుందని, వృత్తి ధర్మాన్ని పాటించాలని సూచించారు. విదేశాల్లో నర్సింగ్ అభ్యర్థులకు ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, జపాన్, జర్మన్ వంటి భాషల్లో శిక్షణ ఇస్తామని ప్రకటించారు.

## అనవసరంగా కెలికా... సారీ !

**మొదటిపేజీ తరువాయి....**
తన ఉద్దేశాలు కొన్నిసార్లు తప్పుగా అర్థం చేసుకోబడతాయని, ప్రజలు తన నిజాయితీని గ్రహిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. తాను భారతీయుడిని కావడం ఎంతో గర్వంగా ఉందని, వివిధ సంస్కృతులను సంగీతం ద్వారా ఏకం చేయడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.తన సంగీత ప్రయాణంలో భారత్ ఇచ్చిన స్వేచ్ఛను ఆయన కొనియాడారు. నాగ సంగీతకారులతో స్ట్రింగ్ ఆర్కెస్ట్రా, సన్ షైన్ ఆర్కెస్ట్రా, అలాగే రామాయణం ప్రాజెక్ట్ కోసం హన్స్ జిమ్మెర్‌తో కలిసి పని చేయడం వంటి అనుభవాలను ఈ వీడియోలో గుర్తుచేసుకున్నారు. "నా సంగీతం ఎల్లప్పుడూ గతాన్ని గౌరవిస్తుంది, వర్తమానాన్ని వేడుక చేసుకుంటుంది మరియు భవిష్యత్తుపై ఆశను కలిగిస్తుంది" అని ఆయన భావోద్వేగంగా చెప్పారు. ఇటీవల బిబిసి నెట్‌వర్క్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రెహమాన్ మాట్లాడుతూ.. బాలీవుడ్‌లో తనకు అవకాశాలు తగ్గడంపై స్పందించారు. "సృజనాత్మక నిర్ణయాలు కొన్నిసార్లు సృజనాత్మకత లేని వ్యక్తుల చేతిలో ఉంటున్నాయి. అది మతపరమైన కారణాల వల్ల కూడా కావచ్చు," అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మాటలు బాలీవుడ్‌లో మత వివక్ష ఉందన్న కోణంలో వైరల్ కావడంతో వివాదం చెలరేగింది. దీనిపై ఇప్పుడు ఆయన స్పష్టత ఇస్తూ.. సంగీతం ఎవరినీ బాధపెట్టదని, అది కేవలం సంస్కృతులను కలిపే వారధి మాత్రమేనని వివరణ ఇచ్చారు.

## ఒకసారి టచ్ చేసి చూడు... మేమేంటో చూపిస్తాం

**మొదటిపేజీ తరువాయి....**
రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానమంతా ద్రోహాల పుట్ట అని, అధికారం కోసం అడ్డదారులు తొక్కే సంస్కృతి ఆయనదని హరీశ్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన చరిత్ర కలిగిన వ్యక్తికి, నేడు తెలంగాణ ప్రయోజనాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. పగలు రాహుల్ గాంధీ భజన చేస్తూ, రాత్రి వేళల్లో బీజేపీ, టీడీపీ నేతలతో చీకటి ఒప్పందాలు చేసుకుంటున్న రేవంత్ రెడ్డి, రాష్ట్ర జల ప్రయోజనాలను పొరుగు రాష్ట్రాల వద్ద తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కంచె చేను మేసినట్లుగా రాష్ట్ర హక్కులను పక్కనబెట్టి వ్యవహరిస్తే ప్రజలే బుద్ధి చెబుతారని, బీఆర్ఎస్ కార్యకర్తలను తాకాలని చూస్తే భస్మమవ్వడం ఖాయమని హరీశ్ రావు హెచ్చరించారు.

## ముఖ్యమంత్రి ముఠా నాయకుడిలా మారారు


**మొదటిపేజీ తరువాయి....**
అందుకే సోషల్ మీడియాలో పోస్టులకే కేసులు పెట్టే పోలీసులు సీఎం హింసాత్మక వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ రేవంత్ రెడ్డి తన పాత బాస్ చంద్రబాబు ఆదేశాల మేరకే పనిచేస్తున్నారని, తెలంగాణ జలహక్కులను పక్కనబెట్టి టీడీపీని రాష్ట్రంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ, మరోవైపు తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న రేవంత్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని, నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో ద్రోహం చేసినందుకు ఆయన భారీ మూల్యం చెల్లించక తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.



## అమెరికా–ఇజ్రాయెల్ వ్యూహానికి షాకిచ్చిన ఇరాన్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

అమెరికా, ఇజ్రాయెల్ వ్యూహాలకు ఇరాన్ భారీ షాకిచ్చింది. ఇరాన్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఆందోళనల వెనుక అమెరికా, ఇజ్రాయెల్ హస్తం ఉందన్న ఆరోపణలను తిప్పికొడుతూ , ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని అంతర్గతంగా బలహీన పరిచే శత్రువుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయని స్పష్టం చేశారు. ఇరాన్‌లో రాజకీయ, సామాజిక అశాంతికి ముగింపు పలికినట్లు ప్రకటించారు. నిరసనకారులను రెచ్చగొట్టి దేశంలో అస్థిరత సృష్టించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ కుట్రలు చేశాయని ఖమేనీ ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను 'క్రిమినల్'గా అభివర్ణించిన ఆయన.. ఇరాన్‌లో జరిగిన హింసకు, ప్రాణనష్టానికి ట్రంప్ మద్దతు ఇచ్చిన అల్లరిమూకలే కారణమని మండిపడ్డారు. ఇరాన్‌ను కబళించాలని చూసిన శత్రువుల ప్లాన్‌ను ప్రజలు, భద్రతా దళాలు కలిసి తిప్పికొట్టాయని పేర్కొన్నారు. డిసెంబర్ చివర్లో ధరల పెరుగుదల, ఆర్థిక ఇబ్బందులతో ప్రారంభమైన శాంతియుత నిరసనలు క్రమంగా హింసాత్మకంగా మారాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. అయితే, 3,000 మందిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. అవసరమైతే మరణశిక్షలు కూడా విధిస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. ఇప్పటికే పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి వస్తున్నాయని ఇరాన్ ప్రభుత్వం వెల్లడించింది. వారం రోజులుగా మూతపడ్డ పాఠశాలలను తిరిగి తెరిచారు. నిలిపివేసిన మొబైల్ మెసేజింగ్ సేవలను పునరుద్ధరించారు. ఇరాన్‌కు లెబనాన్‌కు చెందిన హిజ్బుల్లా మద్దతు ప్రకటించగా.. జీ7 దేశాల జోక్యాన్ని ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది.



## మలేసియా విమానం మిస్సింగ్.. 11 మంది ఎక్కడ?

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

మలేసియాలో విమానం మిస్సింగ్ కలకలం రేగుతోంది. 11 మంది ప్రయాణిస్తున్న ATR 42500 విమానం ఇండోనేషియాలోని జావా, సులవేసి ద్వీపాల మధ్య ఉన్న పర్వత ప్రాంతాల్లో అదృశ్యమైంది. ప్రస్తుతం ఆ విమానం ఆచూకీ కోసం విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మలేసియా విమానాలు మిస్సవడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ పలుమార్లు ఈ దేశానికి చెందిన విమానాలు రాడార్ నుంచి మాయమై, ప్రయాణికుల గమ్యం ఇప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయిన ఘటనలు ఉన్నాయి. తాజాగా మరోసారి అదే తరహా ఘటన జరగడంతో అంతర్జాతీయంగా ఆందోళన నెలకొంది.ఇండోనేషియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ కు చెందిన ATR 42500 విమానం నిన్న దక్షిణ సులవేసి ప్రావిన్స్‌లోని మారోస్ పర్వత జిల్లా మీదుగా వెళ్తుండగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సంబంధాలు కోల్పోయింది. మధ్యాహ్నం 1 గంట 17 నిమిషాల సమయంలో లియాంగ్‌లియాంగ్ ప్రాంతంలో చివరిసారిగా ఈ విమానం ట్రాక్ అయినట్లు అధికారులు తెలిపారు. కొద్దిసేపటికే రేడియో కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయిందని చెప్పారు. సుల్తాన్ హసనుద్దీన్ అంతర్జాతీయ విమానాశ్రయం వైపు వెళ్తున్న సమయంలో పైలట్లకు అప్రోచ్ అలైన్‌మెంట్ సరిచేయాలని సూచించిన వెంటనే విమానం అదృశ్యమైందని అధికారులు వెల్లడించారు. దీంతో వెంటనే అత్యవసర విపత్తు దశను ప్రకటించారు. విమానంలో ఎనిమిది మంది సిబ్బంది, ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. వీరంతా ఇండోనేషియా సముద్ర వ్యవహారాలు, మత్స్య మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులు అని సమాచారం. ఇండోనేషియా వైమానిక దళ హెలికాప్టర్లు, డ్రోన్లు, గ్రౌండ్ రెస్క్యూ బృందాలతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. ఇదిలా ఉండగా , బులుసారౌంగ్ పర్వత ప్రాంతంలో హైకర్లు కొన్ని శిథిలాలు, విమాన లోగోకు సరిపోలే గుర్తులు, స్వల్ప మంటలను గమనించినట్లు చెప్పారు. దీంతో రెస్క్యూ బృందాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. విమానం కూలిపోయిందా? లేక ఎక్కడైనా అత్యవసర ల్యాండింగ్ చేశిందా? అన్న దానిపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది. పరిస్థితి అత్యంత ఉద్విగ్నంగా మారింది.



## గాజా శాంతి మండలి.. భారత్‌కు ట్రంప్ ఆహ్వానం

గాజా పునర్నిర్మాణం, శాంతి స్థాపన లక్ష్యంగా ఏర్పాటు చేసిన ప్రతిష్ఠాత్మక శాంతి మండలిలో భాగస్వామి కావాలని భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం పంపారు. మధ్యప్రాచ్యంలో శాంతి ప్రక్రియలో భారత్ కీలక పాత్ర పోషించాలన్న ఉద్దేశంతోనే ఈ ఆహ్వానం అంటూ దౌత్య వర్గాలు పేర్కొంటున్నాయి . ఈ మండలిలో ఇండోఅమెరికన్, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగాకు చోటు దక్కిన సంగతి తెలిసిందే.గాజా పరిపాలన కోసం అమెరికా రెండు ప్రత్యేక మండళ్లను ఏర్పాటు చేయనుంది. ఇందులో ప్రధానమైన 'శాంతి మండలి'కి ట్రంప్ స్వయంగా అధ్యక్షత వహించనున్నారు. సాంకేతిక నిపుణులు, అంతర్జాతీయ నేతలతో కూడిన ఈ బోర్డు గాజా పునర్నిర్మాణానికి విధానాలు రూపొందించనుంది. మరోవైపు 'ఎగ్జిక్యూటివ్ బోర్డు' సలహాదారుగా వ్యవహరిస్తుందని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు మండళ్లలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, అజయ్ బంగా, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ సహా పలు దేశాల ప్రతినిధులకు చోటు కల్పించారు. ఇదిలా ఉండగా, ఈ మండలిలో తమకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వలేదని ఇజ్రాయెల్ అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. మరోవైపు పాకిస్తాన్‌కు కూడా భాగస్వామ్య ఆహ్వానం అందిందని ఆ దేశం పేర్కొనడం అంతర్జాతీయంగా చర్చకు దారితీస్తోంది.

## గ్రీన్‌ల్యాండ్ పై యూఎస్ కు యూరప్ కౌంటర్


**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



గ్రీన్‌ల్యాండ్ వ్యవహారంలో తనకు మద్దతివ్వని యూరప్ దేశాలను భారీ సుంకాల బెదిరింపులతో లొంగదీసుకోవాలనుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఒకవైపు యూరప్‌తో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటూనే , మరోవైపు అదే దేశాలపై భారీ సుంకాలు విధిస్తానని హెచ్చరించడంతో యూరోపియన్ యూనియన్ తీవ్రంగా స్పందించింది. ఫలితంగా అమెరికాతో కుదుర్చుకున్న ట్రాన్స్‌అట్లాంటిక్ వాణిజ్య ఒప్పందాన్ని నిలిపివేస్తూ షాకిచ్చింది.గ్రీన్‌ల్యాండ్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు ట్రంప్ వేగంగా పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో వెనెజులా అధ్యక్షుడు నికోలాస్ మదురోపై గతంలో చేసిన దాడి ఉదంతాన్ని కూడా యూరప్ నేతలు గుర్తు చేస్తున్నారు. అమెరికా బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన యూరప్ , ట్రంప్ చర్యలకు నిరసనగా యూరోపియన్ పార్లమెంట్ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది జూలైలో అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం అమలుకు బ్రేక్ వేసింది. ఆ ఒప్పందం ప్రకారం ఈయూ వస్తువులపై అమెరికా సుంకాలను 15 శాతానికి పరిమితం చేయాలని, అలాగే అమెరికా ఎగుమతులపై ఈయూ విధించే సుంకాలను కూడా తగ్గించాలని నిర్ణయించారు. గ్రీన్‌ల్యాండ్ కబ్జా కోసం ట్రంప్ చేపడుతున్న చర్యలు ఈ ఒప్పంద భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టాయి. ఇటీవల గ్రీన్‌ల్యాండ్‌లో దళాల మోహరింపుకు యూరప్ దేశాలు ముందుకు రావడంతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 1 నుంచి అదనంగా 25 శాతం సుంకాలు విధిస్తామని, గ్రీన్‌ల్యాండ్ కొనుగోలు ఒప్పందం కుదిరే వరకూ ఇవి కొనసాగుతాయని హెచ్చరించారు. రష్యా, చైనా కార్యకలాపాల నేపథ్యంలో భద్రత కోసమే ఈ మోహరింపు అని యూరోపియన్ నేతలు స్పష్టం చేశారు. సుంకాల యుద్ధం కొనసాగితే ఈయూ నుంచి కూడా గట్టి ప్రతిస్పందన తప్పదని తేల్చిచెప్పారు.

## భారత్‌లో చాట్‌జీపీటీ వాడొద్దు..! ట్రంప్ అడ్వైజర్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరోసారి విషం కక్కారు. ఇప్పటికే భారత్‌ను లక్ష్యంగా చేసుకుని పలుమార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నవారో , తాజాగా కృత్రిమ మేధ (ఏఐ) రంగాన్ని తెరపైకి తెచ్చి కొత్త రచ్చకు తెరలేపారు. భారత్‌లో చాట్ జీపీటీ వంటి అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ల వినియోగాన్ని ప్రశ్నిస్తూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ వాణిజ్య వ్యవస్థపై దూకుడుగా వ్యవహరిస్తున్న వేళ.. ఆయన బృంద సభ్యులు కూడా అదే బాటలో నడుస్తున్నారు. భారత్‌పై టారిఫ్ బెదిరింపులు, వాణిజ్య ఆరోపణలతో పాటు వ్యక్తిగత స్థాయిలో కూడా చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారు. అందులో ముందంజలో ఉన్నది ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారోనే కావడం విశేషం. ఇప్పటికే రష్యా నుంచి చమురు కొనుగోలు అంశంపై భారత్‌ను తీవ్రంగా విమర్శించిన నవారో , భారత్ 'చాకిరేవు దుకాణం' నడుపుతోందని, సంపన్న వర్గాలు లాభాలు గడిస్తున్నాయంటూ కులాల ప్రస్తావన తీసుకువచ్చి వివాదం రేపారు. తాజాగా మరో అడుగు ముందుకేసి ఏఐ సేవలపై వ్యాఖ్యలు చేశారు. చాట్‌జీపీటీ వంటి ఏఐ ప్లాట్‌ఫామ్‌లు అమెరికా భూభాగంలోని వనరులను ఉపయోగిస్తున్నాయని, అమెరికాలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌తో పనిచేస్తున్నాయని అన్నారు. అయితే భారత్ వంటి దేశాల్లో భారీగా వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయని ఆరోపించారు. "భారత్‌లో ఏఐ సేవల కోసం అమెరికన్లు ఎందుకు డబ్బులు చెల్లించాలి?" అంటూ నవారో ప్రశ్నించారు. ఇతర దేశాల సంస్థలు అమెరికాలో వ్యవసాయ భూములను వాస్తవ ధర కంటే పది రెట్లు ఎక్కువకు కొనుగోలు చేస్తున్నాయని, దీనివల్ల అమెరికాలో ధరలు పెరుగుతున్నాయని కూడా వ్యాఖ్యానించారు. అయితే , నవారో చేసిన ఆరోపణలు వాస్తవ విరుద్ధమని తాజాగా 'ఎక్స్' ఫ్యాక్ట్ చెక్ విభాగం తేల్చి చెప్పింది. రష్యా నుంచి భారత్ ఇంధన భద్రత కోసమే చమురు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేసింది. అయినా నవారో తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోవడం గమనార్హం. ఫ్యాక్ట్ చెక్‌నూ తప్పుపట్టుతూ తన విషప్రచారాన్ని సమర్థించుకోవడం మరో వివాదానికి దారి తీసింది. ట్రంప్ పాలనలో భారత్‌పై అమెరికా వైఖరి మరింత కఠినంగా మారుతోందన్న ఆందోళనకు ఈ వ్యాఖ్యలు మరో ఉదాహరణగా నిలుస్తున్నాయి.

## మచాదో రెడ్ బ్యాగ్‌లో ఏముందో..?

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, వెనుజువెలా విపక్ష నేత మరియా కోరినా మచాదో మళ్లీ అంతర్జాతీయ వార్తల్లో చర్చనీయాంశంగా మారింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ఆమె భేటీ కావడం, ఆ సందర్భంగా నోబెల్ శాంతి పురస్కారాన్ని ఆయనకు అందజేయడం సంచలనంగా మారింది. ట్రంప్ గొప్ప నాయకుడని, ప్రజలు ఆయనను పూర్తిగా నమ్మవచ్చని మచాదో వ్యాఖ్యానించారు. వెనుజువెలా ప్రజల స్వేచ్ఛ, భవిష్యత్తు కోసం ట్రంప్ చేసిన కృషికి గుర్తుగా నోబెల్‌ను అందజేసినట్లు మచాదో తెలిపారు. అయితే , ట్రంప్ కూడా మచాదో ఇచ్చిన నోబెల్‌ను స్వీకరించారు. నోబెల్ పతకాన్ని మచాదో తన వద్దే ఉంచాలని కోరిందని, ఇది పరస్పర గౌరవానికి చిహ్నమని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై నోబెల్ కమిటీ వెంటనే స్పందించింది. ఒకసారి నోబెల్ శాంతి బహుమతి ఎవరికైనా ప్రదానం చేసిన తర్వాత, దానిని మరో వ్యక్తికి బదిలీ చేయడం, పంచడం లేదా మార్చడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఇది నోబెల్ ఫౌండేషన్ నిబంధనల్లో స్పష్టంగా ఉందని పేర్కొంది. ఈ భేటీ తర్వాత మరో అంశం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ట్రంప్‌తో సమావేశం తర్వాత మచాదో చేతిలో కనిపించిన ఎరుపు రంగు బ్యాగ్. 'ట్రంప్ బ్రాండెడ్ రెడ్ స్వ్యాగ్ బ్యాగ్'గా భావిస్తున్న ఈ బ్యాగ్‌లో ఏముందనే దానిపై ఆసక్తి నెలకొంది. అధికారికంగా వివరాలు వెల్లడి కాకపోయినా , ట్రంప్ వీఐపీ అతిథులకు సాధారణంగా ఇచ్చే బహుమతుల ఆధారంగా విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు.ఆ బ్యాగ్‌లో 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అని ముద్రించిన, ట్రంప్ సంతకంతో కూడిన ఎరుపు క్యాప్ ఉండొచ్చని చెబుతున్నారు. అలాగే ట్రంప్‌కు ఇష్టమైన డైట్ కోక్ బాటిల్, దానిపై జనవరి 20న ఆయన బాధ్యతలు చేపట్టిన తేదీ ముద్రించి ఉండవచ్చని సమాచారం. యూఎస్ క్యాపిటల్ భవనం స్కెచ్‌తో కూడిన లెదర్ డైరీ, బంగారు అక్షరాలతో ముద్రణ, అధ్యక్షుడు ట్రంప్-వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ బొమ్మలతో కూడిన మెడల్, వైట్ హౌస్ కీచైన్, క్రిస్మస్ ఆర్నమెంట్ కూడా ఉండొచ్చని అంచనా.అంతేకాదు , ట్రంప్ ముఖచిత్రంతో కూడిన నకిలీ 100 డాలర్ల నోటు, ఒక చిన్న గోల్డ్ పిన్ కూడా ఆ బ్యాగ్‌లో ఉంటాయని ప్రచారం జరుగుతోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఈ భేటీలో వెనుజువెలా రాజకీయ భవిష్యత్తుపై కీలక చర్చ జరిగినట్లు తెలుస్తోంది. దేశ పగ్గాలు ఎవరికి అప్పగించాలి, భవిష్యత్తులో అమెరికా పాత్ర ఏంటి అన్న అంశాలపై నేతలిద్దరూ చర్చించుకున్నారని సమాచారం. అయితే ఆ వివరాలను మాత్రం రెండు పక్షాలూ గోప్యంగా ఉంచాయి.

## భారీగా బంగారం కొంటొన్న చైనా..?

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



- డాలర్‌కు గండి పడుతోందా..?
- బ్రిక్స్ దేశాల వ్యూహమేంటి?
- భారత్, రష్యా సహా బ్రిక్స్ దేశాలకు ప్రమాదమా

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నిశ్శబ్దంగా కానీ గట్టిగా మార్పులు జరుగుతున్నాయి. దానికి తాజా ఉదాహరణ – బంగారం. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత తొలిసారి, 2025లో ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకుల వద్ద ఉన్న బంగారం విలువ , అమెరికా ట్రెజరీ బాండ్లలో పెట్టుబడులను మించిపోయింది. సెంట్రల్ బ్యాంకుల వద్ద బంగారం నిల్వల విలువ సుమారు 4 ట్రిలియన్ డాలర్లకు చేరగా, యూఎస్ ట్రెజరీలలో పెట్టుబడులు 3.5 ట్రిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. దీంతో బంగారం యూరోను అధిగమించి రెండో అతిపెద్ద అంతర్జాతీయ రిజర్వ్ ఆస్తిగా అవతరించింది. ఈ మార్పుకు ప్రధాన కారణం 2022లో అమెరికా రష్యాపై విధించిన ఆంక్షలు. యుక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా విదేశీ ఆస్తులను అమెరికా స్తంభింపజేయడం ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా చేసింది. 'డాలర్‌లో ఉన్న ఆస్తులు నిజంగా సురక్షితమేనా?' అన్న ప్రశ్న సెంట్రల్ బ్యాంకుల్లో మొదలైంది. ఫలితంగా బంగారం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గత మూడు సంవత్సరాలుగా వరుసగా సెంట్రల్ బ్యాంకులు ఏటా వెయ్యి టన్నులకు పైగా బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. ధరలు పెరుగుతున్నప్పటికీ, సెప్టెంబర్ 2025 నాటికి అదనంగా 634 టన్నుల బంగారం నిల్వల్లో చేరింది. డాలర్ ఆధారిత ఆస్తులపై ఆధారాన్ని తగ్గించుకోవడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని విశ్లేషకులు చెబుతున్నారు. చైనా పాత్ర ఇందులో కీలకం కానుంది. సెప్టెంబర్ 2025 నాటికి చైనా అంతర్జాతీయ నిల్వల్లో బంగారం వాటా 7.6 శాతానికి చేరింది. ఇది రష్యాతో (41.3%) పోలిస్తే తక్కువే అయినప్పటికి చైనా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. డాలర్ విశ్వసనీయత బలహీనపడితే, విదేశీ మారక నిల్వలను స్థిరీకరించడంలో బంగారం కీలకంగా మారుతుందని చైనా విశ్లేషకుల అభిప్రాయం.చైనా బంగారం కొనుగోళ్లలో ఒక ప్రత్యేకత ఉంది. రష్యా లాగ నిరంతర భారీ కొనుగోళ్లు కాదు. అంతర్జాతీయంగా బంగారం ధరలు తగ్గినప్పుడు మాత్రమే పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేస్తుంది. 2015లో చైనా 708 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ 'టేపర్ టాంట్రమ్' ప్రకటించిన తర్వాత ఇది జరిగింది. అంటే, డాలర్ వ్యవస్థలో అనిశ్చితి పెరిగిన ప్రతిసారి చైనా బంగారాన్ని ఆశ్రయిస్తోంది. 2023 తర్వాత చైనా పెద్దగా నిల్వలు పెంచకపోయినా , చిన్న పరిమాణంలో కొనుగోళ్లు కొనసాగిస్తోంది. రష్యా పరిస్థితి భిన్నం. 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత రష్యా బంగారం నిల్వలను వేగంగా పెంచింది. 2022లో పాశ్చాత్య ఆంక్షల నేపథ్యంలో బంగారం రష్యాకు రక్షణ కవచంగా మారింది. అదే సమయంలో దేశీయ ఆర్థిక అవసరాల కోసం 2025లో కొంత బంగారాన్ని విక్రయించినట్లు సమాచారం. అంతర్జాతీయ నిల్వల్లో బంగారం వాటా 41 శాతానికి పైగా ఉండటం రష్యా వ్యూహాన్ని స్పష్టంగా చూపిస్తోంది.భారత్ కూడా ఈ దారిలోనే నడుస్తోంది. 2018 నుంచి క్రమంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. చైనా, రష్యాల మాదిరిగా అమెరికా ట్రెజరీలను వెంటనే తగ్గించలేదు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా విదేశీ మూలధనాన్ని ఆకర్షించడానికి డాలర్ పెట్టుబడులు అవసరమయ్యాయి. కానీ 2026 ప్రారంభం నాటికి పరిస్థితి మారింది. అమెరికా ట్రెజరీలలో భారత హోల్డింగ్స్ 21 శాతానికి తగ్గాయి. బంగారం, డాలర్ కాని ఇతర ఆస్తులలో భారత్ పెట్టుబడులు పెంచుతోంది. ఇది ప్రపంచ ఆర్థిక షాక్‌ల నుంచి రక్షణ కోసమే. డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు బ్రిక్స్ దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయి. 2024లో బ్రిక్స్ అధ్యక్షుడిగా ఉన్న రష్యా... 'బ్రిక్స్ క్రాస్‌బోర్డర్ పేమెంట్స్ ఇనిషియేటివ్'ను ప్రతిపాదించింది. సభ్య దేశాల మధ్య జాతీయ కరెన్సీలలో వాణిజ్యాన్ని పెంచడమే లక్ష్యం. ఇదే క్రమంలో 'బ్రిక్స్ ప్రీషియస్ మెటల్స్ ఎక్స్చేంజ్' ఆలోచన కూడా తెరపైకి వచ్చింది.ఈ ప్రతిపాదనపై ఇప్పటివరకు స్పష్టమైన పురోగతి లేదు. చైనా ఇప్పటికే షాంఘై గోల్డ్ ఎక్స్చేంజ్, హాంకాంగ్ బులియన్ వాల్ట్‌లతో ప్రపంచ బంగారం మార్కెట్లో బలమైన స్థానాన్ని సంపాదించుకుంది. కొత్త వేదిక కంటే, ఉన్న వ్యవస్థను బలోపేతం చేయడమే చైనాకు అనుకూలమని నిపుణులు భావిస్తున్నారు. చైనా లక్ష్యం ఒక్కటే – రెన్మిన్బిని అంతర్జాతీయ కరెన్సీగా మార్చడం. పెరుగుతున్న బంగారం నిల్వలు ఈ లక్ష్యానికి మద్దతు ఇస్తున్నాయి. 2009 నుంచి చైనా 32 ద్వైపాక్షిక కరెన్సీ స్వాప్ ఒప్పందాలను కుదుర్చుకుంది. వీటి విలువ సుమారు 4.5 ట్రిలియన్ యువాన్లు. ఆసియా దేశాలే ప్రధాన భాగస్వాములు. హాంకాంగ్, యూఏఈ, సౌదీ అరేబియా వంటి దేశాలతో కలిసి చైనా 'ఎంబ్రిడ్జ్' అనే బ్లాక్‌చెయిన్ ఆధారిత డిజిటల్ కరెన్సీ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తోంది. ఆగస్టు 2025 నాటికి 33 దేశాలలో 35 రెన్మిన్బి క్లియరింగ్ బ్యాంకులు పనిచేస్తున్నాయి. 2024లో వీటి ద్వారా 937 ట్రిలియన్ యువాన్ల లావాదేవీలు జరిగాయి. ఇవన్నీ ఉన్నప్పటికీ ప్రపంచ విదేశీ మారక నిల్వల్లో రెన్మిన్బి వాటా కేవలం 2 శాతమే. ప్రపంచ చెల్లింపులలోనూ 3 శాతానికి మించలేదు. అంటే, బంగారం మద్దతు ఉన్నా, పూర్తి అంతర్జాతీయ కరెన్సీగా మారాలంటే చైనా ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉంది. భారత్‌కు ఇది అవకాశంతో పాటు సవాలూ. బ్రిక్స్ లో భాగస్వామిగా డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించే ప్రయత్నాలు చేయవచ్చు. చైనాతో ఉన్న 102.5 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు పెద్ద అడ్డంకిగా మారింది . రూపాయల్లో వాణిజ్యం జరిగితే, చైనా భారీగా రూపాయలను నిల్వ చేసుకోవాల్సి వస్తుంది. ఇది చైనాకు అనుకూలంగా ఉండకపోవచ్చు. చైనా భారీగా బంగారం కొనుగోలు చేయడం వెనుక కేవలం పెట్టుబడి కోణం కాదు, భవిష్యత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక వ్యూహం ఉంది. డాలర్ ఆధిపత్యానికి మెల్లగా గండి పడుతోంది. బంగారం, స్థానిక కరెన్సీలు, డిజిటల్ వ్యవస్థలు కలిసి కొత్త ప్రపంచ ఆర్థిక క్రమానికి పునాది వేస్తున్నాయి. ఆ మార్పులో చైనా కీలక పాత్ర పోషిస్తోంది. భారత్ మాత్రం జాగ్రత్తగా అడుగులు వేస్తూ , తన భవిష్యత్ ప్రయోజనాలను కాపాడుకునే ప్రయత్నంలో ఉంది

## భారత డిజైనర్ డ్రెస్.. పాకిస్తానీల ఆగ్రహం



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుటుంబం మరోసారి వివాదంలో చిక్కుకుంది. పంజాబ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రి మరియమ్ నవాజ్ కుమారుడు జునైద్ సఫ్దర్ వివాహ వేడుక లాహోర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆ వివాహవేడుకలో ధరించిన 'ఇండియన్ డిజైనర్ డ్రెస్సులు ' వివాదానికి దారితీయడంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జునైద్ సఫ్దర్ భార్య శాన్జె అలీ తన వివాహ వేడుకలో ఎరుపు రంగు బ్రైడల్ లెహంగా ధరించారు. అయితే ఆ లెహంగా ప్రముఖ భారతీయ డిజైనర్ తరుణ్ తహిలియానీ డిజైన్ చేసినదిగా వెలుగులోకి వచ్చింది. తరుణ్ తహిలియానీ భారత మాజీ నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హెచ్. తహిలియానీ కుమారుడు కావడం వివాదానికి మరింత ఆజ్యం పోసింది. 1971 భారత్–పాక్ యుద్ధంలో 'ఐఎన్ఎస్ విక్రాంత్' కమాండింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన తహిలియానీ పాత్రను గుర్తు చేస్తూ , పాక్ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు . ఇదిలాఉండగా, పెళ్లి మెహందీ వేడుకలో ముఖ్యమంత్రి మరియమ్ నవాజ్ కూడా భారతీయ డిజైనర్ అభినవ్ మిశ్రా రూపొందించిన పౌడర్ బ్లూ లెహంగా ధరించారు. దీని ధర పాక్ కరెన్సీలో సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని సమాచారం. దీంతో 'మరియమ్ నవాజ్ కూడా ఇండియన్ వైపే' అంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పాక్ నెటిజన్లు షరీఫ్ కుటుంబాన్ని తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. "పాకిస్థాన్‌పై యుద్ధం చేసిన దేశానికి చెందిన డిజైనర్లను ప్రమోట్ చేయడమేనా దేశభక్తి?" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో బ్రాండ్లు ఉన్నా కావాలని భారతీయ డిజైనర్లనే ఎంచుకోవడం దేశద్రోహమేనని విమర్శలు మిన్నంటుతున్నాయి. షరీఫ్ కుటుంబం తీసుకున్న ఈ నిర్ణయం పాకిస్థాన్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది.



## ట్రంప్ పై పెరుగుతున్న అసంతృప్తి"

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

అమెరికాలో 2026 మధ్యంతర ఎన్నికలకు కొంత సమయం ఉన్నప్పటికీ, రాజకీయ వాతావరణం మాత్రం వేడెక్కుతోంది. ఈ నేపథ్యంలో ఒక సంస్థ నిర్వహించిన తాజా సీఎన్ఎన్ పోల్ కీలక విషయాలను వెల్లడించింది. అధికారంలో ఉన్న రిపబ్లికన్ పార్టీ కంటే ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ వైపే ప్రస్తుతం అమెరికా ప్రజల మద్దతు ఎక్కువగా ఉందని ఈ సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న దూకుడు నిర్ణయాలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుండటం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.అమెరికా కాంగ్రెస్‌లో హౌజ్ ఆఫ్ రెప్రజెంటేటీవ్స్, సెనేట్ అనే రెండు సభలు ఉన్నాయి. ప్రతినిధుల సభ సభ్యుల పదవీకాలం రెండేళ్లు కాగా, సెనేటర్ల పదవీకాలం ఆరు సంవత్సరాలు. మొత్తం 435 స్థానాలు ఉన్న హౌజ్‌లో అన్ని సీట్లకూ ఎన్నికలు జరగనున్నాయి. ఇక సెనేట్‌లో మూడోవంతు అయిన 35 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటితో పాటు 36 రాష్ట్రాల్లో గవర్నర్ ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయంలో వచ్చిన మార్పులు రాజకీయ పార్టీలకు కీలకంగా మారాయి. తాజా పోల్ ప్రకారం, నమోదిత ఓటర్లలో 47 శాతం మంది తమ జిల్లాల్లో డెమోక్రటిక్ అభ్యర్థికి ఓటు వేయాలని భావిస్తుండగా, రిపబ్లికన్ అభ్యర్థులకు మద్దతు తెలిపిన వారు 42 శాతంగా ఉన్నారు. అంటే డెమోక్రాట్స్ కు ఐదు శాతం ఆధిక్యం కనిపిస్తోంది. 2018 మధ్యంతర ఎన్నికలకు ఏడాది ముందు డెమోక్రాట్స్ కు ఉన్న 11 పాయింట్ల ఆధిక్యంతో పోలిస్తే ఇది తక్కువే అయినా, రానున్న ఎన్నికల్లో వారికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అధ్యక్షుడు ట్రంప్ ఆమోదం రేటింగ్ గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం ఆయనకు అనుకూలంగా ఉన్నవారు కేవలం 37 శాతం మాత్రమే కాగా, 63 శాతం మంది ఆయన పనితీరును తిరస్కరిస్తున్నారు. ఇది ట్రంప్‌కు పెద్ద హెచ్చరికగా భావిస్తున్నారు. డెమోక్రటిక్ పార్టీ వైపు మొగ్గు చూపే ఓటర్లు 2026 ఎన్నికలపై ఎక్కువ ఉత్సాహంతో ఉన్నారు. డెమోక్రాట్ మద్దతుదారుల్లో 71 శాతం మంది "అత్యంత ఉత్సాహంగా ఉన్నాం" అని చెప్పగా, రిపబ్లికన్ మద్దతుదారుల్లో ఈ సంఖ్య 46 శాతానికే పరిమితమైంది. పార్టీల అంతర్గత స్థితిని పరిశీలిస్తే ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. రిపబ్లికన్ మద్దతుదారుల్లో 80 శాతం మంది తమ పార్టీపై సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. డెమోక్రాట్స్ లో మాత్రం కేవలం 65 శాతం మంది మాత్రమే తమ పార్టీపై సానుకూలంగా ఉన్నారు. అయితే పార్టీపై విమర్శలు ఉన్నప్పటికీ, డెమోక్రాటిక్ ఓటర్లలో 93 శాతం మంది తమ అభ్యర్థికే ఓటు వేయాలని నిర్ణయించుకోవడం గమనార్హం. ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి తీవ్రంగా ఉందని ఈ సర్వే స్పష్టం చేసింది. దేశ పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని 68 శాతం మంది అభిప్రాయపడింది. ఆర్థిక పరిస్థితి విషయంలో 72 శాతం మంది "దుర్భరంగా ఉంది" అని పేర్కొంది. ట్రంప్ విధానాలే పరిస్థితిని మరింత దిగజార్చాయని 61 శాతం మంది నమ్ముతున్నారు. ప్రభుత్వ షట్‌డౌన్‌ను 81 శాతం మంది ప్రధాన సంక్షోభంగా అభివర్ణించారు. దీనిపై ట్రంప్ స్పందనను 61 శాతం మంది తిరస్కరించారు. విదేశాంగ విధానంపై కూడా ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆయన విదేశీ విధానం అమెరికా ప్రతిష్టను దెబ్బతీసిందని 56 శాతం మంది భావిస్తున్నారు. అక్రమ వలసదారుల బహిష్కరణ విషయంలో ట్రంప్ "అతిగా వెళ్లారని" 57 శాతం మంది అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య స్థితినే దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యగా 26 శాతం మంది పేర్కొన్నారు. డెమోక్రాట్స్ లో ఈ సంఖ్య 45 శాతానికి చేరడం విశేషం.అధ్యక్ష అధికారాలను ట్రంప్ అతిగా ఉపయోగిస్తున్నారని 61 శాతం మంది భావిస్తున్నారు. వైట్ హౌస్ ఈస్ట్ వింగ్‌ను రద్దు చేయాలన్న నిర్ణయానికి 54 శాతం మంది వ్యతిరేకంగా ఉండగా, కేవలం 10 శాతం మంది మాత్రమే మద్దతు తెలిపారు. కాంగ్రెస్‌లోని రిపబ్లికన్లు ట్రంప్‌కు అతిగా మద్దతు ఇస్తున్నారని 55 శాతం మంది అమెరికన్లు అభిప్రాయపడ్డారు. మరోవైపు, ట్రంప్‌ను ఎదుర్కొనే విషయంలో డెమోక్రాట్లు తగినంత కఠినంగా వ్యవహరించడం లేదని 69 శాతం మంది డెమోక్రటిక్ ఓటర్లు భావిస్తున్నారు. అక్టోబర్ 27 నుంచి 30, 2025 మధ్య నిర్వహించిన ఈ సీఎన్ఎన్–ఎస్ఎస్ఆర్ఎస్ పోల్‌లో 1,245 మంది పెద్దలు పాల్గొన్నారు. మొత్తం మీద చూస్తే, ట్రంప్ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, రిపబ్లికన్ కాంగ్రెస్ పనితీరుపై విమర్శలు ,2026 మధ్యంతర ఎన్నికలకు ముందు డెమోక్రాట్లకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని ఈ సర్వే స్పష్టంగా సూచిస్తోంది.



## అసెంబ్లీకి రాకపోతే అనర్హత వేటు తప్పదు

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

వైఎస్ జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీకి రావాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు ఉంటాయని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు స్పష్టం చేశారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన ఎన్టీఆర్, హరివంశరాయ్ బచ్చన్ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ , ఎమ్మెల్యేల గైర్హాజరీపై కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి హాజరుకాకుండా కేవలం జీతాలు మాత్రమే తీసుకుంటున్న ఎమ్మెల్యేల వ్యవహారం ప్రస్తుతం ఎథిక్స్ కమిటీ పరిశీలనలో ఉందని రఘురామ తెలిపారు. "రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. ఎవరైనా సభ్యుడు వరుసగా 60 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరైతే వారిపై అనర్హత వేటు వేసే అధికారం ఉంటుంది. శాసనసభ అయినా, మండలి అయినా నిబంధనలు ఒకేలా ఉంటాయి," అని ఆయన హెచ్చరించారు. ఫిబ్రవరిలో అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉందని, ఈ లోపల వైసీపీ నేతలు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచించారు. తాను టీడీపీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై వస్తున్న వార్తలపై రఘురామ వివరణ ఇచ్చారు. రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ స్పీకర్ పదవిలో ఉన్నందున తాను స్వీయ నియంత్రణ పాటిస్తున్నానని చెప్పారు. "డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న వ్యక్తి పార్టీకి రాజీనామా చేయాల్సిన అవసరం లేదు, కానీ ఆ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడటం కోసం నేను టీడీపీ రాజకీయ సమావేశాలకు దూరంగా ఉంటున్నాను," అని వెల్లడించారు. ప్రజా సమస్యల గురించి చర్చించాల్సిన సభకు రాకుండా మొండిగా వ్యవహరించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల నుంచి ఓట్లు పొంది, ప్రజాప్రతినిధులుగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు సభకు రాకపోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని రఘురామ ఎద్దేవా చేశారు.



## ఆ జిల్లాలకు 'పొగమంచు' హెచ్చరిక

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పొగమంచు ప్రభావం తీవ్రంగా ఉండనుందని విశాఖపట్నంలోని తుపాను హెచ్చరికల కేంద్రం ఆదివారం హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రధాన జిల్లాల్లో దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దీనివల్ల దృశ్యమానత గణనీయంగా తగ్గి, రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా , బాపట్ల జిల్లాల్లో పొగమంచు ప్రభావం చాలా ఎక్కువగా ఉండనుంది. ఈ ప్రాంతాల్లోని రహదారులు దట్టమైన మంచు ముసుగులో ఉండే అవకాశం ఉన్నందున, చాలా చోట్ల రాకపోకలకు అంతరాయం కలగవచ్చు. ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాలు , తీరప్రాంత జిల్లాల్లో దీని తీవ్రత మరీ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. పొగమంచు కారణంగా రహదారులు సరిగ్గా కనిపించవని, ముఖ్యంగా తెల్లవారుజామున , రాత్రి సమయాల్లో ప్రయాణించే వారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా ఫాగ్ లైట్లు వినియోగించాలని, తక్కువ వేగంతో ప్రయాణించాలని కోరారు. అలాగే సముద్ర తీర ప్రాంతాల్లో కూడా వేట సాగించే వారు , ప్రయాణికులు వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు



## ప్రైవేటు ట్రావెల్స్ 'టికెట్' బాంబు

### విశాఖ నుంచి బెంగళూరుకు రూ. 6 వేలా?

### బస్సును సీజ్ చేసిన ఆర్టీఏ అధికారులు!

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

సంక్రాంతి సెలవులు ముగిసి అందరూ తిరిగి గమ్యస్థానాలకు చేరుకుంటున్న వేళ, ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు యజమానులు భారీగా దోపిడీకి తెరలేపారు. విశాఖపట్నం నుంచి బెంగళూరుకు ఒక్కో టికెట్‌పై ఏకంగా రూ. 6,000 వసూలు చేస్తున్న వైనాన్ని గుర్తించిన రవాణా శాఖ అధికారులు సదరు బస్సుపై కఠిన చర్యలు తీసుకున్నారు. సంక్రాంతి తిరుగు ప్రయాణ రద్దీ నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్స్ అధిక చార్జీలు వసూలు చేస్తున్నాయని ఫిర్యాదులు అందడంతో విశాఖ ఆర్టీఏ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో సత్యం జంక్షన్ వద్ద 'రామ్ దలాల్ ట్రావెల్స్' కు చెందిన బస్సును ఆపి సోదాలు చేశారు. బెంగళూరు వెళ్తున్న ఈ బస్సులో ప్రయాణికులను విచారించగా, ఒక్కొక్కరి నుంచి రూ. 6,000 చొప్పున వసూలు చేసినట్లు నిర్ధారణ అయింది. నిబంధనలకు విరుద్ధంగా విమాన చార్జీలతో సమానంగా టికెట్ ధరలు పెంచినందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు, సుమారు రెండు గంటల పాటు ఆ బస్సును అక్కడే నిలిపివేశారు. బస్సును సీజ్ చేసే ప్రక్రియను ప్రారంభించారు. అయితే, అందులో ఉన్న ప్రయాణికులు ఇబ్బంది పడకుండా వారిని బెంగళూరు చేర్చేందుకు అధికారులు ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని సాధారణ చార్జీల కంటే 50 శాతం కంటే ఎక్కువ వసూలు చేసే ట్రావెల్స్ పై కఠిన చర్యలు తప్పవని రవాణా శాఖ కమిషనర్ ఇప్పటికే హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు వందలాది కేసులు నమోదు చేసి, లక్షలాది రూపాయల జరిమానా విధించారు. ప్రయాణికులు ఎవరైనా అధిక చార్జీల బారిన పడితే 9281607001 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

## తిరుమలలో రథసప్తమి వేడుకలు

**తిరుమల (ఏడీఎన్ఎన్) :**

కలియుగ వైకుంఠమైన తిరుమల పుణ్యక్షేత్రంలో ఈనెల 25వ తేదీన రథసప్తమి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సర్వం సిద్ధం చేస్తోంది. సూర్య జయంతిని పురస్కరించుకుని జరిపే ఈ వేడుకను భక్తులు 'మినీ బ్రహ్మోత్సవం'గా పిలుచుకుంటారు. ఈ పవిత్రమైన రోజున శ్రీమలయప్ప స్వామి వారు సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు ఏడు విభిన్న వాహనాలపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేయనున్నారు. ప్రపంచానికి వెలుగునిచ్చే సూర్య భగవానుడి జన్మదినం సందర్భంగా జరిగే ఈ వేడుకలను వీక్షించేందుకు దేశవిదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. రథసప్తమి నాడు తెల్లవారుజామున 5:30 గంటలకు సూర్యప్రభ వాహనంతో స్వామి వారి వాహన సేవలు ప్రారంభమవుతాయి.సరిగ్గా ఉదయం 6:45 గంటలకు సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తాకే అద్భుత దృశ్యాన్ని భక్తులు దర్శించుకోవచ్చు. ఆ తర్వాత వరుసగా ఉదయం 9 గంటలకు చిన్నశేష వాహనం, 11 గంటలకు గరుడ వాహనం, మధ్యాహ్నం 1 గంటకు హనుమంత వాహనంపై స్వామి వారు ఊరేగుతారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారికి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు.తర్వాత సాయంత్రం 4 గంటలకు కల్పవృక్ష వాహనం, 6 గంటలకు సర్వభూపాల వాహనం, చివరగా రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై మలయప్ప స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. భారీగా తరలివచ్చే భక్తులకు వాహన సేవలను దర్శించుకునే వెసులుబాటు కల్పించేందుకు టీటీడీ ఆ రోజున పలు ఆర్జిత సేవలను రద్దు చేసింది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం మరియు సహస్ర దీపాలంకార సేవలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే సుప్రభాతం, తోమాల, అర్చన వంటి నిత్య సేవలను భక్తుల ప్రమేయం లేకుండా ఆలయం లోపల ఏకాంతంగా నిర్వహించనున్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది. రథసప్తమి సందర్భంగా మాడ వీధుల్లోని గ్యాలరీల్లో గంటల తరబడి వేచి ఉండే భక్తుల సౌకర్యార్థం టీటీడీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. వేచి ఉన్న భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదం, పాలు, తాగునీరు పంపిణీ చేసేందుకు శ్రీవారి సేవకులను మరియు ప్రత్యేక సిబ్బందిని రంగంలోకి దించుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్యాలరీల్లో క్యూ లైన్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించింది.



## ఒక చేత్తో చంటి బిడ్డ.. మరో చేత్తో ట్రాఫిక్ క్లియరెన్స్

**కాకినాడ (ఏడీఎన్ఎన్) :**

పోలీస్ అంటే కేవలం లాఠీ పట్టుకోవడమే కాదు.. మానవత్వం, బాధ్యత కలగలిసిన రూపమని నిరూపించారు మహిళా కానిస్టేబుల్ శాంతి. ఒకవైపు చంటి బిడ్డను ఎత్తుకుని, మరోవైపు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ ఆమె చూపిన చొరవ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. విధి నిర్వహణలో ఆమె చూపిన ధైర్యం ఒక నిండు ప్రాణాన్ని కాపాడింది. రంగంపేట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న శాంతికి శనివారం ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం కాకినాడలో బందోబస్తు విధులు కేటాయించారు. తన పసిబిడ్డను కాకినాడలోని బంధువుల ఇంట్లో ఉంచి రోజంతా డ్యూటీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన తర్వాత , తన బిడ్డను తీసుకుని స్వగ్రామం వెళ్లేందుకు ఆమె బయలుదేరారు. అయితే, కాకినాడ - సామర్లకోట రోడ్డులో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆ సమయంలో ఆమె డ్యూటీలో లేరు, పైగా చేతిలో చంటి బిడ్డ ఉంది. కానీ, ఒక కానిస్టేబుల్‌గా తన బాధ్యతను ఆమె మర్చిపోలేదు. బిడ్డను ఎత్తుకుని, భుజాన బ్యాగ్ తగిలించుకుని నేరుగా రోడ్డుపైకి వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం మొదలుపెట్టారు. "నా డ్యూటీ అయిపోయింది కదా" అని వెళ్ళిపోకుండా, తల్లిగా బాధ్యతను, కానిస్టేబుల్‌గా వృత్తి ధర్మాన్ని ఏకకాలంలో నిర్వహించిన శాంతిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు.



## పల్నాడులో నాడు హత్యలు.. నేడు సాగునీరు

**అమరావతి (ఏడీఎన్ఎన్):**


గత ప్రభుత్వ హయాంలో పల్నాడులో రక్తం ఏరులై పారితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో పంట భూములకు సాగునీరు పారుతోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పల్నాడులో ఫ్యాక్షన్ రాజకీయాలపై వైసీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన వీడియో సందేశంలో వైసీపీ తీరుపై నిప్పులు చెరిగారు. "ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ మైనింగ్, దౌర్జన్యాలతో పల్నాడు ప్రాంతం వల్లకాడుగా మారింది. పిన్నెల్లి వంటి గ్రామాల్లో భయంతో ప్రజలు ఊర్లు విడిచి పారిపోయిన పరిస్థితి ఉండేది. ఒక్క గ్రామంలోనే 12 మందిని హత్య చేసిన చరిత్ర జగన్ ప్రభుత్వానిది," అని మంత్రి విమర్శించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చాక, గతంలో ఊరు విడిచి వెళ్లిన వారంతా ఇప్పుడు ధైర్యంగా స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారని ఆయన తెలిపారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణలకు కూడా రాజకీయ రంగు పులిమి, టీడీపీపై బురద చల్లేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని గొట్టిపాటి మండిపడ్డారు. "ఎవరు చనిపోతారా? ఎప్పుడు రాజకీయ లబ్ధి పొందుదామా? అని వైసీపీ నేతలు శవ రాజకీయం చేస్తున్నారు. అక్రమ సంపాదనతో పుట్టిన పార్టీ వైసీపీ అయితే.. తెలుగోడి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం," అని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పల్నాడులో నెలకొన్న ప్రశాంత వాతావరణానికి ఎవరు భంగం కలిగించినా ఊరుకోబోమని మంత్రి హెచ్చరించారు. ఫ్యాక్షన్, హత్యా రాజకీయాలపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతుందని స్పష్టం చేశారు. ఫ్యాక్షన్ లేని పల్నాడును నిర్మించి, ప్రతి రైతు కుటుంబంలో ఒక ఉద్యోగం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గొట్టిపాటి పునరుద్ఘాటించారు.



## అమెరికా ఎత్తుకుపోయింది.. మీ గతేంటి?

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తాజాగా చేసిన ఒక ట్వీట్ రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. పేరు ప్రస్తావించకుండానే కొందరు "ప్రజా నాయకులను" ఉద్దేశించి ఆయన చేసిన హెచ్చరికలు, వెనెజువెలా దేశ ఉదంతంతో పోల్చిన తీరు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నాయకుల చుట్టూ ఉండే అత్యంత సన్నిహితులు (కోటరీలు) అమ్ముడుపోతే ఎంతటి బలమైన నాయకుడైనా ప్రమాదంలో పడతారని విజయసాయిరెడ్డి తన సందేశం లో పేర్కొన్నారు. "అమ్ముడుపోయిన కోటరీల మధ్య బందీలుగా ఉన్న ప్రజా నాయకులారా.. ఆలోచించుకోండి. భవిష్యత్తులో మీకు ఏం జరగబోతోందో ఇప్పటికైనా గుర్తించండి," అంటూ ఆయన ఘాటైన హెచ్చరికలు జారీ చేశారు. తన వాదనకు బలం చేకూర్చేందుకు విజయసాయిరెడ్డి వెనిజులా దేశ చరిత్రలోని ఒక కీలక ఘట్టాన్ని ఉదాహరణగా తీసుకున్నారు. "అపారమైన ప్రజాదరణతో ఎన్నికైన వెనెజువెలా అధ్యక్షుడి చుట్టూ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ఇంటెలిజెన్స్ అధిపతులు ఉన్నప్పటికీ.. అమెరికా ఎలాంటి ప్రతిఘటన లేకుండా ఆయనను, ఆయన భార్యను ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ నుంచి ఎత్తుకుపోగలిగింది. మిసైళ్లు, యుద్ధ విమానాలు ఉన్నా అది సాధ్యమైందంటే కారణం.. ఆ నాయకుడి చుట్టూ ఉన్న వారంతా అమ్ముడుపోవడమే," అని ఆయన వివరించారు. విజయసాయిరెడ్డి ఈ ట్వీట్ ద్వారా ఎవరిని ఉద్దేశించి మాట్లాడారు అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సొంత పార్టీలోని పరిణామాలను ఉద్దేశించా? లేక ప్రత్యర్థి పార్టీల నాయకులను ఎద్దేవా చేశారా? అన్న కోణంలో విశ్లేషణలు సాగుతున్నాయి. నాయకులు తమ చుట్టూ ఉన్న వ్యక్తులపై అతిగా ఆధారపడితే, వారి ద్రోహం వల్ల ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందో ఆయన హెచ్చరించినట్లు కనిపిస్తోంది.



## సంతానం లేదని మహిళ ఆత్మహత్యాయత్నం..

**కడప (ఏడీఎన్ఎన్) :**

మాతృత్వం పొందలేకపోయాననే మనోవేదన ఓ మహిళను ఆత్మహత్య అంచుల వరకు తీసుకెళ్లింది. వివాహమై 15 ఏళ్లు గడుస్తున్నా పిల్లలు కలగలేదనే బాధతో పెన్నానదిలోకి దూకి ప్రాణాలు తీసుకోవాలని ప్రయత్నించిన మహిళను సిద్ధవటం పోలీసులు చాకచక్యంగా రక్షించారు. కడప జిల్లా ఎర్రముక్కపల్లి గ్రామానికి చెందిన శిరీష అనే మహిళకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే, ఇప్పటివరకు సంతానం కలగకపోవడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆమె, సిద్ధవటం హైలెవెల్ వంతెన పైనుంచి ఆదివారం పెన్నానదిలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే, ప్రస్తుతం నదిలో నీటిమట్టం తక్కువగా ఉండటంతో ఆమె నది మధ్యలో చిక్కుకుపోయింది. వంతెన పైనుంచి మహిళ దూకడాన్ని గమనించిన స్థానికులు వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన సిద్ధవటం ఎస్సై మహమ్మద్ రఫీ ,సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న శిరీషను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పోలీసుల విచారణలో తన బాధను చెప్పుకుంటూ శిరీష కన్నీరుమున్నీరైంది. పదేళ్ల కంటే ఎక్కువ కాలం గడిచినా తల్లి కాలేకపోయాననే అవమానం, వేదన భరించలేకే ఈ పని చేసినట్లు ఆమె తెలిపింది. ఎస్సై రఫీ ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి, "ఆత్మహత్య దేనికీ పరిష్కారం కాదు" అని ధైర్యం చెప్పారు. తర్వాత ఆమె కుటుంబ సభ్యులను పిలిపించి, తగిన సూచనలు చేసి సురక్షితంగా ఇంటికి పంపించారు. సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలు కాపాడిన సిద్ధవటం పోలీసులను జిల్లా ఎస్పీ , స్థానికులు అభినందించారు.



## కూటమి పాలనలో 'కన్నీళ్ల సంక్రాంతి

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ వర్గానికీ సంతోషం లేదని, ఈ ఏడాది ప్రజలందరికీ 'కన్నీళ్ల సంక్రాంతి' మిగిలిందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. విశాఖలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, సామాన్యుడిపై ధరల భారం మోపుతున్నారని మండిపడ్డారు. పండగ పూట సామాన్యుడిని ఆదుకోవాల్సింది పోయి, మద్యం ధరలు పెంచి దోచుకుంటున్నారని బొత్స ఆరోపించారు. "రాష్ట్రంలో భూముల విలువ షాక్ కొట్టేలా పెంచేశారు. పంటలకు గిట్టుబాటు ధర లేదు, యూరియా అధిక ధరలకు అమ్ముతున్నారు. విద్యార్థుల పరిస్థితి మరీ దారుణం. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ. 5,600 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యా సంస్థలు జీతాలు ఇవ్వలేని స్థితికి చేరుకున్నాయి. పేదల ప్రాణ రక్షకమైన ఆరోగ్యశ్రీని అటకెక్కించారు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ దాడులపై బొత్స తీవ్రంగా స్పందించారు. "సాల్మన్ హత్య అత్యంత దారుణం. గ్రామంలోకి వస్తే చంపేస్తారా? దహన సంస్కారాలకు వెళ్లాలన్నా ఆధార్ కార్డులు చూపించాలా? గతంలో ఎప్పుడైనా ఇలాంటి గ్రామ బహిష్కరణలు చూశామా?," అని ప్రశ్నించారు. పెద్ద పెద్ద మాటలు చెప్పే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇలాంటి ఘటనలపై ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. ప్రధాని మోదీ గారు ప్రజాస్వామ్యం గురించి గొప్పగా చెబుతుంటారని, ఏపీలో జరుగుతున్న ఈ అరాచకాలను కూడా ఆయన గమనించాలని కోరారు. గ్రీన్ కో ప్రాజెక్ట్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలకు బొత్స కౌంటర్ ఇచ్చారు. "గ్రీన్ కో ప్రాజెక్ట్ వైఎస్సార్‌సీపీ హయాంలోనే వచ్చింది. మా హయాంలో జరిగిన ఒప్పందాలే ఇప్పుడు కార్యరూపం దాల్చుతున్నాయి. మేము పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించామే తప్ప, రియల్ ఎస్టేట్ కంపెనీలకు భూములు కట్టబెట్టలేదు," అని స్పష్టం చేశారు. కేవలం కోడి పందాలకే పరిమితమైన ప్రభుత్వం, ప్రజల అవసరాలను పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు.




- గ్రామ బహిష్కరణలు, హత్యలేనా మీ పరిపాలన?

## ఆర్టీఐ కమిషనర్‌గా హైకోర్టు సీనియర్ న్యాయవాది

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్‌లో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న కీలక పోస్టులను భర్తీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా హైకోర్టు సీనియర్ న్యాయవాది వజ్జా శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది. ఈ నియామకంతో పాటు మరో నలుగురు కమిషనర్లను కూడా ఎంపిక చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. గత కొంతకాలంగా ప్రధాన కమిషనర్ లేకపోవడంతో నిలిచిపోయిన అప్పీళ్లు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియకు ఈ నిర్ణయంతో మార్గం సుగమమైంది. ముఖ్య కమిషనర్‌తో పాటు సమాచార కమిషనర్లుగా వి.శరత్‌చంద్ర కల్యాణ చక్రవర్తి, గాజుల ఆదెన్న, ఒంటేరు రవిబాబు, పరవాడ సింహాచలం నాయుడు బాధ్యతలు చేపట్టనున్నారు. వీరిలో వి.శరత్‌చంద్ర సుదీర్ఘ కాలం పాటు పాత్రికేయ రంగంలో పనిచేసిన అనుభవం కలిగి ఉండగా, మిగిలిన వారు న్యాయ , ఇతర రంగాల్లో నిష్ణాతులు. ఈ కమిషనర్లు పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి మూడేళ్ల పాటు లేదా వారికి 65 ఏళ్ల వయస్సు నిండే వరకు , తమ పదవుల్లో కొనసాగుతారని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం అమలును మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి నేతృత్వంలోని ఎంపిక కమిటీ ఈ పేర్లను ఖరారు చేసింది. గవర్నర్ ఆమోదముద్ర తర్వాత ఈ నియామకాలు అధికారికమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13 వేలకు పైగా ఆర్టీఐ అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్న తరుణంలో, ఈ పూర్తిస్థాయి కమిషన్ ఏర్పాటు ప్రజాస్వామ్యంలో పారదర్శకతను పెంచడానికి , పౌరులకు సకాలంలో సమాచారం అందేలా చూడటానికి ఎంతో దోహదపడనుంది.



## మాతృభూమిపై మమకారం

### జీఎంఆర్ అధినేత కోటి విలువైన భూమి విరాళం..

**రాజాం (ఏడీఎన్ఎన్) :**

వ్యాపార సామ్రాజ్య విస్తరణలో ఎంత ఎత్తుకు ఎదిగినా, తన మూలాలను మర్చిపోనని జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు మరోసారి నిరూపించుకున్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని తన సొంత జిల్లా విజయనగరంలోని రాజాంలో పర్యటించిన ఆయన, భారీ విరాళాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టి తన ఉదారతను చాటుకున్నారు. శనివారం తన భార్య వరలక్ష్మితో కలిసి రాజాంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించిన జీఎంఆర్, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ. కోటి విలువైన 19 సెంట్ల స్థలాన్ని విరాళంగా ప్రకటించారు. దీనికి సంబంధించిన దస్తావేజులను ఆలయ కమిటీ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ స్థలం ఆలయ విస్తరణకు ఎంతో ఉపయోగపడుతుందని కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వ్యాపారవేత్తగానే కాకుండా సామాజిక బాధ్యతలోనూ తనదైన ముద్ర వేస్తున్న మల్లికార్జునరావు, ఈ పర్యటనలో దాదాపు 8 వేల మంది నిరుపేదలకు రూ. 64 లక్షల విలువైన వస్త్రాలను పంపిణీ చేశారు. అంతేకాకుండా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా రాజాం ప్రాంతానికి చెందిన 40 మంది నిరుపేద బాలలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వీరి విద్యాభ్యాసానికి అయ్యే పూర్తి ఖర్చును ఫౌండేషనే భరిస్తుందని హామీ ఇచ్చారు. సేవా కార్యక్రమాల తర్వాత , తమ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులను ఆయన సమీక్షించారు. రన్‌వే, టెర్మినల్ భవన నిర్మాణాలను పరిశీలించి, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా విమానాశ్రయాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.



## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన సిమెంట్ లారీ..

### 14 మందికి తీవ్ర గాయాలు!

**అనంతపురం (ఏడీఎన్ఎన్) :**

శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న భారీ లారీ, ఆర్టీసీ బస్సు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 14 మంది ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం ప్రకారం.. నల్లమాడ మండలం పులగంపల్లి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సిమెంట్ మూటలతో వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఢీకొన్న ధాటికి బస్సు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనతో హాహాకారాలు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి, క్షతగాత్రులను బస్సులో నుంచి బయటకు తీశారు. గాయపడిన 14 మందిని వెంటనే చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం కారణంగా రహదారిపై సిమెంట్ లోడ్‌తో ఉన్న లారీ నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు.


టీ-హబ్ వేదికగా ఎంపీ ఈటల ప్రశంసలు

# దేశాభివృద్ధిలో బీహారీల పాత్ర అమోఘం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

దేశ ప్రగతిలో బీహార్ ప్రజల కష్టం, వారి పాత్ర కీలకమని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కొనియాడారు. హైదరాబాద్‌లోని టీహబ్‌లో ఆదివారం నిర్వహించిన 'బీహార్ డెవలప్‌మెంట్ సమ్మిట్ 2026' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత భారత్' లక్ష్యం నెరవేరాలంటే రాష్ట్రాల అభివృద్ధి ముఖ్యమని, ముఖ్యంగా బీహార్ అభివృద్ధి చెందితేనే దేశం మరింత ముందుకు వెళ్తుందని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా వ్యవసాయం, పౌల్ట్రీ, మౌలిక సదుపాయాల వంటి రంగాల్లో బీహారీలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆయన పేర్కొన్నారు. కరోనా కాలంలో తాను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు, వలస కార్మికులు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయానని ఈటల ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అప్పట్లో లక్షలాది మంది బీహారీలు కాలినడకన తమ స్వస్థలాలకు వెళ్లడం చూసి కన్నీళ్లు వచ్చాయని, ఆ తర్వాత పరిశ్రమలు తిరిగి కోలుకోవడానికి వారే మళ్ళీ కీలకమయ్యారని తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గాన్ని ఒక 'మినీ ఇండియా'గా ఈటల అభివర్ణించారు.తెలంగాణలో స్థిరపడిన బీహారీలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. బీహార్‌లో ఇప్పుడు 'జంగల్ రాజ్ ' పోయి అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని, అక్కడి యువశక్తి దేశానికి పెద్ద ఆస్తి అని ఆయన స్పష్టం చేశారు.

# బీజేపీ కన్నా బ్రిటిష్ పాలనే బెటర్

## ఎర్రజెండా ఏనాడూ తలవంచదన్న సీఎం

**ఖమ్మం (ఏడీఎన్ఎన్) :**

భారతీయ జనతా పార్టీ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నరు . ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ , మతతత్వ శక్తులను ఎదుర్కోవడంలో కమ్యూనిస్టుల పాత్రను కొనియాడుతూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరి హక్కులను కాలరాస్తోందని సీఎం ధ్వజమెత్తారు. నిజానికి బీజేపీ కంటే బ్రిటిష్ పాలనే నయమని , బ్రిటిష్ వారు పోతూ పోతూ ఈ దేశానికి కొన్ని వ్యవస్థలను ఇచ్చి వెళ్లారని , కానీ బీజేపీ ప్రభుత్వం ఉన్న వ్యవస్థలను కూల్చివేస్తోందని సీఎం రేవంత్ ఆరోపించారు . బ్రిటిష్ వారి కంటే ప్రమాదకరంగా మారిన బీజేపీ విధానాలను తిప్పి కొట్టేందుకు అందరం ఏకం కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల పోరాట పటిమను ప్రశంసిస్తూ సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా, ఎంతటి ఒత్తిడి ఎదురైనా ఏనాడూ తలవంచని చరిత్ర ఎర్రజెండాదని , రజాకార్లకు, నిజాంకు వ్యతిరేకంగా నాలుగు వేల మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని , వారి త్యాగాల పునాదుల మీదనే తెలంగాణకు విముక్తి లభించిందని సీఎం తెలిపారు . అలాంటి చైతన్యం ఉన్న ఖమ్మం జిల్లాలో సీపీఐ శతాబ్ది సభ జరగడం ఆనందకరమని పేర్కొన్నారు. "దున్నేవాడిదే భూమి" అనే కమ్యూనిస్టుల



నినాదమే కాంగ్రెస్ భూ సంస్కరణలకు స్ఫూర్తి అని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఉపాధి హామీ వంటి చట్టాలను కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని విమర్శించారు. రాబోయే రోజుల్లో బీజేపీని గద్దె దించి, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు కమ్యూనిస్టులు తోడుగా రావాలని ఆయన కోరారు. ఖమ్మం జిల్లాలో బీజేపీకి స్థానం లేదని, ఇక్కడి ప్రజలు ఆ పార్టీని ఎన్నడో నిషేధించారని ఆయన ఎద్దేవా చేశారు.

# తులసివనంలో కాంగ్రెస్ 'గంజాయి' మొక్క వంటిది

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఖమ్మం జిల్లాలో జరిగిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల వేదికగా కేంద్ర ప్రభుత్వంపై, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఆయన మీడియాతో ఆదివారం మాట్లాడుతూ, సీఎం తీరుపై నిప్పులు చెరిగారు. తులసివనంలో కాంగ్రెస్ పార్టీ ఒక గంజాయి మొక్క వంటిదని , దేశానికి అసలైన ప్రమాదం బీజేపీతో కాదని , కాంగ్రెస్‌తోనే ఉందని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ సాగించిన పాలన మొత్తం అవినీతి, కుంభకోణాలమయమని రాంచందర్ రావు గుర్తుచేశారు. దేశంలో గత 12 ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అవినీతి రహితమైన, పారదర్శకమైన పాలన అందిస్తున్నారని , ప్రపంచ దేశాలన్నీ నేడు భారత్ వైపు చూస్తున్నా



యంటే అది కేవలం మోదీ నాయకత్వ పటిమ వల్లనే సాధ్యమైందని రాంచందర్ రావు అన్నారు . జాతీయ అంశాలపై ఏమాత్రం అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి కేంద్రంపై విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. సీఎం ఖమ్మం సభలో చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన కొట్టిపారేశారు. సీపీఐ పార్టీ ఇప్పటికే తన జాతీయ హోదాను కోల్పోయిందని ఎద్దేవా చేశారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ కూడా అదే బాటలో పయనించి జాతీయ హోదాను కోల్పోబోతోందని ఎద్దేవా చేశారు. కేంద్రంపై విమర్శలు చేసే ముందు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఏ స్థితిలో ఉందో రేవంత్ రెడ్డి ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. భారతదేశ భవిష్యత్తుకు, భద్రతకు బీజేపీనే శ్రీరామరక్ష అని రాంచందర్ రావు స్పష్టం చేశారు. మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంటే, ఓర్వలేకనే కాంగ్రెస్ అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి తన స్థాయిని మరచి మాట్లాడుతున్నారని, తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.

# మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు మంత్రివర్గం ఆమోదం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ములుగు జిల్లా మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన 27వ క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం తర్వాత మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో వివరాలను పంచుకున్నారు. రాష్ట్రంలో గడువు పూర్తయిన 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు, మొత్తం 2,996 వార్డులు మరియు డివిజన్లలో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రకారం రిజర్వేషన్లు ఖరారయ్యాయని, త్వరలోనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఎన్నికలతో పాటు మరికొన్ని చారిత్రాత్మక నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల కోసం బాసర నుండి భద్రాచలం వరకు 'టెంపుల్ సర్క్యూట్ 'ను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీనికోసం ఫిబ్రవరి 15లోపు కన్సల్టెన్సీ నివేదిక అందజేయనుంది. అలాగే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 (A, B) భూసేకరణ




కోసం రూ.2,787 కోట్లను కేటాయిస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ములుగు జిల్లా సాగునీటి అవసరాల కోసం పొట్లపూర్ ఎత్తిపోతల పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వివిధ ప్రభుత్వ సంస్థలకు 14 ప్రాంతాల్లో భూముల కేటాయింపునకు కూడా ఆమోదం లభించింది. మేడారం వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో క్యాబినెట్ సమావేశం నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని మంత్రులు కొనియాడారు.



# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**హుస్నాబాద్ (ఏడీఎన్ఎన్) :**

పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తోందని, వారి సొంతింటి కల నెరవేర్చే వరకు విశ్రమించబోమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హుస్నాబాద్‌లో ఆదివారం జరిగిన లబ్ధిదారుల సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయాలకు తావు లేకుండా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే వారికి ఆర్థిక సాయంతో పాటు అదనంగా 8 ట్రాక్టర్ల ఇసుకను ఉచితంగా అందజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో ప్రజలను వంచించిందని మంత్రి విమర్శించారు , తమ పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం ప్రభాకర్ చెప్పారు. కేవలం గృహ నిర్మాణమే కాకుండా మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని గుర్తు చేస్తూ, 3,520 మంది మహిళలకు రూ. 1.13 కోట్ల వడ్డీ లేని రుణాలను మరియు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. హుస్నాబాద్‌లో 250 పడకల ఆసుపత్రి, ఇంజనీరింగ్ కాలేజీ, అద్దాల బ్రిడ్జి,పారిశ్రామిక పార్కు వంటి నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం స్టీల్ బ్యాంకుల ఏర్పాటు వంటి వినూత్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా కోరారు.



# రంగారెడ్డి జిల్లాను ముక్కలు చేయొద్దు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ప్రజాభిప్రాయం తీసుకోకుండానే రంగారెడ్డి జిల్లాలోని కీలక మున్సిపాలిటీలను చార్మినార్ జోన్‌లో విలీనం చేయడంపై బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అదిభట్ల, మహేశ్వరం, తుక్కుగూడ వంటి మున్సిపాలిటీలను చార్మినార్‌లో కలపడం వెనుక రేవంత్ ప్రభుత్వం పెద్ద కుట్ర పన్నిందని ఆరోపించారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించే ప్రక్రియ అధికారుల ప్రమేయం లేకుండా కేవలం 'ఓవైసీ హిల్స్ 'లోనే జరుగుతోందని ఎద్దేవా చేశారు. పాతబస్తీలో కార్పొరేటర్ల సంఖ్యను పెంచుతూ, విలీనం చేస్తున్న ప్రాంతాల్లో స్థానిక ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. పాతబస్తీలో నల్లా బిల్లులు, కరెంటు బిల్లులు కూడా సరిగ్గా చెల్లించని వారితో, పన్నులు సక్రమంగా కట్టే రంగారెడ్డి జిల్లా ప్రజలను ఎందుకు కలుపుతున్నారని ఎంపీ నిలదీశారు. రంగారెడ్డి జిల్లాను సగం ఎంఐఎంకు అప్పజెప్పేందుకే ఈ ప్రయత్నం జరుగుతోందని, మెజార్టీ హిందువులు నివసించే ప్రాంతాలను బలవంతంగా చార్మినార్ జోన్‌లో విలీనం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. గత పాలకులు జిల్లా ఖజానాను దోచుకుని ఫామ్‌హౌస్‌కు తరలిస్తే, ఇప్పుడు రేవంత్ సర్కార్ జిల్లా ప్రజల భవిష్యత్తును అగమ్యగోచరం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి, మున్సిపాలిటీల విభజనపై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని, ప్రజల అభీష్టం మేరకే నిర్ణయం తీసుకోవాలని కొండా విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.



# ఆంధ్రజ్యోతి కథనాలపై 'సిట్' వేసే దమ్ముందా?

## సీఎం రేవంత్ రెడ్డికి దేశపతి శ్రీనివాస్ సవాల్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఎన్టీవీ కథనాలపై విచారణకు సిట్ వేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలపై కూడా అదే తరహాలో విచారణ జరిపించే దమ్ముందా అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు . ముఖ్యమంత్రి ద్వంద్వ వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వేమూరి రాధాకృష్ణ ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనాలపై సీఎంకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రాధాకృష్ణతో రేవంత్ రెడ్డికి ఉన్న సాన్నిహిత్యం బహిరంగ రహస్యమని, ఆయన పుట్టినరోజున స్వయంగా ఇంటికి వెళ్లి అభినందనలు తెలిపే రేవంత్ రెడ్డి, ఇప్పుడు వార్తలు రాసే ముందు తన వివరణ అడగాలని మెత్తటి మాటలతో సరిపుచ్చడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే మాటలతో కాలయాపన చేయకుండా, తక్షణమే సిట్ వేసి విచారణ జరిపించాలని, వాస్తవాలను నిగ్గుతేల్చి దోషులను కఠినంగా శిక్షించాలని దేశపతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ సర్కార్‌కు దోపిడీనే అజెండా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో రెండేళ్ల కాంగ్రెస్ పాలన కేవలం 'దోచుకో.. దాచుకో.. పంచుకో' అన్నట్లుగా సాగుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆయన క్యాబినెట్ మంత్రులకు మధ్య ప్రస్తుతం దోచుకున్న సొమ్ముపై వాటాల పంచాయితీ నడుస్తోందని ఆరోపించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, శ్రీధర్ బాబు వంటి వారిపై వస్తున్న ఆరోపణలు, సినిమా టికెట్ల రేట్ల పెంపుదల వ్యవహారం చూస్తుంటే ప్రభుత్వంలో అసలు ఏం జరుగుతుందో ప్రజలకు అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఒక మంత్రికి తెలియకుండానే జీవోలు రావడం, మరో మంత్రి కూతురే స్వయంగా సీఎంపై ఆరోపణలు చేయడం వంటివి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. పరిపాలనను గాలికొదిలేసి వ్యక్తిగత దూషణలకు దిగుతున్న రేవంత్ రెడ్డికి, గతంలో చంద్రబాబుకు పట్టిన గతే పడుతుందని, ప్రజలు ఆయన అధికార కోటను కూల్చి పాతరేయడం ఖాయమని హెచ్చరించారు. కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోని రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ దిమ్మెలను కూలుస్తామనడం హాస్యాస్పదమని, దమ్ముంటే తాకి చూడాలని సవాల్




విసిరారు. హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్న సీఎంపై డీజీపీ తక్షణమే చర్యలు తీసుకోవాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# అమెరికా ముందు మోదీ తలవంచారు

**ఖమ్మం (ఏడీఎన్ఎన్) :**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హిట్లర్‌లా మారి అన్ని దేశాలను బెదిరిస్తున్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మండిపడ్డారు. పాలస్తీనాలో వేల మంది అమాయకుల మారణహోమానికి ఇజ్రాయెల్, అమెరికాయే కారణమని విమర్శించారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల బహిరంగ సభలో డి.రాజా పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , భారత ప్రధాని మోదీ అమెరికా ముందు తలవంచారని , దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారే తప్ప, సామాన్యుల అభివృద్ధి కోసం ఆయన చేసింది ఏమిలేదని డి .రాజా దుయ్యబట్టారు. దేశాభివృద్ధి విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని, గడిచిన కాలంలో ఆయన దేశం కోసం చేసిందేమీ లేదని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. 1925లో ఆవిర్భవించిన నాటి నుంచే సీపీఐ సంపూర్ణ స్వరాజ్యం కావాలని నినదించిందని , స్వాతంత్ర్య సాధనలో కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు కీలక పాత్ర పోషించి పోరాటాలు చేశాయని , కానీ ఆనాడు ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమీ లేదని డి.రాజా పేర్కొన్నారు . పైగా అప్పటి బ్రిటిష్ పాలకులతో ఆర్ఎస్ఎస్ చేతులు కలిపిందని డి.రాజా ఆరోపించారు. సీపీఐ ప్రస్థానం ఎన్నో త్యాగాలతో మొదలైందని, వందేళ్ల కాలంలో పేదలు, కార్మికుల పక్షాన నిలబడి అనేక హక్కులు సాధించిందని గుర్తుచేశారు. భవిష్యత్తులోనూ మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని డి.రాజా స్పష్టం చేశారు.


సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో డి.రాజా ఘాటు విమర్శలు



# సీఎం కు రాజకీయ బహిష్కరణ తప్పదు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజకీయ బహిష్కరణ రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, రాబోయే ఎన్నికల్లో అవినీతి, అహంకారానికి ప్రతీకగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు భూస్థాపితం చేయడం ఖాయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ జెండాలను, గద్దెలను కూల్చాలంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ దర్బార్‌లో బానిసలా చూసిన కాంగ్రెస్ సంస్కృతిని అంతం చేయాలనే లక్ష్యంతోనే ఎన్టీఆర్ అప్పట్లో టీడీపీని స్థాపించారని, ఆ విషయాన్ని రేవంత్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు. అదే స్ఫూర్తితో కేసీఆర్ కూడా సీమాంధ్ర శక్తులతో పోరాడి తెలంగాణను సాధించారని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటును అడ్డుకున్న చంద్రబాబును ఇక్కడి ప్రజలు బహిష్కరిస్తే, రేవంత్ రెడ్డికి మాత్రం ఇంకా ఆయనపై ఎందుకంత ప్రేమ అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉంటూ బీజేపీతో పొత్తులో ఉన్న టీడీపీకి రేవంత్ భజన చేయడం వెనుక ఉన్న మర్మమేంటో కాంగ్రెస్ శ్రేణులు ఆలోచించుకోవాలని సూచించారు. గల్లీలో చంద్రబాబు, ఢిల్లీలో మోదీ జపం చేస్తూ రేవంత్ రెడ్డి వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారారని వేముల ప్రశాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.



# రాహుల్ గాంధీ ఒక 'రాజకీయ పర్యాటకుడు'

## జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు.రాహుల్ గాంధీని ఒక 'రాజకీయ పర్యాటకుడు'గా ఆమె అభివర్ణించారు.ఎన్నికల వేళ మాత్రమే రాహుల్‌కు తెలంగాణ గుర్తుకు వస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర పర్యటనకు వస్తున్న ఆయనకు సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు ఆదివారం సంధించారు. తెలంగాణ ప్రగతిపై అవగాహన లేకుండా పర్యటనలు చేయడం వల్ల ప్రయోజనం లేదని, కేవలం ఓట్ల కోసమే వస్తున్న 'ఎలక్షన్ గాంధీ'గా రాహుల్ ను ఎద్దేవా చేశారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీపై కాంగ్రెస్ ఎందుకు వెనకడుగు వేస్తోందో సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. దశాబ్ద కాలంగా తెలంగాణ సాధించిన అభివృద్ధిని కళ్లు తెరిచి చూడాలని హితవు పలికారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజన హామీల సాధనపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, కేవలం పర్యటనలతో ప్రజలను మభ్యపెట్టలేరని కవిత స్పష్టం చేశారు.



# మున్సిపల్ ఎన్నికల్లో కుమ్మక్కు రాజకీయం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక కాంగ్రెస్, బీజేపీ పార్టీలు లోపాయికారీ ఒప్పందం చేసుకుంటున్నాయని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతోనే ఈ రెండు పార్టీలు ఇప్పుడు ఒక్కటవుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒకరినొకరు పొగుడుకోవడమే దీనికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన స్థాయిని మర్చిపోయి కేటీఆర్, హరీశ్ రావులపై 'మారీచుడు, సుబాహుడు' అంటూ నీచమైన వ్యాఖ్యలు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేసీఆర్ గనుక తెలంగాణ తీసుకురాకపోయి ఉంటే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవారా?" అని నిలదీశారు. పాలమూరు జిల్లా అభివృద్ధిపై సీఎం చేసిన వ్యాఖ్యలను శ్రీనివాస్ గౌడ్ తిప్పికొట్టారు. గతంలో తన తండ్రి అంత్యక్రియల సమయంలో మోటార్ ఆన్ చేసుకునేందుకు కరెంటోళ్లను బతిమిలాడానని అసెంబ్లీలో చెప్పిన రేవంత్ రెడ్డి, నేడు అదే పాలమూరులో కేసీఆర్ పుణ్యమా అని మారిన పరిస్థితులను ఎందుకు చూడలేకపోతున్నారని ప్రశ్నించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావడంలో కాంగ్రెస్, బీజేపీలు విఫలమయ్యాయని విమర్శించారు. అలాగే, మంత్రులు తమ అంతర్గత గొడవలతో మహిళా ఐఏఎస్ అధికారుల పరువును బజారున పడేస్తున్నారని, దీనివల్ల రాష్ట్రంలో అధికారులు పనిచేయడానికి భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలోనే విద్య, వైద్యం, సాగునీటి రంగాలకు అత్యంత ప్రాధాన్యత లభించిందని, ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
19.01.2026
www.manasarkar.com

## రాశి ఫలాలు

**19-01-2026 సోమవారం**

**మేషం:**
ముఖ్యమైన వ్యవహారాలన్నీ పూర్తవుతాయి. గృహ, వాహన ప్రయత్నాలు చాలావరకు ఫలిస్తాయి. బ్యాంక్ బ్యాలెన్స్ బాగా వృద్ధి చెందుతుంది. ఆర్థిక అవసరాలు తీరిపోవడంతో పాటు ఆర్థిక సమస్యలు పరిష్కారమవుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఆస్తి వివాదాల పరిష్కారానికి సమయం అనుకూలంగా ఉంది. ఉద్యోగంలో జీతభత్యాలకు సంబంధించిన శుభ వార్తలు వింటారు.

**వృషభం:**
అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. బంధుమిత్రుల నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాల్లో మార్పులు చేసి లబ్ధి పొందుతారు. నిరుద్యోగులకు కొత్త ఆఫర్లు అందుతాయి. ఉద్యోగంలో అనుకూల వాతావరణం నెలకొంటుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో కార్య సిద్ధి కలుగుతుంది. అప్రయత్న ధన లాభానికి అవకాశం ఉంది.

**మిథునం:**
ఏ ప్రయత్నం తలపెట్టినా విజయవంతం అవుతుంది. అన్ని రంగాల వారికి సమయం అనుకూలంగా ఉంది. వృత్తి, ఉద్యోగాల్లో ఆశించిన ప్రోత్సాహకాలు అందుతాయి. అధికారుల నుంచి ఆదరణ పెరుగుతుంది. వ్యాపారాల్లో రాబడి బాగా వృద్ధి చెందుతుంది. తోబుట్టువులతో ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగం మారడానికి అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు ఆశించిన ఆఫర్లు అంది వస్తాయి. ఆర్థిక స్థిరత్వం చోటు చేసుకుంటుంది.

**కర్కాటకం:**
ఉద్యోగంలో కొద్దిగా ఓర్పు, సహనాలతో వ్యవహరించడం మంచిది. వ్యాపారాల్లో శ్రమాధిక్యత ఉన్నా ఫలితం ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు బిజీగా సాగుతాయి. ఎటువంటి ప్రయత్నమైనా సానుకూల ఫలితాలు ఇచ్చే అవకాశం ఉంది. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాలు తప్పకుండా సఫలం అవుతాయి. నిరుద్యోగులకు విదేశాల నుంచి కూడా ఆఫర్లు వచ్చే సూచనలున్నాయి. కుటుంబ జీవితంలో ఒత్తిడి తగ్గుతుంది.

**సింహం:**
ఉద్యోగంలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంది. వ్యక్తిగత సమస్యల నుంచి బయట పడే అవకాశం ఉంది. డాక్టర్లు, లాయర్లు తదితర వృత్తుల వారికి అవకాశాలు పెరుగుతాయి. బంధుమిత్రులతో విందులు, వినోదాలకు ప్లాన్ చేస్తారు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు లభిస్తాయి. సోదర వర్గంతో అనుకోకుండా స్థిరాస్తి వివాదం పరిష్కారం అవుతుంది.

**కన్య:**
వృత్తి, వ్యాపారాలు బాగా బలం పుంజు కుంటాయి. ఉద్యోగంలో సానుకూల మార్పులు చోటు చేసుకుంటాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఆశించిన స్థాయిలో ధన లాభాలు కలుగుతాయి. రావలసిన సొమ్మంతా వసూలవుతుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ఆహార, విహారాల్లో జాగ్రత్తగా ఉండడం మంచిది. సన్నిహితుల వల్ల ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది.

**తుల:**
ఆదాయం బాగా వృద్ధి చెందుతుంది. షేర్లు, స్పెక్యులేషన్లు అంచనాలను మించి లాభిస్తాయి. ఉద్యోగంలో ప్రాభవం, గౌరవ మర్యాదలు బాగా పెరుగుతాయి. వృత్తి జీవితంలో కూడా దూసుకుపోతారు. వ్యాపారాలు ఆర్థికంగా బాగా బలం పుంజుకుంటాయి. ఆరోగ్యానికి లోటుండదు. నిరుద్యోగుల ప్రయత్నాలకు సానుకూల స్పందన లభిస్తుంది. ఉద్యోగం మారే అవకాశం ఉంది. జీవిత భాగస్వామికి ఆర్థిక పురోగతి లభిస్తుంది.

**వృశ్చికం:**
ఆర్థిక సమస్యలు చాలావరకు తగ్గుముఖం పడతాయి. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆశించిన శుభవార్తలు వింటారు. ఉద్యోగ జీవితం కూడా ప్రశాంతంగా సాగిపోతుంది. వృత్తి, వ్యాపారాలు నిలకడగా కొనసాగుతాయి. కొన్ని ముఖ్యమైన వ్యవహారాలు, పనుల్ని విజయవంతంగా పూర్తి చేస్తారు. అదనపు ఆదాయ ప్రయత్నాలు నెరవేరుతాయి. ఇంటా బయటా అనుకూల వాతావరణం నెలకొంటుంది.

**ధనస్సు:**
వృత్తి, ఉద్యోగాల్లో పదోన్నతులకు, జీతభత్యాల పెరుగుదలకు బాగా అవకాశం ఉంది. వ్యాపారాలు కూడా అంచనాలకు మించి లాభాలు అందిస్తాయి. మరింత మంచి ఉద్యోగంలోకి మారడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ పరిస్థితులు అనుకూలంగా సాగిపోతాయి. ఆర్థిక విషయాలకు సమయం బాగా అనుకూలంగా ఉంటుంది. ముఖ్య మైన ప్రయత్నాలు, వ్యవహారాలు సానుకూలం అవుతాయి.

**మకరం:**
వృత్తి, ఉద్యోగాల్లో మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపారాలు అనుకూలంగా సాగిపోతాయి. లాభదాయకమైన పరిచయాలు ఏర్పడతాయి. ఉద్యోగ ప్రయత్నాలకు సానుకూల స్పందన లభిస్తుంది. ఆదాయ ప్రయత్నాలు విజయవంతం అవుతాయి. మనసులోని కోరికలు చాలావరకు నెరవేరుతాయి. మీ ప్లాన్లు సక్సెస్ అయ్యే అవకాశం ఉంది. ఆస్తి వివాదం ఒకటి పరిష్కార దిశగా సాగుతుంది.

**కుంభం:**
నిదానంగానే అయినా ప్రతి పనీ పూర్తవుతుంది. ఆస్తి, ఆర్థిక వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. వృత్తి, వ్యాపారాలు లాభాల పరంగా కొద్దిగా పుంజుకుంటాయి. మీ వ్యూహాలు, ఆలోచనలు సత్ఫలితాలనిస్తాయి. ఉద్యోగాల్లో అధికారులు మీ మీద ఎక్కువగా ఆధారపడే అవకాశం ఉంది. ప్రముఖులకు సన్నిహితం అవుతారు. కొన్ని ముఖ్యమైన వ్యవ హారాలను పూర్తి చేయడం మంచిది. ఆర్థిక ప్రయత్నాలు ఆశించిన ఫలితాలనిస్తాయి.

**మీనం:**
ఉద్యోగంలో ప్రాధాన్యం, ప్రాభవం బాగా పెరుగుతాయి. అధికారుల నుంచి ఆశించిన ప్రోత్సాహకాలు లభిస్తాయి. వృత్తి జీవితంలో తీరిక ఉండదు. వ్యాపారాలు బాగా కలిసి వస్తాయి. ఏ ప్రయత్నం తల పెట్టినా సఫలమవుతుంది. ఆస్తి, ఆర్థిక వ్యవహారాలను పట్టుదలగా పూర్తి చేయడం జరుగుతుంది. ముఖ్యమైన పెండింగ్ పనులు పూర్తవుతాయి. అనవసర పరిచయాలకు దూరంగా ఉండాలి.



# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు టీచర్లు మృతి

**సూర్యాపేట (ఏడీఎన్ఎన్):**



అర్వపల్లి - సంక్రాంతి సెలవులు ముగిసి శనివారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో టీచర్లు స్కూళ్లకు వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు టీచర్లు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) ప్రత్యేక అధికారిణి మామిడాల కల్పన (43), తుంగతుర్తి మండలం రావులపల్లి జెడ్పీ హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు పోరెడ్డి గీత (48)తో పాటు తుంగతుర్తి జెడ్పీహెచ్ఎస్ ప్రధానాపాధ్యాయుడు అలువాల ప్రవీణ్ కుమార్, తుంగతుర్తి మండలం అన్నారం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు అలువాల సునీతారాణి శనివారం ఉదయం గీతకు చెందిన కారులో నల్లగొండ నుంచి పాఠశాలలకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు అర్వపల్లి శివారులోని ముదిరాజ్ కాలనీ వద్దకు రాగానే అదుపుతప్పి.. రోడ్డు పక్కన ఇంటి నిర్మాణం కోసం పోసిన ఇసుక కుప్పపై నుంచి వెళ్లి పల్టీలు కొడుతూ పొలాల్లోకి దూసుకెళ్లింది. అదే సమయంలో కారు ముందు భాగం ఎడమవైపు టైరు పేలింది. కారు పల్టీ కొట్టడంతో కల్పనరోడ్డు పైపడి తీవ్రంగా గాయపడింది. ఆ తర్వాత సునీతారాణి, గీత ఎగిరి కిందపడ్డారు. ప్రవీణ్ కుమార్ కారులో ఇరుక్కుపోగా స్థానికులు బయటకు తీశారు. కారు డ్రైవర్ నదిపల్లిగిరి స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కల్పన మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. సునీతారాణి, ప్రవీణ్ కుమార్ పరిస్థితి విషమంగా ఉండగా హైదరాబాద్‌కు తరలించారు. వీరిద్దరు అన్నాచెల్లెళ్లు. ఈ ప్రమాదం కారు డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త వల్లే జరిగిందని పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లగొండలోని లక్ష్మీనగర్ కాలనీలో నివాసముంటున్న గీత.. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం రావులపల్లి ప్రభుత్వ పాఠశాలలో గెజిటెడ్ హెచ్ఎంగా పనిచేస్తున్నారు. ఈమె కుమారుడు సాయినితన్ రెడ్డి ఎంఎస్ కోసం అమెరికా వెళ్లాడు. కూతురు సౌమికకు పెళ్లి అయి భర్తతో కలిసి అమెరికాలో ఉంటోంది. వచ్చే నెలలో కుమారుడికి కాన్వొకేషన్ ఉంది. దీంతో గీత ఫిబ్రవరిలో పిల్లల వద్దకు వెళ్లేందుకు టిక్కెట్లు కూడా బుక్ చేసుకున్నారు. కానీ, శనివారం పాఠశాలకు వెళ్తూ గీత రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తల్లి మృతి విషయం తెలుసుకున్న కూతురు, కుమారుడు.. భారత్‌కు బయల్దేరారు. కాగా.. నల్లగొండలోని హనుమాన్ నగర్‌లో నివాసం ఉండే లింగంపల్లి కల్పన తుంగతుర్తి కేజీబీవీలో ప్రత్యేకాధికారి (ఎస్ఓ)గా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారు. సాయంత్రం త్వరగా వస్తానని చెప్పి.. రోజూ వచ్చే సమయం కంటే ముందుగానే శవమై వచ్చిందని ఆమె భర్త, పిల్లలు విలపించారు. గీత, కల్పన మృతదేహాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నివాళులర్పించి మృతుల కుటుంబసభ్యులను ఓదార్చారు.

# భర్త స్మార్ట్ ఫోన్ కొనిపెట్టలేదని భార్య ఆత్మహత్య


**ఆరావళి (ఏడీఎన్ఎన్):**



గుజరాత్‌లో షాకింగ్ ఘటన జరిగింది. భర్త తనకు స్మార్ట్ ఫోన్ కొనిపెట్టలేదన్న కోపంలో ఓ భార్య క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంది. మోడాసా టౌన్‌లో శనివారం ఈ దారుణం వెలుగు చూసింది. మీడియా కథనాల ప్రకారం, ఊర్మిళ అనే యువతి తన భర్తతో కలిసి స్థానికంగా చైనీస్ ఫుడ్ బిజినెస్‌ను నిర్వహిస్తోంది. కొన్నిరోజుల క్రితం ఆమె భర్తను కొత్త మొబైల్ ఫోన్‌ను కొనివ్వమని అడిగింది. అయితే, ఆర్థిక ఇబ్బందులు ఉన్నందున ప్రస్తుత పరిస్థితుల్లో ఫోన్ కొనడం సాధ్యం కాదని అతడు చెప్పాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. చివరకు శనివారం క్షణికావేశంలో యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. యువతి ఆత్మహత్యతో స్థానికంగా పెద్ద చర్చగా సాగింది. స్వల్ప వివాదం ఇలాంటి మలుపు తిరుగుతుందని తాము ఊహించలేదని అనేకమంది ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. యాక్సిడెంటల్ డెత్‌గా కేసు నమోదు చేశారు. నేపాల్‌కు చెందిన ఆ జంట ఉపాధి నిమిత్తం గుజరాత్‌కు వచ్చారని పోలీసులు తెలిపారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో కూడా దాదాపు ఇలాంటి ఘటన వెలుగు చూసిన విషయం తెలిసిందే. శివపురి జిల్లాకు చెందిన ఓ మహిళ అత్తతో నెయ్యి విషయంలో గొడవపడి చివరకు ఆత్మహత్య చేసుకుంది. భర్త బలవంతం మేర ఆమె తొలుత అత్తకు 100 గ్రాముల నెయ్యిని అయిష్టంగానే ఇచ్చింది. ఆ తరువాత భర్త మరోసారి నెయ్యిని తన తల్లికి ఇవ్వడంతో కోపం పట్టలేకపోయిన ఆమె క్షణికావేశంలో విషం తాగింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్టు డాక్టర్లు చెప్పారు.

# నీటి మడుగులోకి దూసుకెళ్లిన కారు.. టెకీ మృతి

**లక్నో (ఏడీఎన్ఎన్):**



అదుపుతప్పిన కారు లోతైన నీటి గుంతలోకి దూసుకెళ్లింది. ఆ కారులో ఉన్న టెకీ తన తండ్రికి ఫోన్ చేసి కాపాడాలని కోరాడు. అక్కడకు చేరుకున్న ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అయితే సహాయక చర్యలు ఆలస్య మయ్యాయి. ఈ నేపథ్యంలో నీట మునిగి ఆ టెకీ మరణించాడు. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఈ సంఘటన జరిగింది. బీహార్‌లోని సీతామర్హికి చెందిన 27 ఏళ్ల యువరాజ్ మెహతా, గురుగ్రామ్‌లోని డన్‌హంబీ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల కిందట తల్లి మరణించింది. దీంతో తండ్రితో కలిసి నోయిడాలో నివసిస్తున్నాడు. కాగా, జనవరి 16న రాత్రి వేళ పని ముగించుకుని తర్వాత యువరాజ్ తన కారులో ఇంటికి బయలుదేరాడు. నోయిడాలోని సెక్టార్ 150 వద్ద కారును మలుపు తిప్పేందుకు ప్రయత్నించాడు. అయితే పొగమంచు కారణంగా ముందు ఏముందో యువరాజ్‌కు కనిపించలేదు. దీంతో ఆ కారు చిన్న గోడను ఢీకొట్టింది, ఆ తర్వాత 70 అడుగుల లోతైన నీటి గుంతలోకి కారు దూసుకెళ్లింది. మరోవైపు కారులో ఉన్న యువరాజ్ వెంటనే తండ్రి రాజ్‌కుమార్‌కు ఫోన్ చేశాడు. తన కారు నీటిలో మునిగిపోతున్నదని, తాను అందులో చిక్కుకున్నట్లు చెప్పాడు. తనను కాపాడాలని కోరాడు. తండ్రి రాజ్‌కుమార్ వెంటనే అక్కడకు చేరుకున్నాడు. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కాగా, ఫైర్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చాలా ఆలస్యంగా అక్కడకు చేరుకున్నాయి. ఈతగాళ్లు అందుబాటులో లేకపోవడంతో కారు టాప్‌పై ఉన్న యువరాజ్‌ను కాపాడే ప్రయత్నాలు ఆలస్యమయ్యాయి. 'నన్ను కాపాడండి. నాన్న కాపాడు' అని అతడు అరిచాడు. మొబైల్ టార్చ్ వెలుగులో తాను ఎక్కడ ఉన్నది చూపించాడు. అప్పటికే ఐదు గంటలకు పైగా సమయం వృధా అయిపోయింది పైగా అతణ్ణి కాపాడడం కష్టమైపోయింది. చివరకు ఫ్లిప్‌కార్ట్ డెలివరీ ఏజెంట్ మోనిందర్ అతణ్ణి రక్షించేందుకు ప్రయత్నించాడు. తాడు సహాయంతో నీటి గుంతలోకి దిగాడు. అయితే అప్పటికే యువరాజ్ నీటిలో మునిగి మరణించాడు. బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా అతడు చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నీటిలో మునిగిన కారును కూడా ఆ తర్వాత బయటకు తీశారు. ఏమి ప్రయోజనం అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. అయితే 70 అడుగుల లోతైన నీటి గుంత వద్ద ఎలాంటి హెచ్చరికలు ఏర్పాటు చేయని అధికారుల నిర్లక్ష్యంపై యువరాజ్ తండ్రి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికుల ఆందోళనతో అధికారులు ఆ నీటి గుంతను చెత్త, మట్టి, రాళ్లతో నింపే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

# మెదక్‌లో రాబందు సంచారం.. కాలికి జీపీఎస్ ట్రాకర్..

**మెదక్ (ఏడీఎన్ఎన్):**



మెదక్ జిల్లాలో జరిగిన ఓ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కాలికి జీపీఎస్ ట్రాకర్‌తో ఒక రాబందు సంచరించింది. మెదక్ జిల్లా అల్లదుర్గం మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామంలో రాబందును చూసి జనాలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి కారణం ఆ పక్షి కాలికి ట్రాకర్ ఉండటమే. ఇది చూసిన జనం ఏదో కీడు జరుగుతుందని కూడా చర్చించుకున్నారు. రాబందు కాలికి స్టిక్కర్లు, నంబర్లు, చిన్న పరికరాలు ఉండే సరికి అనుమానాలు ఎక్కువ అయ్యాయి. అయితే అటవీ శాఖ అధికారులు వచ్చి క్లారిటీ ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. నిజానికి రాబందులు కనిపించడం అరుదు కదా. దీంతో గ్రామస్థుల్లో భయం నెలకొంది. ఆకాశం నుంచి అకస్మాత్తుగా వచ్చిన ఈ పక్షిని చూసిన జనాలు ఆలోచనలో పడ్డారు. ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇక ఆ పక్షి కాళ్లకు స్టిక్కర్లు, నంబర్లు, చిన్న పరికరాలు ఉండటంతో ఆశ్చర్యంగా చూశారు. అయితే కొందరు యువకులు పరికరాలను చూసి ఏదైనా గూఢచారి పక్షి కావొచ్చు అని అనుమానం వ్యక్తం చేశారు. మరికొందరైతే గ్రామానికి ఏదైనా కీడు జరుగుతుందని కూడా మాట్లాడుకున్నారు. ఈ రాబందుకు సంబంధించిన విషయం సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు కూడా తెలిసింది. దీంతోవారు రంగంలోకి దిగారు. దీనిపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ క్లారిటీ ఇచ్చారు. దేశంలో అంతరించిపోతున్న రాబందుల జాతిని కాపాడేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంరక్షణ ప్రాజెక్టును అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే.. రాబందుల కదలికలు, నివాస ప్రాంతాలు, ఆహార లభ్యత లాంటి అంశాలను అధ్యయనం చేసేందుకు వాటి కాళ్లకు జీపీఎస్ ట్రాకర్లు, గుర్తింపు ట్యాగులు అమర్చుతున్నారన్నారు. ఈ రాబందులు దేశవ్యాప్తంగా ఎక్కడ తిరిగినా.. వాటి లొకేషన్‌ను వైల్డ్ లైఫ్ అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు గుర్తు పెట్టుకోండి. ఈ టెక్నాలజీ ద్వారా రాబందుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన శాస్త్రీయ సమాచారం సేకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. రాబందుల రక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ఈ పక్షులకు హాని కలిగించినా.., వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థులు ఎలాంటి భయం లేకుండా రాబందును పట్టించుకోకుండా భయపడకుండా వెళ్లాలని చెప్పారు.




### మంచిర్యాలలో కొడుకును చంపి,
# తండ్రి ఆత్మహత్య

**మంచిర్యాల (ఏడీఎన్ఎన్):**


మంచిర్యాల జిల్లాలోని జన్నారం మండలంలో దారుణం చోటు చేసుకుంది. రాంపూర్ గ్రామానికి చెందిన పలగాని భూమయ్య (40), కుమారుడు కార్తిక్ (10) నివాసం ఉంటున్నారు. కుమారుడు పుట్టుకతోనే దివ్యాంగుడు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కొడుకును పోషించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో దారుణానికి ఒడిగట్టాడు. ముందుగా కుమారుడి గొంతుకోసి చంపి అనంతరం తండ్రి కూడా గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు కోసం చేసిన అప్పులు తీర్చలేక, పనిదొరకక ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గ్రామస్థులు వివరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.




# కేవలం రూ.22 కోసం హత్య

**మెదక్ (ఏడీఎన్ఎన్):**

చేగుంట - కేవలం 22 రూపాయల పాత బాకీ విషయంలో గొడవపడి, తోటి కార్మికుడిని హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపారు. శనివారం సాయంత్రం విలేఖరుల సమావేశంలో ఆయన ఈ కేసు వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా అనంతసాగర్ శివారులోని సప్తగిరి కెమికల్ పరిశ్రమలో పనిచేసే ఉత్తరప్రదేశ్‌కు చెందిన సిరాజ్ (30), అదే రాష్ట్రానికి చెందిన మహేష్ కుమార్ ధర్మ ఒకే గదిలో ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 15న పండుగ రోజు మద్యం సేవించేందుకు ఇద్దరు స్నేహితులు బయటకు వెళ్లారు. గ్రామ శివారులో మద్యం తాగుతూ సిరాజ్ తనకు బాకీ ఉన్న రూ.22 విషయంలో మహేష్ కుమార్ గొడవ పెట్టుకున్నాడు. మాటా మాటా పెరగడంతో మహేష్, సిరాజ్ తలను చెట్టుకు బాది, అనంతరం రాయితో తలపై గాయపరిచాడు. దీంతో సిరాజ్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మహేష్ కుమార్ అక్కడి నుంచి పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మాసాయిపేట శివారులో నిందితుడు మహేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు దారితీసిన వివరాలు తెలిపాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పి తెలిపారు.




### హయత్‌నగర్ ఎస్‌బీఐలో
# అగ్నిప్రమాదం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

హైదరాబాద్‌లోని హయత్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంకులో అగ్నిప్రమాదం సంభవించింది. ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన సెక్యూరిటీ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



### యాదాద్రి కొత్త ఈవోగా
# భవానీ శంకర్

**యాదాద్రి భువనగిరి (ఏడీఎన్ఎన్):**

యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి (ఈవో) గా నాన్ క్యాడర్ ఐఏఎస్ అధికారి జె భవానీ శంకర్ నియమితులయ్యారు. శనివారం జరిగిన ఐఏఎస్‌ల బదిల్లో భాగంగా.. ప్రస్తుతం గవర్నర్ జాయింట్ సెక్రెటరీగా ఉన్న భవానీ శంకర్‌ను యాదాద్రి ఆలయ ఈవోగా బదిలీ చేశారు. అంతకుముందు యాదాద్రి ఈవోగా ఉన్న వెంకట్రావు ఈనెల 2న తన పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ ఒత్తిళ్లతోనే ఆయన రాజీనామా చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ నేతలైన స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వెంకట్రావుపై ఒత్తిడి పెంచి రాజీనామా చేసేందుకు పురికొల్పినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.



### అప్పుల బాధతో
# కౌలు రైతు ఆత్మహత్య

**రాజన్న సిరిసిల్ల (ఏడీఎన్ఎన్):**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం నెలకొంది. అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల మునిసిపాలిటీలోని రగుడుకు చెందిన రైతు బైకని ప్రభాకర్ యాదవ్ (38) తనకున్న రెండెకరాల పొలంతో పాటు మరో పదెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత వర్షాకలంలో వరి సాగు చేయగా.. అధిక వర్షాలతో కోతకొచ్చిన పంట నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పటికే సాగు కోసం రూ.15 లక్షల అప్పు చేశాడు. పంట నష్టపోవడంతో ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియక కొద్దిరోజులుగా సతమతమవుతున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం పొలానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని తన అన్న వెంకటేష్‌కు ఫోన్ చేసి చెప్పాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని ప్రభాకర్ ఫోన్ చేసి చెప్పడంతో కంగారు పడిపోయిన వెంకటేష్ హుటాహుటిన వెళ్లాడు. అప్పటికే ప్రభాకర్ అపస్మారక స్థితిలో కనిపించాడు. దీంతో వెంటనే ప్రభాకర్‌ను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ క్రమంలో అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



### తిరుమలకు నిర్మాత
# బండ్ల గణేష్ పాదయాత్ర..

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

సినీ నిర్మాత బండ్ల గణేష్ రేపటి నుంచి తిరుమలకు పాదయాత్ర నిర్వహించనున్నారు. వైసీపీ హయాంలో టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేసి జైలులో పెట్టిన విషయం తెలిసిందే. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నాడు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చంద్రబాబును 50 రోజుల పాటు జైలులో పెట్టారు. ఇటీవల స్కిల్ డెవలప్‌మెంట్‌కు చెందిన కేసును కోర్టు కొట్టివేసింది. చంద్రబాబు జైలు నుంచి క్షేమంగా బయటకు వస్తే తిరుమలకు కాలినడకన వస్తానని బండ్ల గణేష్ మొక్కుకున్నారు. తాను మొక్కుకున్న ప్రకారం సోమవారం ఉదయం 9 గంటలకు షాద్‌నగర్‌లోని నివాసం నుంచి సంకల్ప యాత్ర పేరిట పాదయాత్రను ప్రారంభించనున్నట్లు గణేష్ ప్రకటించారు. వైసీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో 2014లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం సీమెన్స్ కంపెనీతో ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. మొత్తం 3,356 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులో సీమెన్స్ వాటా 90 శాతం, మిగతా పది శాతం ప్రభుత్వ వాటాగా పేర్కొన్నారు. ఇందులో రూ.371 కోట్ల నిధులు దారి మళ్లాయన్న ఆరోపణలతో చంద్రబాబును అరెస్ట్ చేసి జైలులో పెట్టారు. ఇప్పుడు ఈ కేసులో ఆయన ప్రమేయం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని సీఐడీ స్పష్టం చేస్తూ ఏపీ సీఐడీ న్యాయస్థానానికి నివేదిక సమర్పించడంతో కోర్టు కేసును కొట్టివేసింది.



## హైదరాబాద్ - బెంగాల్ టైగర్స్‌పై ఘన విజయం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో హైదరాబాద్ తుఫాన్స్ దుమ్మురేపింది. శనివారం జరిగిన పోరులో హైదరాబాద్ 6 0 తేడాతో బెంగాల్ టైగర్స్ పై ఘన విజయం సాధించింది. ఆది నుంచీ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన హైదరాబాద్.. బెంగాల్‌ను చిత్తుగా ఓడించింది. హైదరాబాద్ తుఫాన్స్ తరపున జాచెరె వాలెస్ (2ని, 17ని, 30ని), టిమ్ బ్రాండ్ (12ని, 39ని, 46ని) హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగారు. మ్యాచ్ మొదలైన రెండో నిమిషంలోనే హైదరాబాద్ గోల్ ఖాతా తెరిచింది. వాలెస్ గోల్‌తో ఆధిక్యంలోకి వచ్చిన హైదరాబాద్ మ్యాచ్ ఆసాంతం అదే జోరు కొనసాగించింది.



## వరల్డ్ కప్ -2026 కు ఇటలీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ 20 ప్రపంచకప్ 2026కు ఇటలీ అర్హత సాధించింది. ఈ టోర్నీ కోసం 15 మంది సభ్యుల జట్టును ఆ దేశ క్రికెట్ టీమ్‌ను ప్రకటించింది. ఈ టీమ్‌కు గతంలో సౌతాఫ్రికా తరపున ఆడిన ఓ ప్లేయర్ ఎంపికయ్యాడు. ఫిబ్రవరిలో భారత్, శ్రీలంక సంయుక్తంగా టీ 20 ప్రపంచ కప్ 2026ను నిర్వహిస్తున్నాయి. ఈ టోర్నీకి ఇటలీ తొలిసారి అర్హత సాధించింది. అందులో భాగంగా 15 మంది సభ్యులతో కూడిన టీమ్‌ను ఇటలీ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఈ జట్టుకు సీనియర్ ప్లేయర్ వేన్ మ్యాడ్సన్ సారథ్యం వహించనున్నాడు. ఇంతవరకు బాగానే ఉన్నా.. జట్టు ఎంపికలో ఓ షాకింగ్ నిర్ణయం చోటుచేసుకుంది. సౌతాఫ్రికా జాతీయ జట్టుకు ఆడిన జెజె స్మట్స్ అనే 37 ఏళ్ల ఆల్‌రౌండర్.. ఇటలీ ప్రపంచ కప్ ఆడే జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2017-21 మధ్య కాలంలో దక్షిణాఫ్రికా జాతీయ జట్టులో స్మట్స్ సభ్యుడిగా ఉన్నాడు. ప్రొటీస్ తరపున 6 వన్డేలు, 13 టీ 20లు ఆడాడు. కుడి చేతి వాటం ఓపెనింగ్ బ్యాటర్, స్లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలర్ అయిన స్మట్స్.. ప్రస్తుతం జరుగుతున్న సౌతాఫ్రికా టీ 20 లీగ్‌లో డర్బన్ సూపర్ జెయింట్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇటలీ మహిళను స్మట్స్ పెళ్లి చేసుకోవడంతో ఆ దేశ పౌరసత్వం పొందాడు. ఇక.. ఈ టీమ్‌కు కెప్టెన్‌గా ఎంపికైన వేన్ మాడ్సెన్ కూడా గతంలో ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికాలో క్లబ్ క్రికెట్ ఆడాడు. అతడు 2023లో ఇటలీ తరపున 4 టీ 20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. అలానే 253 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు, 117 లిస్ట్ ఎ మ్యాచ్‌లు ఆడాడు. టీ 20 ప్రపంచ కప్‌లలో పాల్గొనే టీమ్‌లలో ఇటలీ గ్రూప్ సిలో ఉంది. ఆ జట్టుతో పాటు ఇంగ్లాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, నేపాల్ జట్లు కూడా ఇదే గ్రూప్‌లోనే ఉన్నాయి. ఇటలీ జట్టు ఫిబ్రవరి 9న బంగ్లాదేశ్ మ్యాచ్‌తో టీ 20 వరల్డ్ కప్ అరంగేట్రం చేయనుంది. కోల్‌కతా వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. అనంతరం ఫిబ్రవరి 12న ముంబైలో నేపాల్‌తో తలపడుతుంది. ఇటలీ జట్టు లిస్ట్, వేన్ మాడ్సెన్ (కెప్టెన్), మార్కస్ కాంపోపియానో, జియాన్ పియరో మీడే, జైన్ అలీ, అలీ హసన్, క్రిషన్ జార్జ్, హ్యారీ మానెంటి, ఆంథోనీ మోస్కా, జస్టిన్ మోస్కా, సయ్యద్ నఖ్వీ, బెంజమిన్ మానెంటి, జస్ప్రీత్ సింగ్, జెజె స్మట్స్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా మొదలైనవారు ఉన్నారు.




## కోకా-కోలా హెచ్‌సిసిబి నుంచి రూ.9 వేల కోట్ల ఐపీఓ


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచంలోనే అతిపెద్ద బెవరేజ్ కంపెనీ కోకా కోలా తన భారతీయ బాట్లింగ్ సంస్థ హిందుస్థాన్ కోకా కోలా బెవరేజెస్ (హెచ్‌సిసిబి) ను పబ్లిక్‌గా లిస్ట్ చేయాలని ప్లాన్ చేస్తోంది. ఈ ఐపిఓ ద్వారా సుమారు ఒక బిలియన్ డాలర్లు (సుమారు రూ.9,027 కోట్లు) సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కంపెనీ విలువ 10 బిలియన్ డాలర్లు (సుమారు రూ.90,000 కోట్లు) ఉండే లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ఐపిఓ 2026 వేసవిలో (సమ్మర్) లాంచ్ చేయాలని ప్రణాళిక. అయితే.. గతేడాదిలా వర్షాల వల్ల పీక్ సమ్మర్ డిమాండ్ తీవ్రంగా పడిపోతే, దీనిని 2027కి వాయిదా వేయవచ్చని సమాచారం. కోటక్ మహీంద్రా క్యాపిటల్, హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్, సిటీ బ్యాంక్ వంటి ప్రముఖ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంకర్లను ఈ ప్రక్రియకు నియమించారు. హెచ్‌సిసిబి భారతదేశంలో కోకా కోలా, థమ్సప్, స్ప్రైట్, మాజా, కిన్లీ, దసాని, జార్జియా కాఫీ, ష్వెప్స్ వంటి బ్రాండ్లను తయారు చేసి, పంపిణీ చేస్తుంది. దేశంలోని రూ.60,000 కోట్ల సాఫ్ట్ డ్రింక్స్ మార్కెట్‌లో అగ్రస్థానంలో ఉంది. హెచ్‌సిసిబి 15 ప్లాంట్లతో పనిచేస్తోంది. మిగిలిన ఆపరేషన్లు ఇతర ఇండిపెండెంట్ బాట్లర్ల ద్వారా జరుగుతాయి. గత సంవత్సరం కోకా కోలా తన గ్లోబల్ అసెట్ లైట్ వ్యూహంలో భాగంగా హెచ్‌సిసిబి పేరెంట్ ఎంటిటీలో 40 శాతం వాటాను జుబిలెంట్ గ్రూప్‌కు రూ.12,500 కోట్లకు అమ్మింది. ఈ ఐపిఓ కూడా అదే వ్యూహంలో భాగమేనని తెలుస్తోంది. బాట్లింగ్ ఆపరేషన్ల నుంచి దూరమై.. బ్రాండ్ బిల్డింగ్, ఇన్నోవేషన్, డిజిటలైజేషన్‌పై దృష్టి పెట్టడం దీని లక్ష్యంగా మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఫైనాన్షియల్ ఇయర్ 25లో హెచ్‌సిసిబి రెవెన్యూ రూ.12,751 కోట్లు (9 శాతం తగ్గుదల) నమోదైంది. ఇది ప్లాంట్లను ఫ్రాంచైజీ బాట్లర్లకు అమ్మడం వల్ల వచ్చిన ప్రభావమని చెబుతున్నారు. గత కొన్ని నెలలుగా అన్‌సీజనల్ రెయిన్స్ వల్ల కూడా సాఫ్ట్ డ్రింక్స్ సేల్స్ ప్రభావితమయ్యాయి. ఇక.. ఈ ఐపిఓ భారతదేశంలో ఎమ్ఎన్‌సి ల బిగ్ లిస్టింగ్‌ల ట్రెండ్‌లో భాగమవుతుంది. ఇంతకుముందు హుందాయ్ (3.3 బిలియన్ డాలర్లు), ఎల్‌జి (1.3 బిలియన్ డాలర్లు) తర్వాత మరో మెగా డీల్‌గా నిలవనుంది. ఈ ఐపీఓ విజయవంతమైతే.. భారత ఎఫ్ఎమ్‌సిజి మార్కెట్‌లో కోకా కోలా బలాన్ని మరింత పెంచుతుంది.. ఇన్వెస్టర్లకు ఆకర్షణీయ అవకాశంగా మారనుంది.

## విజయ్ హజారే ట్రోఫీ విదర్భ కైవసం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ 202526 సీజన్ విజేతగా విదర్భ జట్టు అవతరించింది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో సౌరాష్ట్రను 38 పరుగుల తేడాతో ఓడించి విదర్భ టైటిల్‌ను ముద్దాడింది. ఓపెనర్ అథర్వ తైడే సెంచరీతో చెలరేగగా, బౌలర్ యశ్ ఠాకూర్ నాలుగు వికెట్లతో ప్రత్యర్థి నడ్డి విరిచాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 317 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అథర్వ తైడే (128; 118 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) క్లాస్ ఇన్నింగ్స్ తో సౌరాష్ట్ర బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతనికి తోడుగా యశ్ రాథోడ్ (54) అర్ధ శతకంతో రాణించగా, అమన్ మొఖడే (33), రవికుమార్ (25) కీలక పరుగులు జోడించారు. సౌరాష్ట్ర బౌలర్లలో అంకుర్ పన్వార్ 4 వికెట్లతో ఆకట్టుకున్నాడు. 318 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సౌరాష్ట్ర జట్టు 279 పరుగులకు ఆలౌటైంది. ప్రేరక్ మన్కడ్ (88), చిరాగ్ జైన్ (64) వీరోచితంగా పోరాడినప్పటికీ, మిగిలిన బ్యాటర్ల నుంచి ఆశించిన సహకారం అందలేదు. సమ్మర్ గజ్జర్ (25), రుచిత్ అహిర్ (21) ఫర్వాలేదనిపించినా, విదర్భ బౌలర్ల ధాటికి సౌరాష్ట్ర తలవంచక తప్పలేదు. విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్ 4 వికెట్లతో సౌరాష్ట్రను కోలుకోలేని దెబ్బ తీశాడు. నచికేత్ భూతే 3 వికెట్లు పడగొట్టగా, దర్శన్ నల్కండే 2 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. సమష్టి కృషితో విదర్భ మరోసారి దేశవాళీ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.




## వైభవ్ సూర్యవంశీ స్టన్నింగ్ క్యాచ్..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారత యువ క్రికెటర్ సంచలనం వైభవ్ సూర్యవంశీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనదైన బ్యాటింగ్‌తో బౌలర్లకు వణుకు పుట్టిస్తున్నాడు. ప్రత్యర్థి జట్టు అతడిని ఔట్ చేస్తే.. సగం మ్యాచ్ గెలిచినట్లుగా ఫీల్ అవుతోందంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికే అనేక అద్భుతాలు సృష్టించిన వైభవ్.. తాజాగా అండర్ 19 ప్రపంచ కప్‌లో స్టన్నింగ్ క్యాచ్ అందుకుని క్రికెట్ ప్రపంచాన్ని షాక్‌కు గురి చేశాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్.. బౌండరీ లైన్ వద్ద పట్టిన క్యాచ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అండర్ 19 ప్రపంచ కప్‌లో భాగంగా శనివారం.. భారత్, బంగ్లాదేశ్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టీమిండియా 18 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) బంగ్లాదేశ్‌పై గెలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు



దిగిన భారత జట్టు 48.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. వర్షం కారణంగా బంగ్లా లక్ష్యాన్ని 29 ఓవర్లలో 165గా నిర్ణయించారు. ఛేదనలో బంగ్లా 28.3 ఓవర్లలో 146 పరుగులకే పరిమితమైంది. ఇక.. బంగ్లా బ్యాటింగ్ సందర్భంగా.. యువ సంచలనం వైభవ్ కళ్లు చెదిరే క్యాచ్ పట్టాడు. 25.2 ఓవర్‌లో విహాన్ మల్హోత్రా వేసిన బంతిని బంగ్లా బ్యాటర్ బాసిర్ రతుల్ భారీ షాట్ ఆడాడు. బంతి గాల్లో ఎగురుతూ సిక్సర్ వెళ్లేలా కనిపించింది. సరిగ్గా బౌండరీ లైన్ వద్ద ఉన్న వైభవ్ ఏమాత్రం తడబడకుండా అమాంతం గాల్లోకి ఎగిరి బంతిని క్యాచ్ పట్టాడు. ఇంతలో.. తన బ్యాలెన్స్ కోల్పోయి బౌండరీ దాటే అవకాశమున్నట్లు గ్రహించిన వైభవ్.. వెంటనే తెలివిగా బంతిని లోపలికి విసిరి, సెకన్ల వ్యవధిలో తిరిగి మైదానంలోకి వచ్చి ఆ క్యాచ్‌ను పూర్తి చేశాడు. అతడు అందుకున్న క్యాచ్ చూసి మైదానంలోని ఉన్న వారంతా షాక్‌కు గురయ్యారు. ప్రస్తుతం ఈ క్యాచ్ సంబంధిత దృశ్యం.. నెట్టింట తెగ వైరల్ అవుతోంది. వైభవ్ సూర్యవంశీలో టీమిండియా భవిష్యత్తు సూపర్ స్టార్ కనిపిస్తున్నాడంటూ నెటిజన్లు స్పందిస్తున్నారు. బ్యాటింగ్‌లోనే కాకుండా ఫీల్డింగ్‌లోనూ కూడా వైభవ్ చిచ్చర పిడుగే అంటూ మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు.

## ట్రోల్స్ కు భయపడను.. తలరాత మార్చుకున్నా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టీమిండియా యువ సంచలనం హర్షిత్ రాణా పేరు ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో విపరీతంగా వినిపిస్తోంది. ఒకవైపు విమర్శలు, మరోవైపు అద్భుత ప్రదర్శనలతో నిత్యం వార్తల్లో నిలిచే ఈ ఢిల్లీ ఆల్‌రౌండర్, తాజాగా తన కెరీర్ ప్రారంభంలో పడిన కష్టాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. ముఖ్యంగా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ అండతోనే జట్టులో చోటు సంపాదిస్తున్నారనే విమర్శలకు తన ఆటతోనే సమాధానం ఇస్తున్నారు. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో హర్షిత్ మాట్లాడుతూ.. "నేను ఈ స్థాయికి అంత సులభంగా రాలేదు. దాదాపు పదేళ్ల పాటు సెలక్షన్లలో నాకు నిరాశే ఎదురైంది. ఎన్నో ట్రయల్స్ కు వెళ్లేవాడిని, కానీ ఫైనల్ లిస్ట్‌లో నా పేరు



కనిపించేది కాదు. ఇంటికి వచ్చి మా నాన్న ముందు ప్రతిరోజూ ఏడ్చేవాడిని. ఆ వైఫల్యాలే ఇప్పుడు నన్ను రాటుదేలేలా చేశాయి. ఒకానొక దశలో క్రికెట్‌ను వదిలేయాలని కూడా అనుకున్నా, కానీ మా నాన్న ఇచ్చిన ప్రోత్సాహమే నన్ను మళ్ళీ నిలబెట్టింది," అని తెలిపారు. టీ20ల్లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, వన్డే ఫార్మాట్‌లో మాత్రం హర్షిత్ తిరుగులేని ప్రదర్శన చేస్తున్నాడు. ఇప్పటివరకు 13 వన్డేలు ఆడిన ఈ యువ బౌలర్, ఏకంగా 23 వికెట్లు పడగొట్టి తన సత్తా చాటాడు. తాజాగా న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ బ్యాటుతోనూ, బంతితోనూ మెరిసి విమర్శకుల నోళ్లు మూయించాడు. విమర్శలు ఎన్ని ఉన్నా, ప్రస్తుతానికి పరిమిత ఓవర్ల క్రికెట్ లో హర్షిత్ రాణా టీమిండియా కీలక సభ్యుడిగా మారిపోయాడు. రాబోయే టీ20 వరల్డ్ కప్ 2026 భారత జట్టులో కూడా అతడు చోటు దక్కించుకోవడం విశేషం. పదేళ్ల నిరీక్షణ తర్వాత వచ్చిన ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదనే పట్టుదలతో ఈ యంగ్ స్టార్ ఉన్నాడు.

## సబలెంక స్పీడ్.. జ్వెరెవ్ స్మార్ట్ విన్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టెన్నిస్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆస్ట్రేలియన్ ఓపెన్ 2026 సమరం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్ తన కెరీర్ గ్రాండ్ స్లామ్ లక్ష్యంగా ఈ టోర్నీలో ఘన విజయాన్ని అందుకున్నాడు. అటు మహిళల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్ సబలెంక తన జోరును కొనసాగించగా, టెన్నిస్ దిగ్గజం వీనస్ విలియమ్స్ ఒక అరుదైన రికార్డును నెలకొల్పి నిష్క్రమించింది. వరల్డ్ నం.1 కార్లోస్ అల్కరాజ్ ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో ఆస్ట్రేలియా ప్లేయర్ ఆడమ్ వాల్టన్‌ను 63, 76(72), 62 తేడాతో ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ పోరులో అల్కరాజ్ తన ట్రేడ్‌మార్క్ షాట్లతో హోరెత్తించాడు. రెండో



సెట్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ, టైబ్రేకర్‌లో అల్కరాజ్ పైచేయి సాధించాడు. 8 ఏస్‌లు, 38 విన్నర్లతో తన పవర్‌ను ప్రదర్శించిన అల్కరాజ్, ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం కనబరిచాడు. ప్రపంచ మూడో నంబర్ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ కూడా రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టాడు. కెనడా ఆటగాడు గాబ్రియేల్ డియల్లోతో జరిగిన మ్యాచ్‌లో జ్వెరెవ్ 67, 61, 64, 62 తేడాతో విజయం సాధించాడు. తొలి సెట్ కోల్పోయి షాక్‌కు గురైనప్పటికీ, ఆ తర్వాత పుంజుకుని వరుసగా మూడు సెట్లు గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మహిళల విభాగంలో వరల్డ్ నం.1 అరీనా సబలెంక తన టైటిల్ రక్షణను అద్భుతంగా మొదలుపెట్టింది. ఫ్రాన్స్ కు చెందిన రకోటోమంగాను 64, 61 తేడాతో కేవలం గంటా 16 నిమిషాల్లోనే చిత్తు చేసింది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఒక చారిత్రక ఘట్టం నమోదైంది. 45 ఏళ్ల వయసులో వైల్డ్ కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగిన వీనస్ విలియమ్స్, ఆస్ట్రేలియన్ ఓపెన్ సింగిల్స్ ఆడుతున్న అత్యంత వృద్ధురాలు గా రికార్డు సృష్టించింది. అయితే, సెర్బియాకు చెందిన ఓల్గా దానిలోవిచ్‌తో జరిగిన పోరులో ఆమె 67, 63, 64 తేడాతో ఓటమి పాలైంది. తొలి సెట్ గెలిచి ఆశలు కల్పించినా, మిగిలిన రెండు సెట్లలో దానిలోవిచ్ దూకుడు ముందు వీనస్ నిలబడలేకపోయింది. ఓడిపోయినప్పటికీ, స్టేడియం మొత్తం వీనస్ నిబద్ధతకు నిలబడి చప్పట్లతో వీడ్కోలు పలికింది.

## మారుతి సుజుకి 'మెగా ప్లాంట్'

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ గుజరాత్‌లో మరో భారీ ఉత్పాదక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. అహ్మదాబాద్ జిల్లాలోని ఖోరాజ్ వద్ద ఈ కొత్త మెగా ప్లాంట్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.35,000 కోట్ల భారీ పెట్టుబడిని కంపెనీ ప్రకటించింది. ఈ మేరకు మారుతి సుజుకి మేనేజింగ్ డైరెక్టర్ హిసాషి టకేయుచి, గాంధీనగర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు అధికారిక పెట్టుబడి లేఖను అందజేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా గుజరాత్ పారిశ్రామిక రంగంలో కొత్త అధ్యాయం మొదలుకానుంది. గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేటాయించిన సుమారు 1,750 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ ప్లాంట్ నిర్మితం కానుంది. ఇందులో ఏటా 10 లక్షల వాహనాలను తయారు చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఉత్పత్తి ప్రక్రియను నాలుగు దశల్లో చేపట్టనున్నారు, ప్రతి విభాగం ఏటా 2.5 లక్షల వాహనాల సామర్థ్యంతో పనిచేస్తుంది. దీనివల్ల సుమారు 12,000 మందికి పైగా నేరుగా ఉపాధి లభించడమే కాకుండా, అనుబంధ పరిశ్రమలు, MSMEల ద్వారా మరో 7.5 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ 'మేక్ ఇన్ ఇండియా' దార్శనికతకు అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటోందని ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడి గుజరాత్‌ను అంతర్జాతీయ ఆటోమొబైల్ హబ్‌గా మరింత బలోపేతం చేయడమే కాకుండా, భారత్‌జపాన్ దేశాల మధ్య పారిశ్రామిక బంధాన్ని మరో స్థాయికి తీసుకెళ్తుందని ఆయన కొనియాడారు. ఖోరాజ్ ప్లాంట్‌లో ఉత్పత్తిని ఆర్థిక సంవత్సరం 2028-29 నాటికి ప్రారంభించాలని మారుతి సుజుకి యోచిస్తోంది.



## విమానాల పండుగ ఈ నెల 28 నుంచి 31 వరకు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

మళ్లీ హైదరాబాద్‌లో విమానాల పండుగ రాబోతోంది. ఈ నెల 28 నుంచి 31 వరకు అంటే నాలుగు రోజుల పాటు 'వింగ్స్ ఇండియా 2026' పేరుతో బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ లో నిర్వహించనున్నారు. 'దేశీయ విమానయానం: భవిష్యత్తుకు బాటలు వేయడం.. రూపకల్పన నుంచి అమలు వరకు, తయారీ నుంచి నిర్వహణ వరకు, సమ్మిళితత్వం నుంచి ఆవిష్కరణ వరకు, భద్రత నుంచి సుస్థిరత వరకు' అనే నినాదంతో జరిగే ఈ ఏవియేషన్ షోను పౌర విమానయాన మంత్రిత్వశాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసీసీఐ) సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ సదస్సును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు



ప్రారంభించనున్నారు. ఈ సదస్సుకు విమానయాన రంగానికి చెందిన దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, విమాన తయారీ సంస్థలు హాజరుకానున్నాయి. దేశీయ విమానయాన రంగం రాకెట్ వేగంతో దూసుకుపోతోందని, భవిష్యత్తులో విమానాల తయారీ హబ్‌గా భారత్ మారుతున్నదని, అలాగే తయారీ, సేవలు, ఆవిష్కరణలు, సుస్థిర విమానయాన పరిష్కారాల కోసం కీలక కేంద్రంగా ఎదగడమే లక్ష్యంగా ఈసారి ఏవియేషన్ షో ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. ఈ ఎగ్జిబిషన్‌లో పలు విమానయాన సంస్థలు తమ విమానాలను డిస్‌ప్లే చేయడంతో పాటు ఫ్లైయింగ్, ఏరోబెటిక్ షోస్ కూడా జరగనున్నది. అలాగే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లు, సీఈవోల రౌండ్‌టేబుల్ సమావేశాలు, బీ2బీ, బీ2జీ మీటింగ్‌లు, ఏవియేషన్ జాబ్ ఫెయిర్, అవార్డు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించబోతున్నారు. 20 దేశాలకు చెందిన డెలిగేట్స్, ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా పాల్గొంటున్నారు. వింగ్స్ ఇండియా 2026 కార్యక్రమ ఏర్పాట్లకు తెలంగాణ ప్రభుత్వం రూ.85 లక్షల నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విమానయాన రంగాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించి ఆసియాలోనే అతిపెద్దదిగా చెప్పబడే ఈ కార్యక్రమంలో ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు పాల్గొనే అవకాశముంది. ఈ సందర్భంగా వ్యూహాత్మక భాగస్వామ్యాలు, పెట్టుబడుల ఆకర్షణతో పాటు ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న మెరుగైన విధానాలను తెలుసుకునే వీలు కలుగుతుంది.



## రికార్డు సృష్టించిన స్మృతి మంధాన

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మహిళల ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా శనివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచులో ఆర్సీబీ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. స్మృతి మంధాన (96) కెప్టెన్ నాక్ ఆడింది. 61 బంతులు ఎదుర్కొని 96 పరుగులు చేసిన స్మృతి.. తృటిలో సెంచరీ మిస్ చేసుకుంది. అయినప్పటికీ మంధాన ఓ అరుదైన ఘనత సాధించింది. అద్భుత ఇన్నింగ్స్ ఆడి ఎలైట్ జాబితాలో చోటు దక్కించుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 166 పరుగులకు ఆలౌటైంది. 167 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీ 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ నేపథ్యంలో స్మృతి తన నాక్‌తో డబ్ల్యూపీఎల్ చరిత్రలోనే రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన బ్యాటర్ల జాబితాలో చేరింది. అయితే డబ్ల్యూపీఎల్‌లో ఓ భారత బ్యాటర్ అత్యధిక వ్యక్తిగత స్కోరు కూడా ఇదే కావడం విశేషం. ఈ టోర్నీలో ఆర్సీబీ జట్టు అద్భుత ప్రదర్శనలు చేస్తూ తిరుగులేని జట్టుగా నిలిచింది. ఆడిన నాలుగింట్లో అన్నీ మ్యాచులు గెలిచి స్కోరు బోర్డులో అగ్రస్థానంలో ఉంది. ఢిల్లీపై చేసిన ప్రదర్శనకు ఆమెకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



## గ్రాండ్ సమరానికి సిద్ధం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మెల్‌బోర్న్ సీజన్ తొలి గ్రాండ్ స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు రంగం సిద్ధమైంది. నేటి నుంచి జరిగే ఈ టెన్నిస్ టోర్నీ కోసం సూపర్ స్టార్లు అల్‌కరాజ్, సినెర్ లతో పాటు 25వ గ్రాండ్ స్లామ్‌పై కన్నేసిన టెన్నిస్ దిగ్గజం జొకోవిచ్ బరిలోకి దిగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో రెండుసార్లు తుది మెట్టుపై టైటిల్ చేజార్చుకున్న స్వియాటెక్ ఫేవరెట్‌గా సమరానికి సై అంటోంది. స్పానిష్ సంచలనం కార్లొస్ అల్‌కరాజ్ ఆస్ట్రేలియా గడ్డపై బోణీ కోసం సిద్ధమవుతుంటే సెర్బియన్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ తనకు అచ్చొచ్చిన ఓపెన్ లోనే 25వ గ్రాండ్ స్లామ్ సాకారం చేసుకోవాలని చూస్తున్నాడు. వీరిద్ధరిని దాటేసి వరుసగా మూడో ఏడాది కూడా టైటిల్ గెలిచి హ్యాట్రిక్ సాధించాలని ఇటలీ స్టార్, వరల్డ్ నంబర్ వన్ యానిక్ సినెర్ పట్టుదలతో ఉన్నాడు. ఈ నేపథ్యంలో నేడు మొదలయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో ఎలాంటి ఫలితాలు వస్తాయనేది ఆసక్తికరం. హ్యాట్రిక్ వేటలో సినెర్.. తొలి రౌండ్లో గ్యాస్టన్ (ఫ్రాన్స్)ను ఎదుర్కొంటాడు. 22 ఏళ్ల స్పెయిన్ స్టార్ అల్‌కరాజ్ ఇక్కడ తప్ప మిగతా మూడు గ్రాండ్ స్లామ్‌లు ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యుఎస్ ఓపెన్‌లను రెండేసిసార్లు చేజిక్కించుకున్నాడు. ఆరు గ్రాండ్ స్లామ్‌లను సాధించినప్పటికీ ఈ స్పెయిన్ టాప్ సీడ్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఇంకా వెలితిగానే ఉంది. గత రెండేళ్లుగా (2024, 2025) క్వార్టర్ ఫైనల్ అంచును దాటని అతను ఈసారైనా ట్రోఫీని అందుకోవాలని ఆశిస్తున్నాడు. కెరీర్ చరమాంకంలో ఉన్న జొకోవిచ్ చిరస్మరణీయమైన 25వ టైటిల్ కోసం రాకెట్‌కు పదును పెడుతున్నాడు. ఇక్కడ పది టైటిల్స్ సాధించిన జొకో 11వ టైటిల్ సాధిస్తే తన కెరీర్‌కు గ్రాండ్‌గా వీడ్కోలు పలికే అవకాశముంది. మూడేళ్ల క్రితం 2023 లో చివరిసారిగా ఆస్ట్రేలియా ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. అదే ఏడాది ఫ్రెంచ్, యుఎస్ ఓపెన్ లను గెలిచిన ఈ సెర్బియన్ ఆల్ టైమ్ గ్రేట్.. రెండేళ్లుగా 25వ గ్రాండ్ స్లామ్ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నాడు. ఈ హేమాహేమీలతో పాటు రెండుసార్లు (2020, 2024) రన్నరప్ తోనే సరిపెట్టుకున్న జర్మనీ ప్లేయర్, మూడో సీడ్ జ్వెరెన్, ఐదో సీడ్‌లో రెంజో మ్యూసెటి (ఇటలీ), రష్యన్ స్టార్లు రుబ్లెవ్, 2014 చాంపియన్, స్విట్జర్లాండ్ వెటరన్ స్టార్ వావ్రింకా సైతం ఆసీస్ బరిలోకి దిగుతున్నారు. వావ్రింకాకు వీనస్ విలియమ్స్‌కు ఇచ్చినట్లే నిర్వాహకులు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చారు. స్వియాటెక్ ఈసారైనా - పోలండ్ స్టార్ ఇకా స్వియాటెక్‌ను ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆఖరి దాకా ఊరించి చివరకు నిరాశపరుస్తోంది. 2022 తో పాటు గతేడాది కూడా రన్నరప్‌తోనే సరిపెట్టుకున్న స్వియాటెక్ ఈసారి ఎలాగైనా సాధించాలనే పట్టుదలతో ఉంది. అమెరికన్ టెన్నిస్ స్టార్ మాడిసన్ కీస్ డిఫెండింగ్ చాంపియన్ హోదాతో టైటిల్ వేటకు సిద్ధమవగా, జెస్సికా పెగూలా (అమెరికా), ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్), 2021 రన్నరప్ కరొలినా మ్యుచోవా (చెక్ రిపబ్లిక్), 2024 రన్నరప్ కోకో గాఫ్ (అమెరికా), రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ (2023, 2024) సాధించిన బెలారస్ స్టార్, టాప్ సీడ్ సబలెంక టోర్నీ ఫేవరెట్లుగా ఉన్నారు.



## పల్సర్ బైక్ ధర పెంపు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

బజాజ్ పల్సర్ కొనుగోలుదారులకు షాకిచ్చింది సంస్థ. పల్సర్ బైకుల ధరలను రూ.461 నుంచి రూ.1,460 వరకు పెంచింది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్లనే ఎంపిక చేసిన పల్సర్ బైకుల ధరలను సవరించినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. కంపెనీ మొత్తం విక్రయాల్లో 60 శాతం వాటా కలిగిన పల్సర్ అమ్మకాలపై ఎలాంటి ప్రభావం చూపదని, సంస్థపై అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను స్వల్పంగా పెంచినట్టు తెలిపారు. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో బజాజ్ పల్సర్ 125 సీసీ బైకు ఎంట్రీ లెవల్ మోడల్ రూ.778 నుంచి రూ.1,020 వరకు సవరించింది. అలాగే నియాన్ సింగిల్ సీటు రకంను రూ.891 పెంచింది.



## కృతిశెట్టి ఆశలపై
# నీళ్లు!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

తమిళంలో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలనుకున్న 'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టికి వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. కార్తితో నటించిన 'వా వాతియార్ సినిమా పదే పదే వాయిదా పడటంతో ఆమె తీవ్ర నిరాశకు గురయింది. ప్రదీప్ రంగనాథన్‌తో తెరకెక్కుతున్న ఎల్.ఐ.కె కూడా పోస్ట్ పోన్ కావడంతో తన బ్యాడ్ లక్ కొనసాగుతోందని ఫీల్ అవుతుంది. అయితే, ఇలాంటి సమయంలో మరో హీరోయిన్ వచ్చి తనకు రావాల్సిన అవకాశాన్ని దక్కించుకున్నట్లు తెలుస్తోంది. కృతి శెట్టి ముంబైలో కనిపించడంతో బాలీవుడ్ ఆఫర్ వచ్చిందనే ప్రచారం జరిగింది. నిజంగానే హిందీ సినిమాలో అవకాశం కోసం ఆమె ఆడిషన్స్ కు హాజరైనట్లు సమాచారం. దీంతో ఈసారి బాలీవుడ్‌లో అదృష్టం కలిసి వస్తుందని అందరూ భావించారు. కానీ, చివరకు ఆ ప్రాజెక్ట్ లోకి కృతి శెట్టికి బదులుగా కీర్తి సురేష్ ఎంటర్ అయినట్లు తెలుస్తోంది. 'బేబి జాన్' సినిమాతో హిందీలో అడుగుపెట్టినప్పటికీ ఆ సినిమా ఫ్లాప్ అయినా, ఇప్పుడు మరో బాలీవుడ్ అవకాశం దక్కించుకోవడం కీర్తి సురేష్‌కు లక్కీగా మారింది. తెలుగు, హిందీ రెండింట్లోనూ అవకాశాలు అందుకుంటూ కీర్తి సురేష్ దూసుకుపోతుండగా, కృతి శెట్టికి మాత్రం ఎదురు చూపులు తప్పడం లేదు.



# మెగాస్టార్ కెరీర్ లోనే సరికొత్త రికార్డ్ !

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మెగాస్టార్ చిరంజీవి మరోసారి బాక్సాఫీస్ దగ్గర భారీ విజయం సాధించారు. 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా అన్ని ప్రాంతాలలోనూ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ చిత్రం కేవలం 6 రోజుల్లోనే అన్ని ఏరియాలలో బ్రేక్ ఈవెన్ సాధించింది. 6వ రోజు ముగిసే నాటికి, ప్రపంచవ్యాప్తంగా రూ. 261 కోట్లకు పైగా వసూలు చేసింది, ఇప్పుడు రూ. 300 కోట్ల మార్కు చేరువలో ఉంది. ముఖ్యంగా "మన శంకర వరప్రసాద్ గారు" చిత్రం యూఎస్ఏ లో కూడా అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, 3 మిలియన్ల మైలురాయికి చేరువవుతోంది. గతంలో చిరంజీవి అత్యుత్తమ ఓవర్సీస్ చిత్రంగా నిలిచిన 'సైరా నరసింహారెడ్డి' (2.7 మిలియన్లు) రికార్డ్ ను 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా అధిగమించింది. మొత్తానికి అనిల్ రావిపూడి ఫుల్ వినోదాత్మక చిత్రాన్ని అందించారు, ఇందులో చిరంజీవి ట్రేడ్‌మార్క్ కామెడీ టైమింగ్‌తో పాటు భావోద్వేగ సన్నివేశాలు, పాటలు మరియు మాస్ సన్నివేశాలు కూడా బాగున్నాయి. ఈ పూర్తి స్థాయి ఎంటర్టైనర్ లో నయనతార కథానాయికగా నటించింది. ఇక సాహు గారపాటి, సుస్మిత (చిరంజీవి కుమార్తె) సంయుక్తంగా ఈ సినిమాని నిర్మించారు.

## 23న విజయ్, సమంతల
# 'పోలీస్' రీ-రిలీజ్



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

స్టార్ హీరో విజయ్, టాప్ హీరోయిన్ సమంత జంటగా, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో వి క్రియేషన్స్ పతాకంపై కలైపులి థాను నిర్మించిన తమిళ చిత్రం 'తెరి' ఘన విజయం సాధించింది. తెలుగులో 'పోలీస్' పేరుతో అనువాదమై ప్రేక్షకుల హృదయాలను దోచుకుని సూపర్ హిట్ చిత్రంలా నిలిచింది. ఈ చిత్రం మరోసారి వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమైంది. ఈ 'పోలీస్ 'చిత్రం ఈ నెల 23న రీరిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని నైజాం ప్రాంతంలో ప్రముఖ పంపిణీ సంస్థ ఏషియన్ ఫిలిమ్స్ వారు, ఆంధ్రా లో సురేష్ మూవీస్ వారు భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రీ-రిలీజ్ వార్తతో సోషల్ మీడియాలో భారీ స్పందన వస్తుండగా, విజయ్ అభిమానులతో పాటు సినిమా ప్రేమికులు మరోసారి ఈ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను థియేటర్లలో చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తండ్రి-కూతురు అనుబంధం, పోలీస్ బ్యాక్‌డ్రాప్, భావోద్వేగాలు, యాక్షన్, కమర్షియల్ ఎలిమెంట్స్ ను సమపాళ్లలో మేళవించి అట్లీ ఈ 'పోలీస్' చిత్రాన్ని రూపొందించారు. విజయ్ ద్విపాత్రాభినయంలో మెప్పించగా, సమంత పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే మరో హీరోయిన్ గా అమీ జాక్సన్ నటించారు. ప్రభు, రాధిక శరత్ కుమార్ పాత్రలు కూడా ఈ చిత్రానికి కీలకం. ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాలు, భావోద్వేగ క్షణాలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. ఈ చిత్రానికి సంగీతం అందించిన జీవీ ప్రకాష్‌కుమార్ పాటలు అప్పట్లో చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి. నేపథ్య సంగీతం, సినిమాటోగ్రఫీ, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ 'పోలీస్' విజయ్‌కు తెలుగులో కూడా బలమైన అభిమాన వర్గాన్ని మరింత పెంచింది. ఇప్పుడు ఆధునిక సాంకేతికతతో మెరుగైన క్వాలిటీతో రీ-రిలీజ్ అవుతున్న ఈ చిత్రం మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్, సమంతల అభిమానులకు ఇది నిజంగా ఒక తీపి వార్త.

## నా ఫేవరేట్ హీరో
# విజయ్ దేవరకొండ



'దురంధర్' ఫేమ్ సారా అర్జున్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

'ధురంధర్' సినిమాలో హీరోయిన్ గా నటించి నేషనల్ ఫేమ్ సంపాదించుకుంది సారా అర్జున్. ఈ యంగ్ హీరోయిన్ తన ఫేవరేట్ హీరో విజయ్ దేవరకొండ అని చెప్పింది. సారా అర్జున్ ప్రస్తుతం తెలుగులో యుఫోరియా అనే మూవీలో నటిస్తోంది. దర్శకుడు గుణశేఖర్ రూపొందిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 6న రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ జరగగా..ఆ ఈవెంట్ లో పాల్గొన్న హీరోయిన్ సారా అర్జున్ తన ఫేవరేట్ హీరో విజయ్ దేవరకొండ అని చెప్పింది. రౌడీ ఫ్యాన్స్ లో ఈ క్రేజీ హీరోయిన్ కూడా చేరినట్లయిం



## వరుణ్ తేజ్ చిత్రం
# టైటిల్ గ్లింప్స్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ వీటీ 15, టాలెంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్‌లో, యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్ తో గ్రాండ్‌గా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబధించి మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ ఈ నెల 19న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ గా ఉండబోతోంది. హారర్-కామెడీ, ఇండియన్ కొరియన్ బ్యాక్డ్రాప్, యూనిక్ కాన్సెప్ట్ తో తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్. సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు.



## భర్త మహాశయులకు విజ్ఞప్తి
# బ్లాక్ బస్టర్ విజయోత్సవం

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మాస్ మహారాజా రవితేజ సంక్రాంతి బ్లాక్ బస్టర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ లో డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించారు. జనవరి 13న గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమా సంక్రాంతి బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సంక్రాంతి బ్లాక్ బస్టర్ విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ... చాలా హ్యాపీగా ఉంది. ఆర్ట్ డైరెక్టర్ ప్రకాష్, డిఓపి ప్రసాద్ తో ఎన్నో ఏళ్ళుగా వర్క్ చేస్తున్నాను. వాళ్ళతో కలిసి మరోసారి పనిచేయడం ఎంత ఆనందాన్నిచ్చింది. ప్రసాద్ సినిమాని చాలా కలర్ ఫుల్ గా తీశారు. మురళీధర్ గౌడ్ గారు అద్భుతంగా చేశారు. తన జోక్స్ కి థియేటర్స్ లో చాలా ఎంజాయ్ చేస్తున్నారు. అలాగే కిషోర్ సత్య గెటప్ శీను వాళ్ళ అందరితో చాలా బాగా ఎంజాయ్ చేశాను. సునీల్ తో నాకు చాలా మంచి ఫ్రెండ్షిప్ ఉంది. మేము ఫ్యామిలీ ఫ్రెండ్స్. దుబాయ్ శీను తర్వాత మళ్లీ అంతలా ఎంజాయ్ చేశాను. ప్రతి సీను విపరీతంగా ఎంజాయ్ చేశా. తనతో మళ్ళీ మళ్ళీ ఇలాంటి సినిమాలు చేయాలని ఉంది. నిర్మాత సుధాకర్ కంగ్రాజులేషన్స్. సినిమా చాలా అద్భుతంగా ఉంది. సంక్రాంతికి ఫుల్ ఎంటర్టైన్మెంట్. అన్ని సినిమాలతో పాటు మా సినిమా కూడా చాలా బాగుంది. ఈ సినిమాని హిట్ చేసిన ప్రేక్షక మహాశయులకు కృతజ్ఞతలు. సినిమాకి ఇంకా చాలా మంచి రన్ ఉంటుంది. డింపుల్ క్యారెక్టర్ అద్భుతంగా చేసింది. తన పాత్రకి చాలా మంచి పేరు వచ్చింది. తనకి చాలా మంచి ఫ్యూచర్ ఉండాలని కోరుకుంటున్నాను. అలాగే ఆషిక కూడా అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. అందరు కూడా కామెడీ చాలా ఆర్గానిక్ గా ఉందని చెప్తున్నారు. డైరెక్టర్ కిషోర్ కి ఆర్గానిక్ కామెడీ టైమింగ్ ఉంది. బాలు మహేంద్ర గారు, జంధ్యాల గారు, క్రేజీ మోహన్ లాంటి ఫ్లేవర్ ఉన్న రైటింగ్ తనది. తన రైటింగ్ నాకు మొదటి నుంచి చాలా ఇష్టం. ఎమోషన్ ఎంటర్టైన్మెంట్ అద్భుతంగా రాస్తాడు. ఇలాంటి సినిమా చేయాలని నాకు ఎప్పటినుంచో కోరిక. కిషోర్ సినిమాని తను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇలాంటి సినిమాలు మళ్లీ చేయాలని కోరుకుంటున్నాను. భీమ్స్ వండర్ఫుల్ మ్యూజిక్ ఇచ్చాడు. ఈ సినిమా మెయిన్ క్రెడిట్ కిషోర్ భీమ్స్ కి ఇస్తాను. అందరికీ థాంక్యూ సో మచ్ అన్నారు. ఈ వేడుకలో డైరెక్టర్ కిషోర్ తిరుమల, నిర్మాత సుధాకర్ చెరుకూరి, హీరోయిన్ డింపుల్, సునీల్ తో పాటు మూవీ యూనిట్ అందరూ పాల్గొన్నారు.



మార్చి 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్

## త్వరలోనే 'పెద్ది'
# బిగ్ షెడ్యూల్ ప్రారంభం

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. బుచ్చి బాబు సనా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఈ చిత్రం బిగ్ షెడ్యూల్ ప్రారంభం కాబోతోంది. ఈ షెడ్యూల్ కోసం రామ్ చరణ్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నారు. తాజాగా విడుదలైన స్టిల్ లో రామ్ చరణ్ బీస్ట్ మోడ్ లో కనిపించడం అదిరిపోయింది. రాక్ సాలిడ్ మసిల్స్, ఇంటెన్స్ గా కనిపించిన లుక్ క్షణాల్లో వైరల్ అయ్యింది. పెద్ది ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి ఐదు భాషలలో 200 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది. ఏ.ఆర్ రెహమాన్ మ్యూజిక్, రామ్ చరణ్ వైరల్ డ్యాన్స్ తో ఈ సాంగ్ గ్లోబల్ మూమెంట్ గా మారింది. త్వరలోనే మరో పాటని రిలీజ్ చేయబోతున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు, సుకుమార్ రైటింగ్స్ తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ గర్వంగా సమర్పించిన ఈ చిత్రంలో జాన్వి కపూర్ హీరోయిన్.

## మృణాల్ ఠాకూర్..
# పెళ్లి రూమర్స్‌కి చెక్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



ఇండస్ట్రీలో ఒక రూమర్ వచ్చింది అంటే.. అది దావానంలా పాకిపోతుంది. కొన్నిరోజులుగా బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్.. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ పెళ్లి చేసుకోబోతున్నారు అన్న వార్త సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. వీరిద్దరూ కలిసి రెండుసార్లు కనిపించారో లేదో ఇద్దరి మధ్య ప్రేమాయణం నడుస్తుందని రూమర్ క్రియేట్ చేశారు. ఇక ఆ రూమర్ ని వారిద్దరూ ఖండించకపోవడంతో ఫిబ్రవరి 14 పెళ్లి కూడా చేసుకుంటున్నారని మరో పుకారును సృష్టించారు. ఇక మృణాల్ అయితే ఈ వార్తలకు ఆజ్యం పోసినట్లు.. ఆమె పెట్టే ప్రతి పోస్ట్ కి తమిళ్ సాంగ్ ని యాడ్ చేయడంతో.. తమిళమ్మాయిగా మారుతుందిగా.. అందుకే పెడుతుంది అని కామెంట్స్ చేయడం మొదలుపెట్టారు. ఇక ధనుష్ ఎప్పుడు .. రూమర్స్ మీద ఎక్కువ స్పందించడు. తన పని తాను చేసుకుంటూ వెళ్ళిపోతాడు. మృణాల్ సైతం మొదట్లో ఈ రూమర్స్ ని ఈజీగా తీసుకున్నా.. పెళ్లి వార్తలను కొంచెం సీరియస్ గానే తీసుకున్నట్లు కనిపిస్తుంది. తాజాగా మృణాల్ టీమ్.. ఈ పెళ్లి వార్తలను ఖండించింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలిపింది. మృణాల్ ధనుష్ పెళ్లి అంటూ వస్తున్న వార్తలో ఎలాంటి నిజం లేదు. ఫిబ్రవరి 14 న మృణాల్ పెళ్లి చేసుకోవడంలేదు. వచ్చే నెల ఆమె కొత్త సినిమా రిలీజ్ కు సిద్ధమవుతుంది. ఇంకో సినిమా సెట్స్ మీద ఉంది. ఇలాంటి సమయంలో పెళ్లి ఎలా చేసుకుంటుంది. లాజిక్ ఉందా.. ఇక ఈ వార్తను వదిలేయండి. మృణాల్ అప్పుడే పెళ్లి చేసుకోవాలనే ఆలోచనలో లేదు. ఇలాంటి ఆధారాలు లేని వార్తలను నమ్మకండి' అంటూ చెప్పుకొచ్చారు. దీంతో ఈ రూమర్స్ కి చెక్ పడినట్లు అయ్యింది. ధనుష్ సన్నిహితులు సైతం ఇదే మాట చెప్పుకొస్తున్నారు. ఈ వార్తల్లో నిజం లేదు. ఫేక్.. బేస్ లెస్ న్యూస్ అంటూ కొట్టిపారేస్తున్నారు. మరి వీరి పెళ్లి నిజంగా జరుగుతుందా ..? లేదా అనేది తెలియాలంటే వచ్చే నెలవరకు ఆగాల్సిందే.



## 'గాంధీ టాక్స్'
# టీజర్ వచ్చేసింది

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

స్టోరీ టెల్లింగ్‌లో శబ్దంతో నిండిన సినిమా ప్రపంచంలోకి సైలెంట్ ఫిల్మ్ గా రూపొందిన 'గాంధీ టాక్స్' టీజర్ వచ్చేసింది. ఇది నిశ్శబ్దంగానే కాదు.. ధైర్యంగా చేసిన ఓ ప్రయత్నంగా కనిపిస్తోంది. ప్రేక్షకులను ఆకట్టుకునేలా, దృష్టిని మరల్చనీయకుండా, మాటలతో పని లేకుండా రా ఎమోషన్స్ తో, కట్టిపడేసే దృశ్యాలతో, భావోద్వేగ ప్రపంచంలోకి ఆడియెన్స్ ను ఇది ఆహ్వానిస్తోంది. ఒక డైలాగ్ కూడా లేకుండా రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకుల మనసుల్లో అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఉద్వేగ భరితమైన నిశ్శబ్దంతో కూడిన ఈ ఇంటెన్స్ విజువల్స్ మనసుల్లో ఓ సంఘర్షణను, అశాంతి, మార్పును సూచిస్తూ.. గాంధీ నిజంగా ఏదో చెప్పబోతున్నాడనే ఆసక్తిని కలిగిస్తోంది. ఈ టీజర్ మరింత ప్రభావవంతంగా ప్రతి ఫ్రేమ్‌ను గమనించేలా, భావాలను ఫీల్ అయ్యేలా చేస్తుంది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి, అదితి రావ్ హైదరి, సిద్ధార్థ్ జాధవ్ వంటి టాలెంటెడ్ నటీనటులు ప్రధాన పాత్రల్లో నటించిన 'గాంధీ టాక్స్' టీజర్, మాటలు లేకుండానే భావాలను బలంగా వ్యక్తపరిచేలా వారి నటనలోని కొత్త కోణాలను ఆవిష్కరిస్తోంది. కిషోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్ ఎ.ఆర్. రెహమాన్ అందించిన భావోద్వేగభరిత సంగీతం..సినిమాను మరో లెవల్‌కు తీసుకెళ్తోంది. ప్రతి నిశ్శబ్దం, ప్రతి ఘర్షణ, చెప్పని ఆలోచనలన్నింటికీ సంగీతమే భావోద్వేగ స్వరంగా మారుతుంది. జీ స్టూడియోస్ సమర్పణ.. క్యోరియస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, పింక్‌మూన్ మెటా స్టూడియోస్, మూవీ మిల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ అసోసియేషన్‌లో రూపొందిన గాంధీ టాక్స్ సంప్రదాయ సినిమాల హద్దులను ప్రశ్నిస్తూ, నిశ్శబ్దాన్నే కథనంగా అనుభవించే ఒక ధైర్యమైన, విభిన్నమైన థియేట్రికల్ అనుభవాన్ని ప్రేక్షకులకు అందించేలా హామీ ఇస్తోంది. ఈ నెల 30న 'గాంధీ టాక్స్' చిత్రం రిలీజ్ అవుతోంది.



## శర్వానంద్‌కు జోడీగా
# ఆషికా రంగనాథ్?

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

హీరో శర్వానంద్ - శ్రీను వైట్ల కాంబినేషన్ లో రాబోతున్న సినిమాలో హీరోయిన్ పై ఇప్పుడు ఓ కొత్త రూమర్ వినిపిస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ గా ఆషికా రంగనాథ్ ను ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'లో రవితేజ సరసన నటించి ఆకట్టుకుంది ఆషికా రంగనాథ్. ఐతే, ఈ వార్త పై ఇంకా అధికారిక అప్ డేట్ రాలేదు. మరోవైపు శర్వానంద్ ఈ సినిమా కోసం తన లుక్ ను మళ్లీ కొత్తగా ట్రై చేయబోతున్నట్లు తెలుస్తోంది. అన్నట్టు ఈ సినిమా షూటింగ్ మార్చి నుంచి స్టార్ట్ కాబోతున్నట్లు సమాచారం. ముందుగా హీరో శర్వానంద్ పై ఎంట్రీ సీన్స్ ను షూట్ చేస్తారట. ఈ సీక్వెన్స్ కి సంబంధించిన కొన్ని ప్రత్యేకమైన లొకేషన్స్ ను కూడా సెర్చ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐతే, గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ కామెడీ 'విశ్వం' ఏవరేజ్ గా నిలిచింది. దీంతో, ఎలాగైనా మళ్ళీ టాలీవుడ్ లో తన తర్వాత సినిమాతో బిజీ అయ్యేందుకు శ్రీనువైట్ల తెగ కష్ట పడుతున్నాడట. అన్నట్టు ఈ సినిమాలో మరో సీనియర్ హీరో కూడా కనిపిస్తాడని తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**